

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 165 పేజీలు: 10+4 వెల: 6.50


హార్ముజ్ టాక్స్ నిర్ణయంపై ట్రంప్ వెనక్కి
కేతన్ అగర్వాల్ తల్లి ప్రధాని మోడీకి లేఖ
5

15 కోట్లు దాటిన ఇఎస్ఐ లబ్ధిదారులు
6 ఇఎస్ఐసి కేంద్రాలు ప్రారంభించిన కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ



3

కోడలికి మామ ఆస్తిలో పోషణ హక్కు
-సుప్రీం కోర్టు కీలక తీర్పు



5

మహిళల వ్యవసాయ కమతాల్లో స్వల్ప పెరుగుదల
11.98 శాతానికి చేరిన భూ యాజమాన్యం



6

## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు
# రెండేళ్లలో మొదలు

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించండి

కాకతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా వరంగల్ విమానాశ్రయం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సిఎం రేవంత్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై14:** తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు,రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, >>2



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో భేటీ అయిన సిఎం రేవంత్‌రెడ్డి



కాపు ఉద్యమ శిఖరం
## ముద్రగడ ఇకలేరు

హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ కన్నుమూత

నేడు కిర్లంపూడికి పార్థివదేహం

ఎంపి, నాలుగుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రిగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై14, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక ఉద్యమ శకం ముగిసింది. ప్రముఖ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం (73) ఇకలేరు. గత >>2

ఫ్యూచర్ సిటీ - బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్
## రహదారికి అనుమతించండి

-కేంద్ర మంత్రి గడ్కరీతో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 14:** రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో >>2



ఇండో-బ్రిటన్ వాణిజ్య
## ఒప్పందం నేటి నుంచే..

కార్లు, మద్యం, వెండి దిగుమతులపై సుంకాల తగ్గింపు

**న్యూఢిల్లీ,జులై 14:** భారత్-బ్రిటన్‌ల మధ్య పలుమార్లు జరిగిన చర్చల అనంతరం గత ఏడాది జూలై 25న కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం బుధవారం నుంచి అమల్లోకి రానుంది. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో అమల్లోకి వస్తున్న ఆరో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ) ఇదే. అంతకుముందు మారిషస్, యూఏఈ, ఆస్ట్రేలియా, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్, ఒమన్‌లతో ఇలాంటి ఒప్పందాలను భారత్ అమలు చేసింది. గత కొన్నేళ్లలో భారత్ కుదుర్చుకున్న అతిపెద్ద వాణిజ్య ఒప్పందాల్లో ఒకటైన సీఈటీఏ ద్వారా భారత ఎగుమతుల్లో దాదాపు 99 శాతం ఉత్పత్తులకు యూకేమార్కెట్లో సుంకం లేకుండా ప్రవేశం లభించనుంది. ఈ ఒప్పందం వల్ల, రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు, కార్పెట్లు, ప్రాసెస్డ్ ఫుడ్, ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు, చేపలు, మాంసం, ఇతర ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులు వంటి శ్రమాధారిత రంగాల ఉత్పత్తులు ఇకపై యూకే మార్కెట్లో సున్నా సుంకంతో ప్రవేశించనున్నాయి.

## తాడిచర్లతో సింగరేణి
# బంగారు బాట

సంస్థకు కేంద్రం పూర్తి మద్దతు

రాష్ట్ర సర్కార్ బకాయి రూ.54 వేల కోట్లను చెల్లించాలి

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి కాలరీస్‌కు కేటాయించిందని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణికి బకాయి ఉన్న రూ.54 వేల కోట్లను చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ బొగ్గు కంపెనీకి కేంద్రం మద్దతు ఉంటుందని నొక్కి చెప్పారు. తెలంగాణ పట్ల నిబద్ధతతో, సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మోదీ ప్రభుత్వం ఆ కంపెనీకి బ్లాక్‌ను కేటాయించిందని స్పష్టం చేశారు. సింగరేణి భరోసా యాత్ర సందర్భంగా కిషన్‌రెడ్డి కొత్తగూడెం, మణుగూరు తదితర ప్రాంతాల్లో సింగరేణి కార్మికులు, మేధావులను ఉద్దేశించి ప్రసంగిస్తూ సింగరేణి కార్మికులు, స్థానిక నివాసితులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలు దాదాపు 20 సంవత్సరాలుగా ఆబొగ్గుబ్లాక్‌ను సింగరేణి కాలరీస్‌కు కేటాయించాలని కోరుకుంటున్నారని, వీటిని దృష్టిలో ఉంచుకుని తాడిచెర్ల బ్లాక్‌ను కేటాయించిందన్నారు. దేశంలో వేలం లేకుండా ఒక ప్రభుత్వ రంగ బొగ్గు కంపెనీకి కేటాయించబడిన ఏకైక బొగ్గు బ్లాక్ ఇదేనని వ్యాఖ్యానించారు. సింగరేణి ఆదాయాలు తగ్గుతున్న దృష్ట్యా, 40 నుండి 50 సంవత్సరాల పాటు బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్న తాడిచెర్ల2 ఒక విలువైన బొగ్గు బ్లాక్‌గా ఉంటుందని తెలిపారు. ఒకప్పుడు సుమారు 70వేలుగా ఉన్న కార్మికుల సంఖ్య ఇప్పుడు దాదాపు 40 వేల కు పడిపోయిందన్నారు. అలాగే 30 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు తమ జీవనోపాధి కోసం సింగరేణిపై ఆధారపడి ఉన్నారని చెప్పారు. వారి భవిష్యత్తును సురక్షితం చేయడానికి కొత్త బొగ్గు బ్లాక్‌లు అత్యవసరం అని ఆయన స్పష్టం చేశారు. సుమారు రూ. 2.60 లక్షల కోట్ల భారీ బొగ్గు కుంభకోణం నేపథ్యంలో, >>2



సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

# 100 కోట్ల 'అవినీతి'!

ఎసిబి వలలో హెచ్ఎండిఎ సిఇ

భారీగా బంగారం, వెండినగలు, స్థిరచరాస్తి పత్రాలు స్వాధీనం



**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అక్రమాస్తుల కేసులకు సంబంధించి ఎసిబికి పట్టుబడుతున్న వారిజాబితా పెరిగిపోతోంది.గడచిన నెల రోజులుగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ బోర్డు. అబ్కారీ, పోలీసు, వాటర్‌వర్క్స్ విభాగాలకు చెందిన ఆరుగురు ఉన్నతాధికారులు వందలకోట్ల రూపాయల అక్రమాస్తులతో పట్టుబడగా తాజాగా మంగళవారం హెచ్ఎండిఎలో సీఈగా పనిచేస్తున్న రవీందర్ వంద కోట్ల రూపాయల అక్రమాస్తులతో ఎసిబికి దొరికిపోయారు. హెచ్ఎండిఎలో కీలక హోదాలో వుంటూ భూముల లే అవుట్, అనుమతులు జారీ చేసే విభాగంలో చక్రం తిప్పుతున్న రవీందర్‌పై కొంతకాలంగా అవినీతి ఆరోపణలు రాసాగాయి. దీనిపై సమాచారం అందుకున్న ఎసిబి అధికారులు రవీందర్ గోల్‌మాల్ వ్యవహారాలపై నిఘా వుంచారు. ఆయన అక్రమాస్తులు, అడ్డగోలు వ్యవహారాలపై అన్ని వివరాలు సేకరించి ఇవన్నీ నిజమని నిర్ధారించుకున్న తరువాత మంగళవారం ఉదయం ఆయన ఇంటితో పాటు కార్యాలయం సహా బంధువులు, సన్నిహితుల ఇళ్లలో ఏక కాలంలో సోదాలు జరిపారు. మొత్తం 12 బృందాలు సోదాల్లో పాల్గొన్నాయి. ఎసిబి డిఎస్‌పి మజీద్ ఖాన్ ఈ దాడులకు నాయకత్వం వహించారు. దాడుల సందర్భంగా రవీందర్ ఇంట్లో కళ్లు చెదిరే బంగారు, వెండి నగలు, విదేశీ మద్యం బాటిళ్లు, బినామీల పేరిటవున్న స్థిరచరాస్తులు భారీగా పట్టుబడ్డాయి. ఈ దాడుల్లో కొండకల్, కిష్టాపూర్, పస్మామ్లలో 38 లక్షల 89 వేల 700 రూపాయల విలువచేసే ఐదు ప్లాట్లు పట్టు బడ్డాయి. దీంతో పాటు >>2

ఎసిబి వలలో పెద్దపల్లి మున్సిపల్ ఎఇ 3





స్కూళ్లు, కాలేజీల్లో
## సెక్స్ ఎడ్యుకేషన్!

నిర్ణయాన్ని సుప్రీం కోర్టుకు తెలిపిన కేంద్రం

**న్యూఢిల్లీ,జులై 14:** దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో లైంగిక విద్యను ప్రవేశ పెట్టాలని నిర్ణయించినట్టు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించింది. 26 మంది సభ్యులతో కూడిన జాతీయ నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు రూపొందించిన ఈ కార్యక్రమం సుప్రీంకోర్టు ఆమోదం పొందిన తరువాత అమలవుతుంది. ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్‌చట్టం పరిధిలోకి వచ్చే మైనర్లకు >>2

## 'పీకాక్స్'ను కూల్చేస్తాం



ఇరాన్‌పై వరుసగా మూడోరోజు భారీ దాడులు జరిపిన అమెరికా

హార్ముజ్‌పై పూర్తి నియంత్రణ సాధించాం

మౌలిక సదుపాయాలే టార్గెట్: ట్రంప్

**వాషింగ్టన్,జులై 14:** పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింతగా ముదిరింది. ఇరాన్‌పై అమెరికా వరుసగా మూడో రాత్రి కూడా వైమానిక దాడులతో విరుచుకుపడింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యక్ష ఆదేశాలతో యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఈ దాడులను కొనసాగిస్తోంది. అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ నుంచి ముప్పును పూర్తిగా తొలగించే లక్ష్యంతో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అమెరికా ప్రకటించింది. ఇరాన్ తీరప్రాంత నిఘా వ్యవస్థలు, డ్రోన్ కేంద్రాలు, క్షిపణి మౌలిక సదుపాయాలే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపించింది. ఈదాడుల కారణంగా దక్షిణ ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్ట్, కిష్, క్వేష్మ్ దీవులు, బుషెహర్ ప్రావిన్స్‌లోని జామ్ నగరం భారీ పేలుళ్లతో దద్దరిల్లినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ సైనిక చర్య మరో రెండు మూడు వారాల పాటు కొనసాగవచ్చని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచనప్రాయంగా తెలిపారు. ఓ రేడియో ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇరాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. జాగ్రోస్ పర్వతశ్రేణుల్లో అత్యంత పటిష్టమైన భద్రత నడుమ భూగర్భంలో నిర్మించిన పికాక్స్ మౌంటైన్ అణు స్థావరంపై దాడికి తమ సైన్యం సిద్ధంగాఉందని ప్రకటించారు. మేం పికాక్స్ మౌంటైన్‌ను కూల్చివేయబోతున్నాం. సిద్ధంగా ఉండమని ఇరాన్‌కు చెప్పండి. దీన్ని వాళ్లు ఆపలేరంటూ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వ్యూహాత్మక హార్ముజ్ జలసంధిని అమెరికా తన పూర్తి నియంత్రణలోకి తీసుకుంది. ఇటీవల ఒమన్‌తీరంలో ఓ నౌకపై ఇరాన్ దాడి చేయడంతో, ఆ జలసంధికి తామే రక్షణ కల్పిస్తామని ప్రకటించింది. ఇకపై హార్ముజ్ గుండా >>2

మరణశయ్యపై ముజ్తబా 5 ఇరాన్ సైనిక సామర్థ్యం పూర్తిగా నిర్వీర్యం: ట్రంప్

చలో సెక్రటేరియట్ ఉద్రిక్తం 6
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం డిమాండ్

## లక్ష ఎల్ఐజి ఇళ్లు



క్యూర్ పరిధిలో నిర్మించేందుకు 20న శ్రీకారం

పైలట్ ప్రాజెక్టుగా నియోజకవర్గానికి వెయ్యి ఇళ్ల నిర్మాణం: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 14:** గ్రామీణ ప్రాంతాలల్లో ఇందిరమ్మ ఇండ్లతో పెద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం ఇప్పుడు అదే సంకల్పంతో క్యూర్ ప్రాధిలోని పేదల సొంతింటి స్వప్నాన్ని నిజం చేసేందుకు మరో చారిత్రాత్మక అడుగు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో దశల వారీగా లక్ష ఎల్.ఐ.జి. ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని, ఇందుకు సంబంధించి ఇప్పటికే పరిపాలన అనుమతులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయం క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇండ్ల పై హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల పథకానికి శ్రీకారం చూడుతున్నామని ప్రకటించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి పథకానికి సంబంధించిన విదివిధానాలను, దరఖాస్తులఆహ్వానం, అర్హతలు, టెండర్ల ప్రక్రియ, అమలు విధానం తదితర పూర్తి మార్గదర్శకాలను ప్రకటిస్తామని వివరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం >>2



సిబిఎస్ఇ టెన్త్ పాస్‌కు తృతీయ భాష
## అసెస్‌మెంట్ తప్పనిసరి

-బోర్డు ఆదేశం

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 14:** సీబీఎస్ఈ 9, 10 బోర్డు పరీక్షలపై నూతన నిర్ణయం తీసుకుంది. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)-2020 ప్రకారం 9, 10 తరగతుల విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి క్వాలిఫైయింగ్ సబ్జెక్టుగా మార్చింది. 2027-28వసంవత్సరం 10వ తరగతి బోర్డు పరీక్షల్లో మూడో భాష (థర్డ్‌లాంగ్వేజ్) భాగం కాదని, అయితే ఇంటర్నల్ అసెస్‌మెంట్ >>2



జమ్మూ కాశ్మీర్ చందర్‌కోట్ జిల్లాలోని అమర్‌నాథ్ యాత్ర బేస్ క్యాంపులో భక్తులకు ఆహారాన్ని పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

## టెన్త్ పాస్‌కు తృతీయ భాష అసెస్‌మెంట్ తప్పనిసరి

>>మాత్రం తప్పనిసరిగా ఉంటుందని స్పష్టం చేసింది. పదో తరగతి సర్టిఫికెట్ పొందాలంటే థర్డ్ లాంగ్వేజ్ ఇంటర్నల్ అసెస్‌మెంట్ పరీక్ష తప్పనిసరిగా పాస్ కావల్సి ఉంటుంది. విద్యార్థులు ఎంచుకునే మూడు భాషల్లో రెండు కచ్చితంగా భారతీయ భాషలు అయ్యుండాలని స్పష్టం చేసింది. ఈ నెల 10న జారీ చేసిన సీబీఎస్ఈ సర్క్యులర్ ప్రకారం, 2027-28 విద్యా సంవత్సరం నుంచి 10 తరగతి విద్యార్థులు ఆర్3 అని పిలిచే థర్డ్ లాంగ్వేజ్‌పై స్కూల్‌లో అంతర్గతంగా నిర్వహించే అసెస్‌మెంట్‌లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలి. ఒక వేళ ఎవరైనా విద్యార్థి ఈ ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో ఉత్తీర్ణత సాధించకపోతే, అతనికి టెన్త్ పాస్ సర్టిఫికెట్ ఇవ్వరు. బోర్డు పరీక్షల తుది ఫలితాలు ప్రకటించడానికి ముందే, పాఠశాలలు రీఅసెస్మెంట్ నిర్వహించాల్సి ఉంటుందని సీబీఎస్ఈ తెలిపింది. ఒకవేళ దీనిలో కూడా ఉత్తీర్ణత సాధించకపోతే, టెన్త్ క్లాస్ పాస్ సర్టిఫికెట్ ఇస్తారా, ఇవ్వరా అనే విషయంపై సీబీఎస్ఈ క్లారిటీ ఇవ్వలేదు. దాంతోపాటు విద్యార్థుల ఫలితాలను తాత్కాలికంగా నిలిపి ఉంచుతారా? లేదా? అనేది కూడా చెప్పలేదు. సీబీఎస్ఈ బోర్డు పరీక్షల్లో థర్డ్ లాంగ్వేజ్‌పై పరీక్ష పెట్టనప్పటికీ, అంతర్గత మూల్యాంకనంలో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి చేసింది. 9వ తరగతి విద్యార్థులు మూడో భాష అసెస్‌మెంట్‌లో ఫెయిల్ అయినప్పటికీ, వారిని 10వ తరగతికి ప్రమోట్ చేస్తారు. వారు టెన్త్ క్లాస్ చదువుతూనే తమ 9వ తరగతి పెండింగ్ అసెస్‌మెంట్‌ని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ కొత్త విధానం 2026-27లో 9వ తరగతి విద్యార్థులకు, 2027-28 విద్యాసంవత్సరంలోని 10వ తరగతి విద్యార్థులకు వర్తిస్తుంది. ఈ విధానంలో విద్యార్థులు 9వ తరగతిలోనే ఉండిపోకుండా పై తరగతికి వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుంది.

## లక్ష ఎల్ఐజి ఇళ్లు

>> కట్టుబడి ఉందని, తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గానికి కనీసం 500 చొప్పున ఆయా స్థానిక పరిస్థితులనుబట్టి అవసరమైన చోట వెయ్యి వరకు నిర్మిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఎలాంటి ముందుచూపు లేకుండా, హైదరాబాద్ నగరానికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించడంవల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోతామనే ఆందోళనతో చాలామంది అక్కడ నివసించలేకపోయారని అన్నారు.
తమ ప్రభుత్వం మాత్రం పేదల జీవన వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే, వారి ఉపాధి, పిల్లల విద్య, వైద్య సౌకర్యాలు, రవాణా వంటి అంశాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని అత్యంత ముఖ్యమైన ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లను నిర్మిస్తున్నామని, ఆ స్థలములో వారికి వాటా ఇస్తూ యాజమాన్య హక్కు కల్పిస్తూ వారి కుటుంబాలకు శాశ్వత ఆర్థిక భద్రతను కల్పిస్తున్నామన్నారు.
క్యూర్ పరిధిలో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నియోజకవర్గాలల్లో స్థలాలను గుర్తించడం జరిగిందని, ఈ స్థలాలను ఇప్పటికే హౌసింగ్ విభాగం పొజిషన్ లోకి తీసుకుందని, ఎక్కడ ఎన్ని ఇండ్లు, ఎన్ని అంతస్తులు నిర్మించాలి, ఒక్కో ప్లాట్ విస్తీర్ణం, బిల్డింగ్ డిజైన్‌లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి రెండు, మూడు రోజులల్లో తుది రూపును ఇస్తామని వెల్లడించారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి రెండు చోట్ల ఓటుపై క్లారిటీ ఇచ్చిన ఎలక్షన్ కమిషన్

### సరిదిద్దుతున్నామని వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై14:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు రెండు వేర్వేరు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో ఉండటంపై ఎలక్షన్ కమిషన్ వివరణ ఇచ్చింది. ఇది ఓటర్ల జాబితాలో దొర్లిన సాధారణ సాంకేతిక లోపమేనని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా దీనిని సరిదిద్దుతున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారిక ఫ్యాక్ట్ చెక్ తెలంగాణ తన ఎక్స్ ఖాతాలో ప్రకటన విడుదల చేసింది. కొడంగల్, అచ్చంపేట (కొండారెడ్డిపల్లి) నియోజకవర్గాల ఓటర్ల జాబితాల్లో ముఖ్యమంత్రి పేరు (ఎపిక్ నెం: టిఈఎస్0274035) ఉన్నప్పటికీ, ఆయన రెండు చోట్ల ఓటు వేసే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.
ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే ఓటును కొనసాగించాలని, కొండారెడ్డిపల్లి జాబితా నుంచి పేరును తొలగించాలని రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు ఇప్పటికే ఎన్నికల అధికారులకు విన్నవించారు.
2023 ఎన్నికల అఫిడవిట్‌లో వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని నివాసాన్నే ఆయన ధ్రువీకరించగా, అచ్చంపేట నియోజకవర్గంలోని కొండారెడ్డిపల్లి ఆయన స్వగ్రామం. కాగా, నివాసం లేదా వృత్తిరీత్యా ప్రాంతాలు మారినప్పుడు రికార్డులు సకాలంలో అప్‌డేట్ కాకపోవడం, పరిపాలనాపరమైన పరిమితుల వల్ల ఇటువంటి ద్వంద్వ నమోదులు జరుగుతుంటాయని అధికారులు వివరించారు.

## గడ్డి మందు పారాక్వాట్‌పై కేంద్రం నిషేధం: మాజీ ఎంపి వినోద్‌కుమార్ హర్షం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై14:** ప్రాణాంతక కలుపు మందు(గడ్డి మందు) పారాక్వాట్‌పై కేంద్రం నిషేధం విధించింది. ఈ మేరకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మంగళవారం నుంచి దేశంలోని దిగుమతి, తయారీ, అమ్మకం, రవాణా, వినియోగంపై బ్యాన్ ఉంటుందని తెలిపింది. పారాక్వాట్‌ను తయారు చేసే దేశాలు సహా ప్రపంచ వ్యాప్తంగా 70 దేశాల్లో నిషేధం విధించారు. గడ్డి మందు పారాక్వాట్ ను కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నిషేధిస్తూ గజిట్ ను విడుదల చేయడం పట్ల మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గడ్డి మందు పారాక్వాట్ ను నిషేధించాలని గత ఏడాది కాలంగా సామాజిక సంస్థలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తోపాటు ప్రముఖ వైద్యులు మహేష్ రెడ్డితో కలిసి ఆందోళన నిర్వహిస్తున్న తమకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

## స్కూళ్లు, కాలేజీల్లో సెక్స్ ఎడ్యుకేషన్!

>> సంబంధించిన కేసుల పట్ల పెరుగుతున్న ఆందోళనలను పరిష్కరించడంతో పాటు విద్యార్థుల వయసుకు తగిన అవగాహన, పిల్లల భద్రత, ఆరోగ్యకరమైన వికాసాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమ లక్ష్యం. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ముందు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ఈ వివరాలను వెల్లడించారు. 26 మంది సభ్యుల జాతీయ నిపుణుల కమిటీ సూచించిన సిఫారసులను కేంద్రం ఆమోదించినట్లు ఆమె తెలిపారు. సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదిక ప్రకారం పాఠశాలలు, కళాశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే వయసుకు తగిన పాఠ్యాంశాలతో సమగ్ర లైంగిక విద్య ప్రారంభమవుతుంది. కనీసం వారానికి రెండుసార్లు 15 నుంచి 20 నిమిషాలు తప్పనిసరి తరగతులను నిర్వహించేందుకు ప్రతి పాఠశాల ఒక ప్రత్యేక నిపుణులైన ఉపాధ్యాయుడిని నియమించాలని ఆ కమిటీ సిఫారసు చేసింది. ప్రతిపాదిత పాఠ్యప్రణాళిక శరీర భద్రత, పరిశుభ్రత, శరీర భాగాలను అర్థం చేసుకోవడం, సురక్షితమైన, అసురక్షితమైన స్పర్శను గుర్తించడం వంటి ముఖ్యమైన అంశాలపై దృష్టి సారిస్తుంది. విద్యార్థులు పెద్దవారయ్యే కొద్దీ పాఠాలు క్రమంగా కౌమార ఆరోగ్యం, సంబంధాలు, జీవిత నైపుణ్యాల అంశాలను బోధిస్తారు. దేశవ్యాప్తంగా ఏకరీతి పాఠ్యప్రణాళికను రూపొందించాలని కమిటీ సిఫారసు చేసింది. దీనికోసం తల్లిదండ్రుల, సంరక్షకులు, ఉపాధ్యాయుల కోసం క్రమం తప్పకుండా సమావేశాలను నిర్వహించాలని కమిటీ తెలిపింది. పిల్లల వికాస దశలను, వారి భద్రత, శ్రేయస్సును కాపాడటంలో సమగ్ర లైంగిక విద్య ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి ఈ సమావేశాలు కుటుంబాలకు ఉపయోగపడతాయని కమిటీ వెల్లడించింది. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన అదనపు కార్యదర్శి నేతృత్వంలోని ఈ కమిటీలో క్లినికల్ సైకాలజిస్టులు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, న్యాయ నిపుణులు సభ్యులుగా ఉన్నారు. పెరుగుతున్న మైనర్ గర్భాల కేసులు, పోక్సో చట్టం కింద పరస్పర అంగీకారంతో కూడిన కౌమార సంబంధాలను నేరంగా పరిగణించడాన్ని నివారించే మార్గాలను పరిష్కరించాలన్న సుప్రీంకోర్టు ఆదేశం మేరకు కేంద్రం ఈ కమిటీని ఏర్పాటు చేసింది.

### వారం - వర్జ్యం

**15-07-2026, బుధవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**ఆషాఢమాసం, ఉత్తరాయణం**
**గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం,** పునర్వసు కార్తె
పాడ్యమి ఉ.11.54
పుష్యమి రా.9.50
వర్జ్యం : ఉ.7.24-ఉ.8.51
దు. ఉ.11.47-మ.12.39
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** మీ లోని ప్రతిభాపాటవాలు వెలుగు చూసే దిశగా ప్రయాణం చేస్తారు. స్థలాలు కొనుగోలు యత్నాలు చేస్తారు.

**వృషభం:** ఆహార నియమాలు పాటించండి. ప్రకృతి వైద్యం మేలు చేస్తుంది. ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు.

**మిథునం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**కర్కాటకం :** డాక్యుమెంట్లు, ముద్రణా పరమైన రానిబాకీలు, రావలసిన సౌకర్యాలు, ధనప్రాప్తి ఇవి ఇబ్బందులకు గురిచేస్తాయి.

**సింహం:**విదేశాలలోని మీ సన్నిహితుల క్షేమ సమాచారం ప్రశాంతతకు కారణం అవుతుంది. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**కన్య :** శత్రు వర్గంలోని అనైక్యతనుగుర్తించి వారితో ముఖాముఖి పోరాడి లాభపడతారు. ఆహ్వానాలు అందుకుంటారు.

**తుల :** క్రమశిక్షణ పాటించడం వలన లాభపడతారు. ఒకానొక రహస్య సమాచారం తెలుసుకుంటారు.

**వృశ్చికం:** కోర్టుకేసుల నుండి బయటపడతారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. బంధువుల కలయిక.

**ధనుస్సు:** పెదవి దాటడం వలన ఇబ్బందులను కొని తెచ్చుకోవడం అవుతుంది. జాగ్రత్త వహించండి.

**మకరం:** ఓర్పు, నేర్పులు మేలు చేస్తాయి. యుక్తితో సమస్యల వలయాల నుండి బయటపడతారు. వాహనసౌఖ్యం కలదు.

**కుంభం:** కార్యాలయంలో సెలవు కోసం మీరు చేసే యత్నాలు ఫలవంతం కాక పోవచ్చు. మధ్యవర్తిత్వాలు చేయకండి.

**మీనం :** బంధువుల నుండి మాట సహాయం అందుకుంటారు. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎయిర్‌పోర్టులు రెండేళ్లలో మొదలు

>>ఇతర పరిశ్రమలతో వరంగల్ కీలక నగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండ జిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలు (ఎఫ్‌టిఓ)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ సమీర్ కుమార్ సిన్హా, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకు సహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏవైనా సమాచారలోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీకి వస్తున్నామని, దానిపైనా రాజకీయంగా విమర్శలు చేయడం తగదని సీఎం హితవు పలికారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలనేదే తన లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.
కొన్ని సమస్యలకు చర్చలే పరిష్కారమని, వాటి కోసమే ఢిల్లీకి వచ్చినట్లు తెలిపారు. కేంద్రమంత్రులను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నామని, తన ఢిల్లీ పర్యటనపై వస్తున్న విమర్శలను పట్టించుకోబోనని తేల్చి చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో తాము సఖ్యతనే కోరుకుంటున్నామన్నా ఆయన పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మరోసారి ఢిల్లీ వస్తానని చెప్పారు. తెలంగాణ సమస్యలపై కేంద్రమంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయనున్నట్లు పేర్కొన్నారు.
విమానాశ్రయాలతోనే అనేక దేశాలు అభివృద్ధి చెందాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్రాలు పోటీపడుతున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనంత త్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్ర సృష్టించిందని ఆయన అభినందించారు. ఇంత త్వరగా స్పందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. భూ సేకరణ, ఇతర అంశాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ మాదిరే స్పందించాలని కేంద్రం మంత్రి సూచించారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలా విమానాశ్రయ డిజైన్ ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

## ఫ్యూచర్ సిటీ - బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతించండి

>> ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షి ణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్‌ఆర్‌ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుతుందని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా న్యూఢిల్లీలో మంగళవారం జాతీయ యుద్ధ స్మారకం నుంచి కార్గిల్ యుద్ధ స్మారకం వరకు 13 రోజుల పాటు జరిగే 'శౌర్య విజయ్ యాత్ర'ను జెండా ఊపి ప్రారంభిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్

## కాపు ఉద్యమ శిఖరం ముద్రగడ ఇకలేరు

>> కొంతకాలంగా శ్వాసకోశ, కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన ఇకలేరన్న వార్త వెలువడడంతో రాష్ట్రంలో కాపుసామాజిక వర్గంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. గత నెల రోజులుగా ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ముద్రగడ పరిస్థితి విషమించడంతో మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు ధృవీకరించాయి.

**ముద్రగడ ప్రస్థానం**

1953 జనవరి 22న తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో రాజకీయ కుటుంబంలో ముద్రగడ పద్మనాభం జన్మించారు. ఆయన తండ్రి వీర రాఘవరావు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి రెండుసార్లు స్వతంత్ర ఎమ్మెల్యేగా పనిచేశారు. తండ్రి మరణానంతరం మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి సూచనతో ముద్రగడ రాజకీయాల్లోకి అడుగుపెట్టి 1978లో జనతా పార్టీ తరపున ప్రత్తిపాడు నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైయ్యారు. అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి, ప్రత్తిపాడు నుండి గెలిచి ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా సేవలు అందించారు. 1989 వరకు తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో నాలుగు సార్లు శాసనసభ్యుడిగా, రెండు సార్లు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 19992004 మధ్య కాకినాడ నియోజకవర్గం నుండి ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఎన్నికల ముందు 2024 మార్చిలో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.
1988లో ఉత్తరకొంచి సంఘటనలోనూ తన అనుచరులు బాసటగా న్యాయం కోసం పోలీస్ స్టేషన్ లో కేసులు వ్యతిరేకిస్తూ ఉద్యమం నడిపారు రోజులు గడుస్తున్నా స్పందించని పాలకులు తీరుకు నిరసిస్తూ అమరణ దీక్షకు ప్రకటించారు దీంతో దిగివచ్చిన పాలకులు కేసులు ఎత్తి వేశారు. దీనికి సంఘీభావం పలికిన కాపులతో కాపుల నేతగా మరింత బలపడ్డారు. కాపు రిజర్వేషన్ల పోరాట యోధుడుగా చరిత్రలో నిలిచిపోయే ముద్రగడ సామాజిక న్యాయం కోసం, ముఖ్యంగా కాపు సామాజిక వర్గ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ నేతగా ఆయన నిలిచిపోయారు.
ముద్రగడ పద్మనాభం పేరు వినపడగానే గుర్తుకు వచ్చేది కాపు ఉద్యమం. 1994 అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి పై కాపు సామాజిక వర్గ హక్కుల కోసంపోరాటం చేశారు. కాపులను వెనుకబడిన తరగతుల (బిసి) జాబితాలో చేర్చాలంటూ ఆయన దశాబ్దాల పాటు చేసిన ఉద్యమాలు, పాదయాత్రలు, తిరుపతి వరకు సైకిల్ ర్యాలీ, తన స్వగృహంలో ఆమరణ నిరాహార దీక్షలు చరిత్రలో నిలిచి పోయాయి. కిర్లంపూడి వేదికగా సాగిన కాపు ఉద్యమానికి ఆయనే ప్రధాన కేంద్రబిందువుగా నిలిచారు. పంతం పట్టుదలకు కూడా ఆయన పెట్టింది పేరు. అనుకున్న న్యాయం కోసం తన పదవులను సైతం తృణప్రాయంగా వదిలేసిన ఘనత ఆయనకే దక్కింది. యావత్ రాష్ట్రాన్ని తనవైపుచూసేలా అనేకసార్లు ఉద్యమాలు చేసిన ఆయన ఉద్యమ నేతగా పేరొందారు. ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి కల్పించిన ముద్రగడ ఏ పని తలపెట్టిన ఓ ప్రత్యేకత ఉండేది. 2016లో తుని ప్రాంతంలో జరిగిన కాపు ఐక్య గర్జనలో జరిగిన హింసాత్మక సంఘటన తర్వాత ఉద్యమం మరో మలుపు తిరిగింది. ముద్రగడ పద్మనాభం హఠాన్మరణం పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు రాజకీయ నేతలు, వివిధ పార్టీల ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాపు సామాజిక వర్గానికి, ఏపీ రాజకీయాలకు ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. ముద్రగడ పార్థివ దేహాన్ని బుధవారం ఆయన స్వగ్రామమైన కిర్లంపూడికి తరలించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కిర్లంపూడి మండలంలో వర్తక సంఘం స్వచ్ఛంద బందుకు పిలుపునిచ్చారు అక్కడ అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఉంచిన అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**నివాళులర్పించిన సిఎం రేవంత్, మాజీ సిఎం కెసిఆర్**

ముద్రగడ పద్మనాభం మృతిపట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. ముద్రగడ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ముద్రగడ పద్మనాభం మృతి పట్ల తెలంగాణా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ముద్రగడ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ మంత్రులు కె, కేశవరెడ్డి, జానారెడ్డిలు ముద్రగడ మృతికి సంతాపం వ్యక్తం చేసారు.

## 'పీకాక్స్'ను కూల్చేస్తాం

>> ఇరాన్ నౌకలు గానీ, ఇరాన్ వినియోగదారుల నౌకలు గానీ ప్రయాణించకుండా పూర్తి దిగ్బంధం విధిస్తున్నట్లు ట్రంప్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇతర దేశాల వాణిజ్య నౌకల భద్రత కోసం, ప్రయాణ రుసుము కింద అదనంగా 20 శాతం టోల్ వసూలు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచ ముడిచమురు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధి తమ సార్వభౌమత్వంలోనిదని, అమెరికా అక్రమ జోక్యాన్ని సహించబోమని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) స్పష్టం చేసింది. ఈ దాడులతో ఇరు దేశాల మధ్య కుదిరిన 60 రోజుల తాత్కాలిక శాంతి ఒప్పందం పూర్తిగా నీరుగారిపోయింది. ఈ పరిణామాలు పూర్తిస్థాయి యుద్ధానికి దారితీస్తే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, భద్రతపై వినాశకరమైన ప్రభావం పడుతుందని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

## 100 కోట్ల 'అవినీతి'!

>> నార్సింగి, నానక్‌రాం గూడలో రెండు కోట్ల ఏడు లక్షల 40 వేల రూపాయల విలువచేసే నాలుగు ఇళ్ల ప్లాట్లు వెలుగు చూశాయి. దీంతోపాటు కొత్తూరు మండలం గూడు రులో ఆరులక్షల రూపాయల ఖరీదుచేసే నాలుగుఎకరాల వ్యవసాయ పొలం, శంకర్‌ప ల్లి మండలం మోకిల గ్రామంలో కోటీ 33 లక్షల రూపాయల విలువచేసే విల్లా, కొండాపూర్‌లోని మస్‌బండలో మూడు కోట్ల రూపాయల వి లువచేసే జి ప్లస్ 4 భవనం తాలూకు పత్రాలు పట్టుబడ్డాయి. ఇవన్నీ రవీందర్‌తో పాటు ఆయన బినామీల పేరిట వున్నాయి. కాగా రవీందర్ ఇంట్లో జరిగిన సోదాల్లో మూడు లక్షల 82 వేల రూపాయల నగదు, 45 లక్షల 5276 రూపాయల బ్యాంకు బ్యాలెన్స్, 1.440 కిలోల బం గారు నగలు, (వీటి విలువ 36 లక్షల 70 వేల రూపాయలు) 12.5 కిలోల వెండి నగలు (వీటి విలువ పది లక్షల రూపాయలు, 17 లక్షల 24 వేల రూపాయల గృహోపకరణ వస్తువులు, తొమ్మిది లక్షల 32 వేల రూపాయల విద్యుత్ వస్తువులు, కోటి 16 లక్షల రూపాయల నాలుగు కార్లు, 18 విదేశీ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. అక్రమాస్తుల కేసులో రవీందర్‌ను అరెస్టు చేసిన ఎసిబి అధికారులు ఆయనను నాంపల్లిలోని ఎ సిబి కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు. ఆయన వద్ద లభించిన అక్రమాస్తుల విలువ తొమ్మిది కోట్ల 24 లక్షల2276రూపాయలుగా తేలిందని ఎసిబి అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ వంద కోట్ల రూపాయల వరకు వుంటుందని వారు తెలిపారు.

## సింగరేణి బంగారు బాట

>> మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం చేసిన బొగ్గు బ్లాకుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని వెల్లడించారు. భవిష్యత్తులో బొగ్గు బ్లాకుల కేటాయింపులను ప్రభుత్వ లేదా ప్రైవేట్ సంస్థలకు వేలం ద్వారా చేయాలని 2014లో కోర్టు ఆదేశించిందని ఆయన వివరించారు. దాదాపు 11 సంవత్సరాల తర్వాత, వేలం లేకుండా నేరుగా సింగరేణికి కేటాయించబడిన ఏకైక బొగ్గు బ్లాక్ తాడిచెర్ల2గా పేర్కొన్నారు. తెలంగాణ విద్యుత్ అవసరాలను తీర్చడానికి కేంద్రం ఇప్పటికే ఒడిశాలోని నైని బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిందని, ఇది సింగరేణికి కేంద్రం మద్దతును రుజువు చేస్తుందని తెలియచేశారు. సింగరేణికి చెల్లించాల్సిన రూ. 54,000 కోట్ల బకాయిల చెల్లింపు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ నిరక్ష్యంగా వ్యవహరించాయని విమర్శించారు. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం కూడా గణనీయమైన మొత్తాన్ని చెల్లించాల్సి ఉందని చెప్పారు. సింగరేణికి రావలసిన నిధులు ప్రభుత్వాల దానధర్మాలు కాదని, అవి తమ కార్మికుల చెమటతో ఆర్జించిన ఆదాయమని ఆయన అన్నారు. కేవలం హామీలు ఇవ్వడానికే పరిమితం కాకుండా, సింగరేణికి రావలసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## కడియంపై మీనాక్షి నటరాజన్‌కు మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై14:** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షినటరాజన్ వద్దకు చేరింది. మీనాక్షినటరాజన్‌తో మంత్రి కొండా సురేఖ భేటీ అయి కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదాల్లోకి లాగుతున్నారని మీనాక్షిదృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన అన్ని అంశాలను వివరించారు. సురేఖ వివరించిన అంశాలను ఓపికగా విన్న మీనాకినటరాజన్ సంయమనం పాటించాలని సూచించారు. చిన్నచిన్న విషయాలను పెద్దగా పట్టించుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ వివాదంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి కడియంపై సురేఖ ఫిర్యాదు చేశారు.

# నేడు ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ

## 3 జిల్లాల్లో పర్యటించనున్న సిఎం రేవంత్‌రెడ్డి.. షెడ్యూల్ ఖరారు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 14:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో పర్యటించి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్ భూమిపూజ చేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజా సెల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించనున్నారు. అలాగే వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. సీఎం రేవంత్ రెడ్డి అధికారిక పర్యటన షెడ్యూల్ ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీకి బయలుదేరుతారు. 12:15 గంటలకు ఫ్యూచర్ సిటీలోని అమెజాన్ డేటా సెంటర్ వేదికకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12:15 నుంచి 12:45 గంటల మధ్య అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ చేస్తారు. అనంతరం 12:50 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లికి పయనమవుతారు. మధ్యాహ్నం 1:15 గంటలకు దివిటిపల్లి చేరుకుని, 1:20 నుంచి 2:20 గంటల మధ్య అమరరాజా సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవం, ప్లాంట్ సందర్శన, అనంతరం ప్రసంగం చేయనున్నారు. మధ్యాహ్నం 2:20 గంటలకు దివిటిపల్లి నుంచి వనపర్తి జిల్లా కొత్తకోటకు హెలికాప్టర్‌లో సీఎం రేవంత్ బయలుదేరుతారు. మధ్యాహ్నం 2:40 గంటలకు కొత్తకోటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2:45 నుంచి 3:45 గంటల మధ్య బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం 3:45 గంటలకు కొత్తకోట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.




డిజిపి సి.వి.ఆనంద్‌తో బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్‌జరీన్ భేటీ అయిన దృశ్యం.

# డిజిపి ఆనంద్‌తో బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్‌జరీన్ భేటీ

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** ప్రపంచ బాక్సింగ్ మాజీ ఛాంపియన్ తెలంగాణ పోలీసు శాఖలో డిఎస్‌పిగా వున్న నిఖత్ జరీన్ మంగళ వారం నాడు డిజిపి సి.వి ఆనంద్‌తో భేటీ అయ్యారు. డిజిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా నిఖత్‌జరీన్ డిజిపిని కలిసి ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో గతంలో తాను సాధించిన విజయం తాలూకు జెర్సీని అందజేశారు. డిజిపి ఆనంద్, నిఖత్ జరీన్‌ను అ భినందించారు. బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో అనేక పతకాలు సాధించిన నిఖత్ జరీన్ భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాక్షించారు. ఆమె సాధించిన విజయాలు దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, పోలీసు శాఖకు కూడా ఎంతో పేరు తెచ్చాయని డిజిపి అన్నారు. యువతకు ముఖ్యంగా మహిళా క్రీడాకారులకు ఆమె ఒక రోల్ మాడల్ అని డిజిపి అభివర్ణించారు. తాను కూడా క్రీడాకారుడిని అయినందున క్రీడల్లో వుండే కఠినమై న క్రమశిక్షణ గురించి తెలుసునని ఆయన అన్నారు. నిఖత్ జరీన్‌ను డిజిపి ఆనంద్ అభినంది ంచారు. అనంతరం నిఖత్ జరీన్ మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి పోలీసు శాఖలో డిఎస్‌పిగా ఉద్యోగం ఇచ్చిన సర్కారుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది తనకు లభించిన గొప్ప గౌరవంగా ఆమె తెలిపారు. భవిష్య త్తులో తాను మరింతగా రాణించి రాష్ట్రానికి, పోలీసు శాఖకు పేరు ప్రఖ్యాతలు తెస్తానని ఆమె చెప్పారు.

# ఎసిబి వలలో పెద్దపల్లి మున్సిపల్ ఎఇ

## రూ. 2 లక్షలు చేతులు మారుతుండగా దొరికిన వైనం

## ఇంట్లో నోట్ల కట్టల గుట్టలు

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయం కేంద్రంగా సాగుతున్న లంచాల పర్వానికి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గట్టి షాక్ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని తెనుగువాడ హిందూ స్మశాన వాటిక అభివృద్ధి, అలాగే కూనారం రోడ్డు స్మశాన వాటిక పనుల ప్యాకేజీ9 కింద చేపట్టిన రూ. 12,28,748 కాంట్రాక్ట్ పనుల ఫైనల్ బిల్లును ప్రాసెస్ చేసేందుకు సదరు అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) కల్లెపల్లి సతీష్ కుమార్ రూ. 2 లక్షల లంచం డిమాండ్ చేశారు. నిధుల మంజూరు కోసం ఫైలును ఉన్నతాధికారులకు ఫార్వార్డ్ చేయాలంటే లంచం ఇవ్వాల్సిందేనని కాంట్రాక్టరును పట్టుబట్టడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. ఈ క్రమంలో మంగళవారం కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ గట్ల మహేందర్ రెడ్డి యూనిట్ అధికారులు అత్యంత వ్యూహాత్మకంగా ఏఈ నివాసంపై మెరుపు దాడి చేసి, లంచం సొమ్ము తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే ఏసీబీ డీఎస్పీగా గట్ల మహేందర్ రెడ్డి ఛార్జ్ తీసుకున్న మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించేలా ఈ దాడులు



చేపట్టారు. అవినీతి అధికారి నుంచి లంచం తీసుకున్న రూ. 2,00,000 నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఏసీబీ వేట అక్కడితో ఆగలేదు. సదరు అధికారి ఇంట్లో ఏసీబీ బృందాలు జరిపిన ఆకస్మిక గృహ సోదాలలో ఊహించని విధంగా భారీగా అక్రమ నగదు బయటపడింది. ఎలాంటి లెక్కపత్రాలు లేని రూ. 32,31,900 అదనపు నగదును అధికారులు గుర్తించి సీజ్ చేశారు. తన అధికారిక పదవిని దుర్వినియోగం చేస్తూ అక్రమార్జనకు పాల్పడిన నిందితుడిని అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. ఆయనను అరెస్ట్‌చేసి కరీంనగర్‌లోని ప్రత్యేక ఏసీబీ న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

# 15 కోట్లు దాటిన ఇఎస్‌ఐ లబ్ధిదారులు

## వర్చువల్‌గా ఆరు ఇఎస్‌ఐసి కేంద్రాలు ప్రారంభించిన కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ

## సనత్‌నగర్ ఆస్పత్రిలో కొత్త ఒపిడి భవనం ఆరంభం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 14, ప్రభాతవార్త:** సనత్‌నగర్‌లోని ఇఎస్‌ఐసి ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన ఔట్‌పేషెంట్ విభాగం (ఒపిడి) భవనాన్ని మంగళ వారం కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో గత 12 యేళ్లలో కార్మికులకు కొత్త గౌరవం లభించడంతో పాటు వారి భవిష్యత్తుకు భద్రత కల్పించే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతు న్నాయన్నారు. అలాగే, దేశవ్యాప్తంగా ఈఎస్‌ఐసీ లబ్ధిదారుల సంఖ్య గత 12 ఏళ్లలో 7.5 కోట్ల నుంచి 15 కోట్లకు పైగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వైద్య సేవలను విస్తరిస్తోందని చెప్పారు. సనత్‌నగర్ ఈఎస్‌ఐసీ ఆసుపత్రిలో నూతన ఓపీడీ భవనం ప్రారంభం ద్వారా కార్మికులు, వారి కుటుంబసభ్యులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నా యన్నారు. తెలంగాణలో ఇఎస్‌ఐసి సేవల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ కేంద్ర కార్మిక శాఖ మంత్రి నాయకత్వంలో ఒఎస్ఐ రంగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సనత్ నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో కార్డియాక్ సెంటర్, డయాలసిస్, ఆధునిక క్యాన్సర్ చికిత్స వంటి అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ఉన్నతాధికారులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలోని మరో ఆరు ఇఎస్‌ఐసి హెల్త్‌కేర్ ప్రాజెక్టులను కేంద్ర మంత్రి వర్చువల్‌గా ఇక్కడి నుంచి ప్రారంభించారు.




ఇఎస్‌ఐసి ఒపిడి విభాగాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవియా, మంత్రి వివేక్ వెంకటస్వామి

# సిజిహెచ్‌ఎస్ టారిఫ్‌తో కొత్త ఇహెచ్‌సిటిలో సేవలను అందించలేం

## నిర్ణయాధికార మండలి, కమిటీల్లో నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలి

## గత బకాయిలను పూర్తిగా చెల్లించాలి

## ఇహెచ్‌సిటి సిఇఒకు రాష్ట్ర నెట్‌వర్క్ హాస్పిటళ్ల అసోసియేషన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** సీజీహెచ్‌ఎస్ టారిఫ్‌తో కొత్త ఈహెచ్‌సీటీలో సేవలను అందించలేమని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. కొత్త రేట్లను శాస్త్రీయంగా నిర్ణయించి అమలు చేస్తేనే నూతన ఈహెచ్‌సీటీని అమలు చేస్తామని అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు ఎంప్లాయిస్ హెల్త్‌కేర్ ట్రస్ట్(ఈహెచ్‌సీటీ) సీఈవో హనుమంతుని అసోసియేషన్ నేతలు మంగళవారం కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుత ఆరోగ్యశ్రీ, పాత ఈహెచ్‌ఎస్ ప్యాకేజీ రేట్లతో ప్రతిపాదిత ప్యాకేజీ రేట్లు గణనీయంగా తక్కువగా ఉన్నందున, ఈ పథకం ఆసుపత్రులకు ఆర్థికంగా లాభదాయకం కాదని, అందువల్ల సవరించిన సీజీహెచ్‌ఎస్ టారిఫ్‌తో ప్రతిపాదిత నూతన ఈసీహెచ్‌టీ పథకాన్ని తమ సభ్య ఆసుపత్రులు ఈ పథకం కింద సేవలను అందించబోవని అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వద్ది రాజు రాకేష్ తెలిపారు. రాకేషన్ నేతృత్వంలో తానా ప్రతినిధులు సీఈఓతోపాటు ఇతర సీనియర్ అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. సమా వేశంలో ప్రతిపాదిత నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్/ఈహెచ్‌సీటీ) లబ్ధిదారులకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించడంలో నెట్‌వర్క్ ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. ప్రస్తుత ఆరోగ్యశ్రీ, పాత ఈహెచ్‌ఎస్ ప్యాకేజీ రేట్లతో పోలిస్తే ప్రతిపాదిత ప్యాకేజీ రేట్లు గణనీయంగా తక్కువగా ఉన్నందున, ఈ పథకం ఆసుపత్రులకు ఆర్థికంగా లాభదాయకం కాదని, అందువల్ల సవరించిన సీజీహెచ్‌ఎస్ టారిఫ్‌తో ప్రతిపాదిత నూతన ఈహెచ్‌సీటీ పథకాన్ని అమలు చేస్తే, తమ సభ్య ఆసుపత్రులు ఈ పథకం కింద సేవలను అందించబోవని తానా ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. వాస్తవికమైన, స్థిరమైన ప్యాకేజీ రేట్లను ఖరారు చేయనంత వరకు, కొత్త పథకంలో నెట్‌వర్క్ ఆసుపత్రులు సమర్థవంతంగా పాల్గొనడం కష్టమవుతుందని సంఘం స్పష్టం చేసింది. నిర్ణయాధికార మండలి, కమిటీలలో నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. నెట్‌వర్క్ ఆసుపత్రులు విధాన నిర్ణయాలలో నేరుగా పాల్గొనడానికి, కార్యాచరణ సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన వారికి నిరంతరాయ ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి వీలుగా, గవర్నింగ్ బోర్డ్‌తో సహా అన్ని కీలక కమిటీలలో వివిధ వైద్య విభాగాల నుండి కనీసం 10 మంది ప్రతినిధులను చేర్చాలని తానా డిమాండ్ చేసింది. గత ఈహెచ్‌ఎస్‌లోని ప్రధాన లోపాలలో ఒకదానిని పరిష్కరిస్తూ, కొత్త ఈహెచ్‌ఎస్/ఈహెచ్‌సీ కింద పటిష్టమైన, పారదర్శకమైన, కాలపరిమితితో కూడిన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఆసుపత్రులు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను కొనసాగించడానికి ఆర్థికంగా సిద్ధంగా ఉండేలా చూసేందుకు, కొత్త ఈహెచ్‌ఎస్/ఈహెచ్‌సీటీ అమలు చేయడానికి ముందే, పాత ఈహెచ్‌ఎస్ కింద ఉన్న అన్ని బకాయిలను తక్షణమే విడుదల చేయా లని అసోసియేషన్ డిమాండ్ చేసింది.

# తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ భట్టు రమేష్ నియామకం

## ఉత్తర్వులు జారీ చేసిన విద్యా శాఖ కార్యదర్శి



**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ భట్టు రమేష్‌ను నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం జారీ చేశారు. సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర, సంస్కృతి, పర్యాటక శాఖకు చెందిన ప్రొఫెసర్ భట్టు రమేష్‌ని తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా ఒక సంవత్సరం కాలానికి, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే అమల్లోకి వచ్చేలా ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటి వరకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీదేవసేనని తెలుగు అకాడమీ డైరెక్టర్ పదవి పూర్తి అదనపు బాధ్యతల నుండి తక్షణమే రిలీవ్ చేయడం జరిగిందని ఉత్తర్వులో పేర్కొన్నారు. సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌ని ప్రొఫెసర్ భట్టు రమేష్‌ని తక్షణమే విధుల నుండి విడదల చేయాలని కోరారు.




గన్‌పార్కు వద్ద జరిగిన విద్యార్థుల ధర్నాలో పాల్గొన్న వి.హనుమంతరావు, వి.శ్రీనివాస్‌గౌడ్, వేముల రామకృష్ణ, గుజ్జ కృష్ణ తదితరులు

# విద్యార్థులపై రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను ఎత్తివేయాలి

## ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 14, ప్రభుతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులపై రెవిన్యూ రికవరీ యాక్ట్‌ను ఎత్తి వేయాలని, ఫీజుల బకాయిలను ఆపవద్దని సిఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ మాజీసభ్యుడు వి.హనుమంతరావు చెప్పారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర బిసి విద్యార్థి జెఎసి అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆనేక మంది విద్యార్థులు ఫీజుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ గన్‌పార్కులోని అమర వీరుల స్థూపం వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుడుతున్న సిఎం విద్యార్థుల జీవతాలపై ఆధారపడ్డ ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరారు. రాష్ట్ర మాజీ మంత్రి వి.శ్రీవాస్‌గౌడ్ మాట్లాడుతూ ఫీజులు చెల్లించలేక ఆనేక మంది విద్యార్థులు సీట్లు వదులుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థులపై చిన్న చూపు చూడరాదని, ఫీజుల బకాయిల విడుదలలో జాప్యం తగదన్నారు. తక్షణమే ఫీజుల బకాయిలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. వేముల రామకృష్ణ మాట్లాడుతూ ఫీజుల రీయంబర్స్‌మెంట్‌పై పూటకో మాట మాట్లాడరాదని, ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్రను మానుకోవాలని, విద్యా శాఖపై అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. పాత పద్దతిలోనే ఫీజుల బకాయిలు 8 వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎఐసిసి నేత రాహుల్‌గాంధీ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి కో-ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, ఉదయ్‌నేత, విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి సానియా. వినయ్, వాణి, హరిత, పల్లవి, నందిని తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ షాపింగ్‌లో నకిలీ ఆఫర్లు

## పండుగ సీజన్ల వేళ అప్రమత్తంగా ఉండాలంటున్న టిజిసిఎస్‌బి

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** ఆషాఢ మాసం మొదలవుతున్నవేళ దేశ వ్యాప్తంగా అన్ని సంస్థలు ఆఫర్లు ప్రకటించడం తెలిసిందే. ముఖ్యంగా బట్టల విషయంలో ఇవి ఎక్కువగా వుండడం విదితమే. సరిగ్గా ఈ తరుణంలోనే సైబర్ నేరగాళ్లు ప్రముఖ ఈ కామర్స్ కంపెనీల పేరిట నకిలీ ఆఫర్లు ప్రకటిస్తూ అమాయకులను ముంచేందుకు వ్యూహాలు సిద్ధం చేశారని తెలం గాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) హెచ్చరించింది. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులతో పాటు ఇన్‌స్టాగ్రాం, మెయిల్ ద్వారా సైబర్ నేరగాళ్లు ఈ మోసాలకు శ్రీకారం చుట్టార ని టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పండగ సీజన్ల వేళ అమాయకును మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్లను వాడుతూ ప్రముఖ ఈ కామర్స్ కంపెనీలు, బడా సంస్థల పేర్లను దుర్వి నియోగం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు. నమ్మలేని విధంగా అతితక్కువ ధరలకు బ్రాండెడ్ కంపెనీల దుస్తులు, ఇతర వస్తువులను అమ్ముతున్నట్లు, మరికొన్ని నిమిషాల సమయం మాత్రమే వుందని, వెంటనే త్వరపడాలని సైబర్ నేరగాళ్లు నమ్మబలుకుతారని ఆమె వెల్లడించారు. వీటిని ఎవరైనా నమ్మితే వెంటనే ఆయా కంపెనీల పేర్లను వాడుతూ లింకులు పంపుతారని, వీటిని క్లిక్ చేస్తే క్షణాల్లో బ్యాంకులోని నగదు కాజేస్తారని శిఖా గోయల్ తెలిపారు. దీంతోపాటు క్యూఆర్ కోడ్, యుపిఎల్ ద్వారా చెల్లింపులు కోరతారని, ఇలాంటి వాటిని ఎవరూ నమ్మవద్దని ఆమె కోరారు. సోషల్ మీడియాతోపాటు ఆయా ప్లాట్ ఫారంలపై వచ్చే ఆఫర్ల విష యంలో వినియోగదారులు నిరంతరం అప్రమత్తంగా వుండాలని గుడ్డిగా దేనిని నమ్మవద్దని ఆమె కోరారు. ఎక్కడైనా ఆఫర్ వుందని ఎవరైనా చెబితే ఒకటికి పదిసార్లు తనిఖీ చేసుకోవాలని, అంతా సవ్యంగా వుందని నమ్మిన తరువాత ముందుకు వెళ్లాలని శిఖాగోయల్ తెలిపారు. ఇందుకోసం జరిపే చెల్లింపులను సురక్షితమైన ప్లాట్‌ఫారంలనే వాడాలని ఆమె కోరారు. ఒకవేళ ఎవరైనా మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని, దీనికి సంబంధించిన వివరాలను పోలీసులకు అందజేయాలని, బ్యాంకుల అధికారులకు సంప్రదించి లావాదేవీలను ఆపాలని కోరాలని శిఖాగోయల్ తెలిపారు.

# ఇ-20 పెట్రోల్ ధరలు తగ్గాల్సిందే



## చర్చించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ప్రధాని మోడీకి కేజ్రీవాల్ లేఖ

**న్యూఢిల్లీ, జులై 14:** ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై వ్యక్తమవుతున్న ఆందోళనపై చర్చించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. ఒకవేళ మాట్లాడేందుకు అవకాశం ఇస్తే ఇ-20 పెట్రోల్ కు సంబంధించిన సాంకేతిక సమస్యలను, ప్రజల నుంచి తనకు వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను మోడీకి వివరిస్తానని పేర్కొన్నారు. పెట్రోల్ బంకుల్లో ఇ-20 పెట్రోల్‌తోపాటు, స్వచ్ఛమైన పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉం చాలని విజ్ఞప్తి చేశారు. ఇ-20 పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ బంకుల్లో స్వచ్ఛమైన పెట్రోల్ లేదా ఇ-20 పెట్రోల్ కొనుగోలు చేసే అవకాశం వినియోగదారులకే ఉండాలని కేజ్రీవాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఎవరికైనా స్వచ్ఛమైన పెట్రోల్ కావాలంటే వారికి ఆ ఆప్షన్ ఉండాలి. అలాగే ఇథనాల్ కలిపిన పెట్రోల్ కావాలంటే వారికి ఆ ఛాయిస్ కూడా ఉండాలని అన్నారు. ఇ-20 పెట్రోల్‌కు సంబంధించి ప్రజలతో మాట్లాడి, వారి ఆందో ళనలను అర్థం చేసుకున్న తర్వాతే తాను ప్రధాని మోడీకి లేఖ రాశానని తెలి పారు. సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే, ఇథనాల్ కలిపిన ఇంధనం (ఈ20) తక్కువ మైలేజీని ఇస్తుందని, అందువల్ల ఇ-20 పెట్రోల్ ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలు ఇ-20 పెట్రోల్‌తో ఎదురవుతున్న అనుభ వాలను స్వయంగా తెలియజేయడానికి తమ పార్టీ తరఫున ఒక ఆన్‌లైన్ పిటిషన్‌ను ప్రారంభించినట్లు కేజ్రీవాల్ తెలిపారు. దీనిని ఉపయోగించుకొని మైలేజీ, ఇతర సమస్యలపై ప్రజలు తమ ఆందోళనలను పంచుకోవాలని ఆయన కోరారు. ఈ పిటిషన్‌పై పెద్దసంఖ్యలో సంతకాలు చేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలా సేకరించిన ప్రజా స్పందనలను తాను స్వయంగా ప్రధానికి సమర్పిస్తానని అన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

## ఎపి విశ్రాంత డిజి వెంకటేశ్వరరావు వాంగ్మూలం

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యా పింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు లో ఎపికి చెందిన విశ్రాంత డిజి ఎబి వెంకటేశ్వరరావు వాంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేశారు. 2023లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నిక లకు ముందు వెంకటేశ్వరరావు ఫోన్‌ను ఆరు నెలలకు పైగా ట్యాపింగ్ చేసినట్లు ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు గుర్తించారు. ఆ సమ యంలో డిజి హోదాలో వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌లో వున్నారు. గతంలో ఆయన ఎపి నిఘా విభాగం బాస్‌గా పనిచేసిన సమయంలో అక్రమ ంగా ఇజ్రాయిల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ పరికరాలను కొనుగోలు చేసి, దానిని వైకాపా సహా ప్రత్యర్థులపై వాడినట్లు అభియోగాలు రావడం విది తమే. ఇదంతా అబద్ధమని వెంకటేశ్వరరావు చెప్పినా నాటి వైసిపి సర్కారు వినిపించుకోకుండా ఆయనను సస్పెండ్ చేసింది.

రెండేళ్లకు పైగా ఆయన సస్పెన్షన్‌లో వుండగా పదవీ విరమణకు ఒక రోజు ముందు పోస్టింగ్ ఇచ్చారు. వెంకటేశ్వరరావు ఎపి సిఎం చంద్రబాబు నాయుడుకు స న్నిహితుడని నాటి వైకాపా సర్కారు ఆరోపించగా ఈ క్రమంలో ఆయన తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా, బిఆర్‌ఎస్‌కు వ్యతిరేక ంగా ఏమైనా వ్యూహాలు చేబట్టారా...? అనే విషయాన్ని తెలుసుకునేందుకు నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు ఆయన ఫోన్ ట్యాపింగ్ చేసిన ట్లు సిట్ అధికారులు గుర్తించారు. తెలంగాణలో 2022 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు దాదాపు రెండేళ్ల పాటు వేలాది ఫోన్‌లను ట్యా పింగ్ చేసినట్లు సిట్ గుర్తించడం తెలిసిందే. ఇందులో నాటి ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలతో పాటు సొంత పార్టీల నేతలు, ఇతర పార్టీల ముఖ్య నే తలు, ఇతర ప్రముఖులు వుండడం విదితమే.

దీనికి సంబంధించి సిట్ అధికారులు రెండేళ్లకు పైగా విచారిస్తుండగా అనేక మంది వాంగ్మూలా న్ని నమోదు చేశారు. తాజాగా ఎపి విశ్రాంత డిజి వెంకటేశ్వరరావు వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అప్పట్లో వెంకటేశ్వరరావు కాల్ రికార్డుల ను ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు తెప్పించుకుని దాని ఆధారంగా తెలంగాణలో పలువురు నేతలు, ఇతర ప్రముఖులను బెదిరించినట్లు సి ట్ అధికారులు గుర్తించారు.

ఇందులో భాగంగా వెంకటేశ్వరరావును విచారించి నాటి ఘటనలపై ఆయన వాంగ్మూలం తీసుకుని అవసరం అయి తే మరోసారి విచారణకు రావాలని కోరినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం బషీర్‌బాగ్‌లో ఆయన వాంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేయగా ఈ విషయాన్ని గోప్యంగా వుంచారు.

# ఆయిల్‌పామ్ స్థిరమైన సాగు పద్ధతులపై అధ్యయనం

## సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ బిజినెస్ బృందం పర్యటన

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** ఆయిల్ పామ్ స్థిరమైన సాగు పద్ధతులపై అధ్యయనం చేసేందుకు సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ బిజినెస్ (సిఆర్‌బి) బృం దం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించింది. ఇందులో భాగంగా మంగళవారం రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో ఆయిల్ పామ్ తోటను సందర్శించి, అంతర పంటల సాగును పరిశీలించింది. రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులతో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు బృందంలోని నిపుణులు సూచించారు. అనంతరం నర్సరీని, నిడమనూరు మండలం వేంపాడలో పామాయిల్ తోటను సందర్శించి దిగుబడుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ ఆయిల్ పామ్ స్థిరమైన (సుస్థిర) సాగు విధానాలను ప్రోత్సహించడానికి, సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ బిజినెస్ సంస్థ దేశంలో విస్తృతంగా పనిచేస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణ, రైతుల ఆదాయ వృద్ధి లక్ష్యంగా సంస్థలు, రైతులతో కలిసి తమ బృందం అధ్యయనాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో సుస్థిర పామాయిల్ వినియోగం, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి తమ సంస్థ ఆధ్వర్యంలో సస్టైనబుల్ పామ్ ఆయిల్ కోయలిషన్ ఫర్ ఇండియా (ఎస్‌పిఒసి) ఏర్పాటయిందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి, రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడటం, అంతర పంటలు సాగు చేయడం వంటి మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు, సలహాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ప్రభుత్వ విభాగాలతో కలసి ఆయిల్ పామ్ రైతులకు శిక్షణనిచ్చి, సుస్థిర వ్యవసాయ పద్ధతులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Rayapudi, Amaravati-522237, Andhra Pradesh.
NIT No. 21/MAU61-ADMN0STG(OTH)/12/2026, Dt: 14/07/2026
E-PROCUREMENT TENDER NOTICE
Name of Work: APCRDA - "Request for Proposal (RFP) for Selection of Consultant to Provide Comprehensive Multi-layered Third-Party Quality Assurance & Quality Control Services for infrastructure and construction works of development in Amaravati Capital City, Andhra Pradesh, India". The bid can be downloaded on AP e-procurement portal from 15.07.2026 to 05.08.2026 up to 14.00 Hrs., Due date for submission of Bid is 05.08.2026 up to 15.00 Hrs., Technical bid opening 05.08.2026 @16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Amaravati

వార్త

చాలా మంది లోభులవడం వల్ల ఎందరో ఆకలితో అలమటిస్తున్నారు. ఇతరులతో పంచుకోవడం ఎలాగో తెలుసుకుంటే సమస్య ఉండదు.

- ఐ.జాన్సన్

# సర్ మెలికల కొలికి!

ఓటుహక్కు నవ్వులపాలవుతోంది. గడపగడపకూ, బిఎల్ఒలను పంపి విస్తృత పరిశీలన తర్వాతసమగ్ర ఓటర్ల జాబితా రూపొందించాలన్న 'సర్' లక్ష్యాన్నిఎవరూ కాదనలేం. కానీ దాని లక్ష్యం నెరవేరే స్థాయిలో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలు ఉండకపోవడం విచిత్రం. రాజ్యాంగానికి ఎన్నో సవరణలు చేసుకున్నప్పుడు మన మెందుకు సవరణ చేసుకోకూడదు అనుకున్నారో ఏమో కానీ సమగ్ర విధాన రూపకల్పన లేకుండా 'సర్' విధానాలున్నాయేమోననే అనుమానాలు జనంలో తలెత్తుతున్నాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ తీరు ఎంతో ఘనంగా సాగుతోందనే ప్రచారం జరుగుతోంది. కానీ క్షేత్రస్థాయిలో మరోలా ఉంది. ఓటరు చేర్పులో వయోజనులు సైతం ఇబ్బందిపడుతున్నారు. ఎందుకంటే ఇంటింటికీ తిరుగుతున్న బిఎల్ఒలు చాలా ఇళ్లలో అంతకుముందున్న ఓటరు అక్కడ ఉన్నారా? లేరా? అనే పరిశీలన తప్పించి చాలా ప్రాంతాల్లో సంబంధిత కొత్త ఓటర్ల చేర్పింపు సజావుగా సాగడం లేదు.ఫలానా చోట ఫలానా వారు లేరనే సమాచారం రాగానే వాళ్ల ఓటు తొలగిస్తున్నారు తప్పితే వారి విషయమై అనంతర ఆచూకీ తీసుకోలేకపోతున్నారు. 'సర్' ప్రక్రియ ఆది నుంచీ వివాదాస్పదంగానే ఉంది. సర్ ప్రక్రియ పట్ల జనం భయభ్రాంతులౌతున్నారు. ఏదో ఎన్నికలప్పుడే ఓటు అనే పరిస్థితి నుంచి ఓటు హక్కు లేకుంటే ఓ సమస్య, రెండు చోట్ల నమోదై ఉంటే ఓ తకరారు. ఇలా సామాన్య ప్రజానీకం ఉలిక్కిపడి ఆందోళనపడుతున్నారు. ఎన్నికలు కొద్ది రోజుల్లో వస్తాయనగా బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఆదరాబాదరా 'సర్' పరిశీలన జరిగిందంటే అది వేరే విషయం. పైగా ఓట్లు అన్యాయంగా ఏరివేత కోసమే ఈ ప్రక్రియ అనో, తీరా తుది జాబితా పూర్తయ్యాక తమఓట్లు గల్లంతయ్యాయని ఆందోళన చెందిన సాధారణ జనం లేకపోలేరు. అంటే 'కొండ నాలికకు మందు వేస్తే ఉన్న నాలుక' పోయిందన్న చందాన ఈ ప్రక్రియసాగుతోంది.తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఇప్పట్లో ఎన్నికలు లేవు. అయినా 'సర్' ప్రక్రియ సజావుగా సాగడం లేదనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ప్రక్రియ మంగళవారంతో పూర్తయింది. 89శాతంబిఎల్ఒల పరిశీలన పూర్తయిందని చెప్తున్నా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విజ్ఞప్తి మేరకు మరో పదిరోజులు పెంచారు.తెలంగాణలో 'సర్'కు సంబంధించిన నిబంధనలేవీ అమలు చేయడం లేదు. ఇంటింటికి మూడుసార్లు సందర్శించాల్సిన బిఎల్ఒలు తమ ప్రాంతానికే రావడం లేదని ఆరోపణలున్నాయి. వాళ్లలా అంటున్నారని కాదు కానీ ఇంత తక్కువ సమయంలో బిఎల్ఓలు ఒకసారే ఫలానా ఏరియాకు వెళ్లలేదనే సమాచారం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లిన వారెందరో ఉన్నారు. తాజా ప్రక్రియలో ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కున్నట్లయితే రెండేళ్ల జైలు శిక్ష తప్పదంటూఎన్నికల కమిషన్ ప్రకటన చేసే సరికి చాలా మంది ఓటర్లకు తమకెక్కడ ఓటుందో తెలుసుకునే సమయం, వీలు చిక్కక వెతుక్కుని ఉండకపోతే వ్యక్తిగతంగా చిక్కుల్లో పడినట్లే కదా! నిరక్షరాస్యులు తమ పనులమీద వేరొకచోటకి వెళ్లి ఉన్నా, అసంఘటిత కార్మికులైన వారి ఓటర్ల పరిశీలన ఎంతో సంక్లిష్టంగా మారుతోంది. ఇలాంటి ఎన్నో అంశాల్లో పరిశీలన తేలకపోతే ఎందరివో ఓట్లు తొలగింపునకు గురయ్యే పరిస్థితిఏర్పడ్తుంది. సాధారణంగా కొత్త ఓటర్లను చేరమని, ఇళ్లు మారిన వారి ఓట్లను కొత్త చోట్లకు మార్చుకోమని ఆహ్వానించే ఓటరు చేర్పింపు ప్రక్రియ ఈసారి చాలా సంక్లిష్టంగా మారింది. ఎన్నో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా డబ్లింగ్ ఓటరుల పరిశీలన సర్దుబాటు చేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఎందుకు వినియోగంలోకి తెచ్చుకోవడం లేదో అర్థంకాదు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా విశ్వసనీయత అవసరమే. దానికోసం రూపొందించిన 'సర్' ప్రక్రియలో పారదర్శకతను బలోపేతం చేయాల్సిన అవశ్యకత ఉంది. అనర్హులను, నకిలీ నమోదును నిలిపివేసేందుకు తగు మార్పులు చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహకారాన్నిఅందుకోవడం అవసరం.వలస కార్మికులు,వృద్ధులు, దివ్యాంగులు సైతం కొత్త ఓటరు జాబితాలోకి నమోదయ్యే విషయంలో ఎక్కువ ఇబ్బందులకు గురవుతున్నారని సమాచారం. బిఎల్ఒలకు సరైన ప్రామాణిక అవగాహనకల్పించకుండా ఎన్యూమరేషన్‌కు పంపడం వల్లనే ఈ ప్రక్రియ విమర్శలకు గురవుతోంది. వివిధ ప్రాంతాల్లో వేర్వేరు రాజకీయ పార్టీలు ఓటర్ల చేర్పింపు, తొలగింపులతో సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బంది పెట్టే అంశాలపై గొంతెత్తి విమర్శిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల విశ్వాసాన్ని బలపరిచే ప్రక్రియ పురోగతిలో ఎన్నో అంశాలపై ఎన్నికల సంఘం ఎన్నో మెలికలు పెడుతోందనే అభిప్రాయంవ్యక్తమవుతోంది. వేగంగా పెరుగుతున్న జనాభా,పట్టణీకరణ, వలసలు, డిజిటల్ యుగంలో మారుతున్న నివాస పరిస్థితుల రీత్యా సమగ్ర సవరణలను కాదనలేం. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లుగా మాయాజాలం జరిగిందా అనే అనుమానాలను రేకెత్తించే అంశాలపై ఓటర్ల జాబితా నిర్దే శకులకు స్పష్టత అవసరం. అనేక ప్రాంతాల్లో పత్రాల ధృవీకరణపై ప్రజల్లో అయోమయం ఏర్పడింది. ఇప్పుడీ ప్రక్రియలో ఆధార్ కార్డు, పౌరసత్వ కార్డు,పాత ఓటరు కార్డు, ఇలాంటివన్నీ ఎక్కడో ఓ దేశంలో ఇక్కట్ల పాలు చేస్తాయనే చర్చ బయలుదేరడంతో జనం చివరి క్షణంలో కంగారుపడిన వైనం. ఓటర్ల జాబితా సర్దుబాటు లో రాజకీయ పార్టీలు తాము గాబరా చెంది ఓటర్లను గందర గోళంలో పడేటట్లు చేయడం కన్నా అన్ని విధాలా సహకరిస్తే ఎన్నికల కమిషన్ బాధ్యతలో సమగ్ర జాబితా రూపొందించగలుగుతుంది.

నాయకత్వం అనేది హోదా కాదు ఒక బాధ్యత. ఇక క్రియ, నాలుకకి కళ్లెం వేయగలిగితే శాంతికి భంగం కలుగదు.



జి. ఎలియట్

శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### కర్ణాటకరాష్ట్ర మంత్రులను ఆదర్శంగా తీసుకోవాలి

నిన్న కర్ణాటక రవాణా మంత్రి బైరతి సురేష్ సాధారణ ప్రయాణికుని మాదిరి,మూతికి మాస్క్ పెట్టుకొని ప్రయాణికుల కష్టాలనుస్వయంగా ఎదుర్కొన్నారు.బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులకు కలిగించే ఇబ్బందులను స్వయంగా పరిశీలించేందుకు మారువేషంలో రాగా, చిల్లర లేకపోతే దిగిపో అని కండక్టర్ మంత్రినీ అనడం విశేషం. పూర్వం రాజులు ఇలా మారువేషాలతో రాత్రిళ్ళు తిరుగుతూ దొంగలను కనిపెట్టడం, ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేవారు.పాలకులు అలాఉండాలి.గతంలో కర్ణాటకలోనే ఒక మంత్రి దెయ్యాలు లేవని నిరూపించేందుకు, ఒక్కడే అర్ధరాత్రి స్మశానంలో పడుకున్నాడు. అలా ఉండాలి పాలకులు. మనరాష్ట్రంలో కూడా మంత్రులు ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకు,అధికారులు ఏరకంగా పనిచేస్తుంది, లంచాలు ఏరకంగా అడుగుతుంది, పనులు ఆలస్యం కావటానికి కారణాలను తెలుసుకునేందుకు ఇలా మారువేషాలతో తిరగాలి.అపుడే ప్రజల మన్ననలు పొందుతారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### డంపింగ్ యార్డ్ జీవో రద్దు చేయాలి

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని సిద్ధపూర్ గ్రామంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కొరకు విడుదల చేసిన జీఓవెంటనే రద్దు చేయాలి. పచ్చని పొలాల మధ్య చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు వారి ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉంది. భవిష్యత్ పిల్లల జీవితం గురించి ఆలోచించి డంపింగ్ యార్డ్ జీవో వెంటనే రద్దుచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలి. ప్రజల ఆరోగ్యపరిస్థితులను లెక్కలోకి తీసుకునే నిర్ణయాలు చేయాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఈ మధ్య దేశం మొత్తం మీద వయోవృద్ధుల సంఖ్య, యువకుల కంటే ఎక్కువ ఉన్నట్లు తెలిసింది. యువకుల సంఖ్యాబలం ఎక్కువగా ఉన్నప్పుడే మానవవనరులు కాస్త ఎక్కువ పొందొచ్చు. ఇది ఆయా పరిస్థితుల్లో వారి ఆరోగ్యాలు,సామాజిక స్థితి, అనుకూల ధోరణి ప్రధానం. పెడత్రోవ ధోరణులు అతిగా పెరిగి వ్యక్తి వినాశనం జరుగుతున్నది.ప్రభుత్వం యువకులకు తప్పక ఉపాధి కల్పించాలి. వృద్ధుల కంటే యువకుల సంఖ్యను పెంచాలి.

-బి. మేఘనాదం, విశాఖపట్నం

### పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలి

ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాలలో 2026-2027 విద్యా సంవత్సరంప్రారంభం నుండి పేరెంట్స్ కమిటీ సమావేశాలు ప్రతినెల క్రమం తప్పకుండా నిర్వ హించాలి. పిల్లల క్రమశిక్షణ, గురువులను గౌరవించే విధానం చర్చించాలి. పరిసరాల శుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, త్రాగడానికి మంచి నీరు సరఫరా చేయాలి. విద్యార్థులకు సెల్‌ఫోన్ వాడకం నిషేధించాలి. హెయిర్ కటింగ్ చిన్నగా శుభ్రంగా ఉండాలి. తరగతి గదిలో చక్కగా కూర్చోవడం. ప్రతిరోజు పాఠాలు వినే విధంగా చూడాలి. విద్యార్థుల హాజరు శాతం తప్పకుండా ఉండాలి.క్లాసులలో నిద్రపోవడం వద్దు.ప్రతినెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### కృత్రిమమేధ అవసరమే..

ప్రపంచ సాంకేతిక రంగం వేగంగా మారుతున్న ఈ కాలంలో కృత్రిమ మేధస్సు వినియోగం అనివార్యంగా మారింది. భారతదేశం ప్రపంచ స్థాయిలో పోటీ సామర్థ్యాన్ని నిలబెట్టుకోవాలంటే కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలను విస్తృత స్థాయిలో స్వీకరించడం అవసరం. అలాగే ఈ కొత్త సాంకేతికతకు అనుగుణంగా మానవవనరులను నైపుణ్యాలతో తీర్చిదిద్దడం కూడా అత్యంత ముఖ్యమైన అంశం. కొంతమంది భావిస్తున్నట్లుగా కృత్రిమ మేధస్సు సాఫ్ట్‌వేర్ సేవల రంగానికి ముప్పు కాదు. వాస్తవానికి అది ఉత్పాదకతను పెంచే శక్తివంతమైన సాధనంగా నిలుస్తోంది. క్లిష్టమైన సమస్యలను వేగంగా పరిష్కరించడం, కొత్త ఆవిష్కరణలకు దారితీయడం, పనితీరును మెరుగుపరచడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా సంస్థలు తమ వ్యాపార వ్యవస్థల్లో కృత్రిమ మేధస్సును విస్తృతంగా అనుసంధానిస్తున్నాయి.

- సి.సాయిరుత్విక్, నల్గొండ

### పెరుగుతున్న అవినీతి

ప్రభుత్వం నెల నెల టంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతో ఎంతో హుందాగా ఉండాల్సిన కొంతమంది ఉద్యోగులు తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్య ప్రజల నుంచి,చిన్న,సన్న కారు రైతుల నుంచి తమకు కావలసినంత సొమ్మును వసూలు చేస్తున్నారు. కాస్తో,కూస్తో సామాన్య ప్రజల నుంచి కాసులు గుంజనిదే వారికి ఆ రోజు నిద్రపట్టేలాలేదు అన్నట్లుగా ఉంది ఉద్యోగులపనితీరు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపేందుకు అందరూ నడుం బిగించాలి.

-ఎన్. మధు, నంద్యాలజిల్లా

# రాబోయే కులగణన దేశ సమగ్రతకు సవాలు?

***సైంటిఫిక్ కులగణన మన దేశంలో ఇప్పటి వరకూ జరగలేదు. ఇప్పుడు జరగబోయే కులగణన (రెండవ ఫేజ్) రాజకీయాల నేపథ్యంలో జరగబోతున్నదన్న అపప్రద గూడా వుంది! ఫార్వర్డ్ కులాలు ఎన్ని? బాక్వర్డ్ కులాలు ఎన్ని, ఇతర బాక్వర్డ్ కులాలు ఎన్ని? షెడ్యూలు కాస్ట్స్, షెడ్యూల్ ట్రైబ్స్ ఏ లెక్కల్లో ఈనాటి సామాజిక రాజకీయ నేపథ్యంలో చూపించబడుతాయి? పార్వర్డ్ కులాలకు సంబంధించి ఆర్థిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా లెక్కలు తేల్చగలుగుతారా? అదే ఆర్థిక అంశం బి.సి, ఓబిసి, షెడ్యూల్డ్ కులాలు, తెగలకూ వర్తిస్తుంది! క్రీమీ లేయర్, సబ్ కాటగరైజేషన్ కులాలు రిజర్వేషన్ల వల్ల లాభాలు పొందుతున్నాయని కొందరు లేవనెత్తుతున్నారు! వాటి మాటేమిటి? అందరికీ ఆమోదయోగ్యంగా వుండే విధంగా ప్రారంభించబోతున్న కులగణన వుండాలని కోరుకోవటంలో తప్పులేదు కానీ ఈ కులగణన వల్ల దేశం విచ్ఛిన్నం కాకుండా వుంటే చాలు అదే పదివేలు అని ఈ విషయాల పరిజ్ఞానంలో ఆరితేరిన అనుభవజ్ఞులు ఆశించటంలో తప్పులేదేమో!***



రావులపాటి సీతారాంరావు

భారత దేశంలో సమస్యలు లెక్క పెట్టలేము. ఏళ్ళతరబడి చూరును పట్టుకొని వ్రేలాడుతున్నసమస్యలు ఎన్నో రోజుల తరబడి పెరుగుతున్న సమస్యలు ఎన్నెన్నో! అన్నిటిని తలదన్నేలా రోజుకొక సమస్య మన దేశంలో ఉత్పన్నం కాబడుతున్నదా? ఉత్పన్నమవుతున్నవా? అని ఆలోచించటానికి ప్రభుత్వాలకూ, అధికారులకూ, రాజకీయ నాయకులకూ తీరిక దొరక లేనతంగా సమస్యలు ఎదురవుతున్న మాట వాస్తవం! ఇవ్వన్నీ అంటే పాత సమస్యలతో పాటు పుట్టుకొస్తున్న కొత్త సమస్యలకు తోడుగా సమస్యలు తక్కువవుతున్నట్టుగా సామాజిక ఉద్యమకారులూ, రాజకీయ వేత్తలూ, ప్రభుత్వాలు కొన్నాళ్ళు జనాభాను లెక్కించాలి 'సర్' అంటారు మరికొన్నాళ్ళు ఓటర్ల నిగ్గు తేల్చాలి 'సర్' అంటారు! కులాల, మతాల, ప్రాంతాల సమస్యలకు తోడు పరస్పరం పోరాడుకొనేట్లు 'రాముడేం చేసాడు? చాతగాక అడవుల్లోకి పోయాడు' అని ఆ రాముని పుట్టు పూర్వోత్తరాలతో సంబంధం లేని వ్యక్తులు మాట్లాడుతే మాట్లాడకు! మా రాముడు దేవుడు కళ్ళు పోతాయి. మా మతాన్ని రాముని పేరు పెట్టి ద్వేషిస్తున్నావా?' అని మరొకరు మాట్లాడుతూ చినికి చినికి గాలివాన అయిన తీరులో అసహజమైన పోట్లాటలను ప్రోత్సహించటం మొదలు పెట్టారు! ఎంత విషాదకరం? అభివృద్ధి సాధిస్తున్న దేశానికి 'స్పీడ్ బ్రేకర్స్' వేసే పనిలో కొందరు ఉండటం ఎంత దురదృష్టకరం! ఈ నేపథ్యంలో 2027 జులై 6 నుండి సెన్సెసు 2027 సెకండ్ ఫేజ్ రిహార్సల్స్ ప్రారంభం కాబోతున్నది! ఈ ప్రక్రియ ప్రకంపనలు సృష్టిస్తుందా లేకపోతే సాదా సీదాగా గడిచిపోతుందా అని స్వాతంత్ర్యం తర్వాత మన దేశ చరిత్ర స్థితి గతులను అధ్యయనం చేస్తున్న విజ్ఞులు ఎదురు చూస్తున్నారు! ఈ కార్యక్రమం దేశ మంతటా యూనియన్ టెరిటరీతో సహా మొదలు కాబోతున్నది! ఈ రెండవ 'సర్' ముఖ్యాంశంగా ఒక 'ఓపెన్ కాలం' ఎన్యూమరేషన్లో పాల్గొనే వారు పూరించాలి! నీ కులం ఏమిటి అన్న విషయం నీవు చెబుతే ఆ 'కాలం' ద్వారా రికార్డుల్లోకి ఎక్కుతుంది. 2011లో జరిగిన సోషియో ఎకనామిక్, కాస్ట్ సెన్సెస్ (ఎస్.ఇ.సి.సి)కు ఈ కాలం వున్నా, చట్టం ఊతంగా లేదు. ఇప్పుడు జరగబోయే 'కాస్ట్' సెన్సెస్ (కుల గణన) చట్ట ప్రకారం జరుగుతున్నట్లుగా పరిగణించబడుతుంది. 2011 సెన్సెసుకు 2027 సెన్సెస్కు వున్న ముఖ్యమైన తేడాతో కూడిన కీలకాంశం చట్టం! 2027 కులగణన వెనక చట్టం వుంది! జులై 20కి సెన్సెసు ప్రక్రియ పూర్తవుతుంది. అటు తర్వాత కులగణన



లెక్కలు ప్రభుత్వం తేలుస్తుంది. 2011 కులగణనలో లెక్కకు మించిన కులాలు లెక్కలోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఆ కులగణన ఆచరణ యోగ్యంగా కనపడ లేదు! దానికి కారణం 1931 సెన్సెస్లో కేవలం 4,147 కులాల పేర్లు లెక్కల్లో తేలుతే, 2011 ఎస్.ఇ.సి.సి ప్రకారం 46 లక్షల కులాల పేర్లు పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది! ఆ లెక్కలు పనికి రాకుండా పోవటానికి కారణం ఇంటి పేర్లు ఉపకులాలు, తెగల పేర్లు గూడా కులాల పేర్ల మీద వచ్చి పడ్డాయి! అందుకనే కేంద్రం సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకున్న ఒక ఉదంతంలో ఈ సెన్సెస్ లెక్కలు తేలేవిగా లేవు, తప్పుల తడకగా మారాయి అని చెప్పక తప్పలేదు! అందుకనే ఈసారి తప్పులు లేని కులగణన చేయగలుగుతేనే ఆ రికార్డుకు హేతుబద్ధత వచ్చినట్లవుతుంది! 2023లో జరిగిన బీహార్ రాష్ట్ర కులాల సర్వే ఒక విధంగా తప్పులు లేని రికార్డును పొందుపర్చగలిగింది! దానికి కారణం ఎన్యూమరేటర్స్ సహనంతో ఎన్యూమరేట్ చేయబడ్తున్న వ్యక్తిది ఏ కులమేమిటో క్షుణ్ణంగా తేల్చుకున్న తర్వాతనే లెక్కలోకి తీసుకోవటం వల్ల అది సాధ్యపడిందని కొందరు అభిప్రాయపడ్డారు! జరగబోయే కులగణనకు ఫూల్ ప్రూఫ్ మెథడ్స్ అవసరమని అందరూ చెప్తున్నారు కానీ మెథడ్స్ ఏమిటో ఏ పద్ధతులలో కుల నిర్ధారణ చేయాల్నో ప్రభుత్వాలూ, అధికారులూ అర్థం కాని పరిస్థితిలోనే వున్నారు! నిజం మాట్లాడితే స్వాతంత్ర్యం మునుపు అనేక కారణాల వల్ల ఉదాహరణకు సామాజికంగా కులాలు అన్నీ అందరికీ తెలియకపోవటం, కొండల్లో నివసించే వారికి, ట్రైబ్‌లకూ కులాల అవగాహన లేకపోవటంతో, తెలిసిన కులాల వారి లెక్కలే చెలామణిలో వుండేవి! నాలుగు వర్ణాల విభజన మంచికో చెడుకో కుల విభజన లెక్కల్లో పెద్ద పీటను అలంకరింప చేసి నోరెత్తనీయని రీతిలో అప్పటి పెత్తందార్లు, పెద్దలూ సమర్థించటం వల్ల,1931 సెన్సెస్లో కేవలం 4,149 కులాలు మాత్రమే గుర్తించబడాయి! లిట్రసీ రేటు పెరగటం వల్ల 2011 నాటికి ఆ లెక్క మారి 46 లక్షల్లోకి వాయు వేగంతో చేరుకుంది! సైంటిఫిక్ కులగణన మన దేశంలో ఇప్పటి వరకూ జరగలేదు.ఇప్పుడు జరగబోయే కులగణన (రెండవ ఫేజ్) రాజకీయాల నేపథ్యంలో జరగబోతున్నదన్న అపప్రద గూడా వుంది! ఫార్వర్డ్ కులాలు ఎన్ని? బాక్వర్డ్ కులాలు ఎన్ని ఇతర బాక్వర్డ్ కులాలు ఎన్ని? షెడ్యూలు కాస్ట్స్, షెడ్యూల్ ట్రైబ్స్ ఏ లెక్కల్లో ఈనాటి సామాజిక రాజకీయ నేపథ్యంలో చూపించబడుతాయి? పార్వర్డ్ కులాలకు సంబంధించి ఆర్థిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా లెక్కలు తేల్చగలుగుతారా? అదే ఆర్థిక అంశం బి.సి ఓబిసి షెడ్యూల్డ్ కులాలు, తెగలకూ వర్తిస్తుంది! క్రీమీ లేయర్, సబ్ కాటగరైజేషన్ కులాలు రిజర్వేషన్ల వల్ల లాభాలు పొందుతున్నాయని కొందరు లేవనెత్తుతున్నారు! వాటి మాటేమిటి? అందరికీ ఆమోదయోగ్యంగా వుండే విధంగా ప్రారంభించబోతున్న కులగణన వుండాలని కోరుకోవటంలో తప్పులేదు కానీ ఈ కులగణన వల్ల దేశం విచ్ఛిన్నం కాకుండా వుంటే చాలు అదే పదివేలు అని ఈ విషయాల పరిజ్ఞానంలో ఆరితేరిన అనుభవజ్ఞులు ఆశించటంలో తప్పులేదేమో! ●

# పేదవాడి పొట్టను కొడుతున్న ప్రపంచ పరిణామాలు

పి.వి.వి.సత్యనారాయణ

ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ భూగోళం పై ఏ చిన్న పరిణామం సంభవించినా, దాని ప్రభావం మొత్తం దాదాపు 850 కోట్ల మానవులపై ఉంటుంది అంటే అతిశయోక్తి కాదు. ప్రకృతి కన్నెర్ర చేసినా, ఆధిపత్య పోరులో సామ్రాజ్యవాద దాడులైనా, కల్తీలైన సామాన్య మానవుల జీవితాలపై పెను ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా పేద మధ్యతరగతి ఆ మాటకు వస్తే, సబ్ సహారా, ఆసియా, ఆఫ్రికా ఖండ ప్రజల జీవితాలు అల్లకల్లోలం అవుతున్నాయి.ముఖ్యంగా 1991 తరువాత సరళీకృత ఆర్థిక విధానాలు, సోవియట్ యూనియన్ విడిపోవడం, ప్రపంచీకరణ నేపథ్యంలో అనేకరంగాల్లో గణనీయంగా మార్పులు చోటుచేసుకున్నాయి. దీనికి తోడు వరదలు, భూకంపాలు, సునామీలు, అగ్ని ప్రమాదాలు, తరచూ యుద్ధాలు, కోవిడ్ విలయతాండవం మొత్తం ప్రపంచాన్ని ఏ సమయానికి ఏ వైపుకు నెడుతుందో అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. 1990 వరకూ సోవియట్ యూనియన్ (రష్యా) బలంగా ఒకవైపు, మరోవైపు అమెరికా ఒకదానికి ధీటుగా మరొకరు ఉండటం వల్ల దాదాపు ప్రపంచ దేశాలు సమన్వయం చేసుకుంటూ సామరస్యంగా సాగింది.ఎప్పుడైతే రష్యా తన ప్రభావాన్ని కోల్పోయిందో, ఇక తిరుగులేని శక్తిగా అమెరికా ఆవిర్భవించింది.గతంలో ఇరాక్, లిబియా వంటి దేశాలను, తాజాగా వెనుజులా, నేడు ఇరాన్ పై సామ్రాజ్యవాద ఆధిపత్యం ధోరణితో దాడులు, యుద్ధాలు చేస్తూ మొత్తం ప్రపంచాన్ని ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పేద మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతూ,జీవితాలను చిందరవందరగా చేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడుగా రెండొవ సారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అనే భావనతో మొత్తం ప్రపంచ దేశాలపై 'ట్రేడ్ వార్' కు శ్రీకారం చుట్టాడు. తనకు నచ్చిన విధంగా ప్రతీకార సుంకాలు విధిస్తూ ప్రపంచ దేశాలపై అప్రకటిత వాణిజ్య యుద్ధానికి సిద్ధ పడటం వల్ల దాదాపు అన్ని దేశాలు అమెరికాకు దూరం జరిగాయి.చివరికి చిన్న చితకా దేశాలైన కొలంబియా, మెక్సికో వంటి దేశాలు ట్రంప్ విధానాల పట్ల నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి.మన దేశం అలీన విధానం విడనాడటం, ట్రంప్ తో సన్నిహితంగా ఉండటం వల్ల పెను సవాళ్లను ఎదుర్కోవడం జరుగుతుంది. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏర్పాటు చేసిన ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ, పర్యావరణ పరిరక్షణ వేదికలు నుంచి అమెరికా బయటకు పోవడం కూడా మొత్తం ప్రపంచాన్ని నివ్వెరపోయేటట్లు చేసింది. దీంతో నిధులు లేక పేద మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా ఆఫ్రికన్ దేశాలు ఆహర కొరత,ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు అందక బహు పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి. ఇక అమెరికా, ఇజ్రాయెల్ జోడిగా ఇరాన్, లెబనాన్ పై చేస్తున్న యుద్ధం పరాకాష్టకు చేరడంతో మొత్తం ఆ యుద్ధ తీవ్రత మన ఇంటికి, పరిశ్రమలకు, ఎరువులు, మందులు ఫార్మా రంగంతోపాటు మందుబాబులు (మద్యం) గుండెల్లో గుబులు రేపుతోంది. తిరిగి మరల పుల్లల పొయ్యిలు, బొగ్గులు పొయ్యులు బయటికి తీసి బ్రతుకులు గడిపే సమయం ఆసన్నమైంది. పేద, మధ్య తరగతి ప్రజలు దాచుకున్న సొమ్ములు, స్టాక్ మార్కెట్ పెట్టుబడులు హుష్ కాకి అవుతున్న పరిస్థితి. అధికధరలు, ద్రవ్యోల్బణం,నిరుద్యోగం, పేదరికం,గాలిలో కలిసిపోతున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇవి అన్నీ సామాన్య ప్రజల జీవితాల్లో చీకటి నింపుతున్నాయి. దీనికి తోడు ఆరోగ్య సమస్యలు, వాతావరణ కాలుష్యం చుట్టుముట్టుతున్నది. అక్రమ దందాలు, కల్తీలు, బ్లాక్ మార్కెట్ స్వైరవిహారం చేస్తున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు ఒకటై, సామ్రాజ్యవాద ఆధిపత్య ధోరణితో వెళుతున్న అమెరికా వంటి దేశానికి ప్రజాస్వామ్య పద్ధతిలోనే గుణపాఠం చెప్పాలి.మనలాంటి దేశాలు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని 'విశ్వగురు' పాత్ర పోషించాలి. ఉత్సవ విగ్రహంగా మారుతున్న ఐక్యరాజ్యసమితికి పునర్జీవం పోయాలి. ఎంత అభివృద్ధి చెందిన దేశమైనా ఏదో ఒక విషయంలో మరో దేశంపై ఆధారపడి ఉంటుంది అనే వాస్తవాన్ని సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ ఆధిపత్య దేశాలకు తెలియజేయాలి. ఎక్కడో అంతరిక్షంలో మానవ ఉనికికోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ఈదేశాలు,అసలు భూమ్మీద కళ్ళముందు కదలాడే మానవ జాతి నిర్మూలనకు, పసి పిల్లలు ప్రాణాలు సైతం యుద్ధాలు పేరుతో చంపివేయడం ఏరకమైన అభివృద్ధో ఈ అభివృద్ధి చెందిన దేశాలు ఇకనైనాఆలోచన చేయాలి. ●

# ఉచిత విద్యా పథకంతో ఒడిశా కొత్త ఒరవడి



యేచన్ చంద్ర శేఖర్

రెండువేల ఇరవై ఆరు నాటికి, భారతదేశ జాతీయ సగటు అక్షరాస్యత రేటు దాదాపు 80.90 శాతంగా ఉంది. కాగా 98.20 శాతంతో మిజోరాం దేశంలోనే అగ్రస్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ 72.60 శాతం, బీహార్ 74.30శాతం, మధ్య ప్రదేశ్ 75.20 శాతాలతో అత్యల్ప సగటులను నమోదు చేశాయి. విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన 'ఉల్లాస్' కార్యక్రమం, 95 శాతం అక్షరాస్యత స్థాయిని దాటిన ఏ రాష్ట్రాన్నైనా 'సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రం'గా గుర్తిస్తున్న నేపథ్యంలో మిజోరాం 98.20, లక్షద్వీప్ 97.30, కేరళ 95.30, త్రిపుర 93.70, గోవా 93.60 శాతం ఈ స్థాయిని సాధించాయి. త్రిపుర, గోవా 2026 అంచనాల ప్రకారం పూర్తి అక్షరాస్యత ప్రమాణాన్ని అధిగమించాయి. మిజోరం అధికారికంగా చారిత్రాత్మక 98.20 శాతం అక్షరాస్యత రేటును సాధించి, భారతదేశంలో మొట్టమొదటి పూర్తి అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా నిలిచింది. గతంలో అగ్రగామిగా ఉన్న కేరళ వంటి రాష్ట్రాలను కూడా వెనక్కి నెట్టి ఇది ప్రస్తుతం జాతీయ అక్షరాస్యత ర్యాంకింగ్‌లలో అగ్రస్థానంలో నిలిచింది. విద్యను తరచుగా జీవితాలను మార్చే అత్యంత శక్తివంతమైన సాధనంగా అభివర్ణిస్తారు. అందుకే దీనిని రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఒడిశా ప్రభుత్వం కిండర్ గార్టెన్ (కెజి) నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) స్థాయి వరకు ఉచిత విద్యను అందించే 'జ్ఞానోదయ -శిక్షయ రు సమృద్ధి' పథకాన్ని ప్రారంభించింది. ఉచిత కెజి టు పిజి పథకాన్ని 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచినప్పటికీ అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం టిఆర్ఎస్ (ప్రస్తుతం బిఆర్ఎస్) ప్రభుత్వం దానిని అమలుపరచలేదు. దేశవ్యాప్తంగా అక్షరాస్యతా ర్యాంకింగ్‌లో 26వ స్థానంలో ఉన్న ఒడిశా రాష్ట్రం అక్షరాస్యత రేటు సుమారు 79 శాతం కాగా 6 సంవత్సరాల లోపు పిల్లలను మినహాయిస్తే వయోజనులు, యువత అక్షరాస్యత రేటు సుమారు 82.87 శాతంగా ఉంటుంది. అక్షరాస్యతా శాతాన్ని మరింత మెరుగుపరిచేందుకు, ఒడిశా 'ఉల్లాస్' విద్యార్థుల కోసం కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య వంటి పథకాలను అమలు చేస్తోంది. అక్షరాస్యత విషయంలో ఒడిశా రాష్ట్రం గణనీయమైన లింగ, ప్రాంతీయ అసమానతలను ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో మహిళా అక్షరాస్యత 64 శాతం,గిరిజన అక్షరాస్యత ఆందోళనకరంగా 52.24 శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో అక్షరాస్యతా శాతం 85.57 శాతానికి చేరుకోగా,గ్రామీణ ప్రాంతాల్లో అది సగటున 70.22 శాతంగా ఉంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల అక్షరాస్యత రేటు కంటే రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ ఉన్న ఖోర్ధా జిల్లాలో అక్షరాస్యత రేటు అత్యధికంగా 86.88 శాతం ఉంది. ఈ నేపథ్యంలో, సమ్మిళిత, అందుబాటులో ఉండే విద్య దిశగా భారతదేశం సాగిస్తున్న ప్రయాణంలో భాగంగా ఒడిశా ప్రభుత్వం తీసుకున్న ఈ చొరవ ఒక ముఖ్యమైన మైలురాయి అని విద్యావేత్తలు, విద్యార్థులు, విధాన రూపకర్తలు ప్రశంసిస్తున్నారు. ఒడిశా ప్రభుత్వం, కిండర్ గార్టెన్ (కెజి) నుండి పోస్ట్ గ్రాడ్యు



యేషన్ (పిజి)వరకు భారతదేశపు మొట్టమొదటి సార్వత్రిక ఉచిత విద్యా వ్యవస్థను అమలు చేస్తూ, జ్ఞానోదయ - శిక్షారు సమృద్ధి' పథకాన్ని ప్రారంభించింది. 2026-27 విద్యా సంవత్సరం నుండి అమల్లోకి వచ్చిన ఈ పథకం,ప్రభుత్వ, ప్రభుత్వసహాయక సంస్థలలోని విద్యార్థులందరికీ ప్రవేశ, ట్యూషన్ ఫీజులను మాఫీ చేస్తుంది. ఈ ఫీజు మాఫీ రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కళాశాలలు,ప్రభుత్వ సహాయక కళాశాలలలోని రెగ్యులర్ విధానంలోని తరగతులతో పాటు యుజి, పిజి కోర్సులకు కూడా వర్తిస్తుంది. విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా విద్యాభ్యాసం కొనసాగించేందుకు నిర్దేశించిన ఈ పథకం ద్వారా ఏటా 32 లక్షల మందికి పైగా విద్యార్థులు ప్రయోజనం పొందుతారని ఒక అంచనా. ఈ పథకం అమలు కోసం ఒడిశా ప్రభుత్వం మొదటి సంవత్సరానికి రూ.895.57 కోట్లు, వచ్చే ఐదేళ్ల కోసం రూ. 5,467.55 కోట్లు కేటాయించింది. అదనంగా, ప్రభుత్వం మోడల్ ప్రాథమిక పాఠశాలలను, నాలుగు కొత్త విశ్వవిద్యాలయాలను ప్రారంభించడంతో పాటువచ్చే మూడేళ్లలో 45,000 మంది ఉపాధ్యాయులను నియమిస్తోంది. ఈ పథకం ప్రకటన వెలువడిన తరువాత, ప్రభుత్వేతర సహాయక కళాశాలలు ఆందోళన వెలిబుచ్చాయి. ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలైతే, ఫీజుల రూపంలో తాము ఆర్జించే ఆదాయం కోల్పోతామని, ఈ ఆదాయమే మౌలిక సదుపాయాలు,ఉపాధ్యాయుల ప్రత్యక్ష జీతాల కోసం వెచ్చిస్తామని, అకస్మాత్తుగా అది కోల్పోతే తమ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తమకుఫీజు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశాయి. విద్యను తరచుగా జీవితాలను మార్చే అత్యంత శక్తివంతమైన సాధనంగా అభివర్ణిస్తారు. అందుకే దీనిని రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఒడిశా ప్రభుత్వం కెజి నుండి పిజి స్థాయి వరకు ఉచిత విద్యను అందించేందుకు ఈనిర్ణయం తీసుకుంది. ఈ సాహసోపేతమైన చొరవ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చడంతోపాటు పెరుగుతున్న విద్యా ఖర్చులతో సతమతమవుతున్న కుటుంబాలకు స్వాంతననిస్తుంది. ఈ కార్యక్రమం కింద, ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులు తమ ప్రాథమిక పాఠశాల విద్య నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు ట్యూషన్ ఫీజులు చెల్లించకుండా విద్యనభ్యసించవచ్చు. విద్యాభ్యాసం కోసం ఆర్థిక అడ్డంకులను తగ్గించడం, విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం, చదువు మానేసే వారి సంఖ్యను తగ్గించడం,ఆర్థికంగా వెనుకబడిన వర్గాలలో ఉన్నత విద్యను ప్రోత్సహించడం, రాష్ట్ర వ్యాప్తంగా అక్షరాస్యత,నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరచడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలు.ఇది విజయవంతమైతే, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఇకపై తమ ఆర్థిక స్థితిగతులపై ఎటువంటి ఆందోళన లేకుండా నిశ్చింతగా విద్యార్జనపైదృష్టి సారించి వృత్తిపరమైన అభివృద్ధి సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది. అక్షరాస్యత అనేది సమాజాభివృద్ధికి మూలాధారం. ఇది ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఆరోగ్య గణాంకాలు, లింగసమానతలు, రాజకీయ అవగాహన లాంటి అంశాలలో అత్యవసరం.ప్రజలలో అక్షరాస్యతను పెంపొం దించడంలో భారతదేశం గణనీయమైన పురోగతిని సాధిం చింది. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాలు, కొన్ని నిర్దిష్ట రాష్ట్రాలలో ఇప్పటికీ అనేక సవాళ్లు ఉన్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలు ఒడిశా ప్రభుత్వం చేపట్టిన ఈచొరవను ఆదర్శంగా తీసుకుని సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు లేకుండా అన్ని వర్గాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యావకాశాలను కల్పించాలి. ఓటు బ్యాంకు సంక్షేమ పథకాలను సమీక్షించి, హేతుబద్ధత లేని వాటిని అవసరమైతే రద్దుచేసి భావి పౌరు లను తీర్చిదిద్ది భవ్య భారతదేశానికి పునాదులు వేసే ఈ పథకానికి ప్రాధాన్యతనివ్వాలి. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు ఈ-మెయిల్‌కు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరించగలరు. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# మరణశయ్యపై ముజ్తబా ఖమేనీ!



## ప్రస్తుత ఇరాన్ సుప్రీం లీడర్ 90% ప్రాణాలు కోల్పోయినట్లే..

### ఆదేశ సైనిక సామర్థ్యం పూర్తిగా నిర్వీర్యం : ట్రంప్

**వాషింగ్టన్,జులై 14:** అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం మరింత వేడెక్కింది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఆ దేశ సైనిక సామర్థం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని, అగ్ర కమాండర్లందరూ హతమయ్యారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ ప్రస్తుత సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కూడా 90 శాతం ప్రాణాలు కోల్పోయినట్లే అని పేర్కొనడం అంతర్జాతీయంగా పెను సంచలనం రేపుతోంది. ఇరాన్ సైనిక పరిస్థితిపై ట్రంప్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఇప్పుడు ఇరాన్ వద్ద నావికాదళం లేదు, వైమానిక దళం లేదు అంతా శూన్యం. వారి యాంటీఎయిర్‌క్రాఫ్ట్ నిఘా వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వారి అగ్రనాయకులు, అత్యంత ప్రతిభావంతులైన కమాండర్లు అందరూ హతమయ్యారని ట్రంప్ వివరించారు. ఈ క్రమంలో ఆయన 1989లో మరణించిన ఇరాన్ విప్లవ నేత ఖొమేనీ పేరును ప్రస్తావించినప్పటికీ ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే ఇరు దేశాల (అమెరికా, ఇజ్రాయెల్) దాడుల్లో మరణించిన సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీని ఉద్దేశించే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. తండ్రి మరణించిన అదే దాడుల్లో తీవ్రంగా గాయపడి, గత వారం జరిగిన అంత్యక్రియలకు కూడా హాజరుకాని ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ 90 శాతం మరణ శయ్యపై ఉన్నారంటూ ట్రంప్ సంచలన విషయాలు బయటపెట్టారు. కొన్ని నెలల తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత, గత వారంనుండి అమెరికాతిరిగి ఇరాన్‌పై బాంబుల వర్షంకురిపిస్తోంది. ఈ మిలిటరీ యాక్షన్‌పై ట్రంప్ అధికారికంగా యుఎస్ కాంగ్రెస్‌కు కూడా నోటిఫికేషన్ పంపారు. ఇదే సమయంలో అంతర్జాతీయ నౌకల రాకపోకల విషయంలో వందల సంవత్సరాలుగా వస్తున్న అమెరికా స్వేచ్ఛా నౌకాయాన విధానానికి ట్రంప్ స్వస్తి పలికారు. హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే ఇతర దేశాల వాణిజ్య నౌకలకు భద్రత కల్పిస్తున్నందుకు గానూ ఇకపై అమెరికా సురక్షిత ప్రయాణ రుసుము వసూలు చేస్తుందని స్పష్టం చేశారు. అమెరికా చర్యలను ఇరాన్ కూడా తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తోంది. బహ్రెయిన్‌తో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి చెందిన రెండు చమురు రవాణా నౌకలపై ఇరాన్‌క్షిపణి దాడులు చేయడంతో, ఒక భారతీయ పౌరుడు మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ ఘటనతో అబుదాబి, దుబాయ్ వంటి సంపన్న నగరాలు కలిగిన యూఎఇసైతం ఇరాన్‌పై ప్రతీకార చర్యలకు సిద్ధమంటూ హెచ్చరికలు జారీ చేసింది. ప్రపంచ ముడిచమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిని తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు అమెరికా-ఇరాన్ పట్టుబడుతుండటంతో పశ్చిమాసియా ఇప్పుడు ఒక పేలడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతంలా మారింది.



## హార్మూజ్‌లో ఎమిరేట్స్ నౌకపై దాడి..

# భారతీయుని మృతి

### మరో 8 మందికి తీవ్ర గాయాలు

**సనా,జులై 14:** పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికాల మధ్య రేగిన ఉద్రిక్తతలు ఇప్పుడు ఇతర దేశాల పౌరుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. వ్యూహాత్మక హార్మూజ్ జలసంధిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఎఇ)కి చెందిన రెండు జాతీయ చమురు నౌకలపై ఇరాన్ జరిపిన భారీ క్షిపణి దాడిలో ఒక భారతీయ నౌకా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ఆరుగురు భారతీయులు, ఇద్దరు ఉక్రెయిన్ పౌరులు ఉన్నారని, వారిలో నలుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ దాడిని యుఎఇ రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇది అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా ఉల్లంఘించడమేనని, ప్రాంతీయ భద్రతకు తీవ్ర ముప్పని పేర్కొంది. తమ దేశ సార్వభౌమత్వాన్ని, పౌరులను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని, ఈ దుశ్చర్యకు తగిన రీతిలో బుద్ధి చెబుతామని యుఎఇ స్పష్టం చేసింది. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే అమెరికా సేనలు ఇరాన్‌పై వైమానిక దాడులను మరింత తీవ్రం చేశాయి. ఇరాన్ దాడుల సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు తాము సరికొత్త వైమానిక దాడులను ప్రారంభించినట్లు యుఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. మేం ఇరాన్‌ను చాలా బలంగా దెబ్బతీస్తున్నాం. వారి దాడి చేసే శక్తినంతటినీ తుడిచిపెడుతున్నాం. హార్మూజ్ జలసంధిని మా అదుపులోకి తెచ్చుకుని, దిగ్బంధాన్ని కఠినతరం చేస్తున్నాం అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్ ఓవల్ ఆఫీస్ నుండి ప్రకటించారు. హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకల రక్షణ బాధ్యతను తామే చూసుకుంటున్నందున, దానికి ప్రతిఫలంగా ఆయా నౌకల నుంచి రక్షణ రుసుము వసూలు చేయబోతున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు.





## కొవిడ్ వ్యాక్సిన్‌తో రక్తం గడ్డకట్టే కేసులు పెరగలేదు - ఐసిఎంఆర్ నివేదిక

**న్యూఢిల్లీ,జులై 14:** కొవిడ్ వ్యాక్సిన్ వల్ల రక్తం గడ్డకట్టే కేసులు కానీ, గుండెపోటు కేసులు కానీ పెరగలేదని ఐసిఎంఆర్ తన స్టడీ నివేదిక విడుదల చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్, నేషనల్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ ఎపిడమాలజీ దేశ వ్యాప్తంగా సుమారు 25 ఆస్పత్రుల్లో ఆ స్టడీ నిర్వహించారు. కోవిడ్19 టీకాకు, రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే సంఘటనలతో ఎటువంటి సంబంధంలేదని ఐసిఎంఆర్ తన అధ్యయనంలో తేల్చింది. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వారిలో కోవిడ్ టీకాలతో గుండెపోటు కానీ రక్తం గడ్డకట్టే కేసులు నమోదు కాలేదని ఐసిఎంఆర్ తన రిపోర్టులో చెప్పింది. 2021-23 మధ్య కాలంలో భారత్‌లో చోటుచేసుకున్న త్రాంబాటిక్ సంఘటనలు, ఆస్పత్రుల్లో కేస్ స్టడీ అన్న టైటిల్‌తో సర్వే చేపట్టారు. త్రాంబాసిస్ అంటే రక్తం గడ్డకట్టే ప్రక్రియ. ఈ పరిస్థితి చాలా వరకు కేసుల్లో మెడికల్ లేదా లైఫ్ స్టైయిల్ రిస్క్ ఫ్యాక్టర్ల వల్ల వస్తున్నట్లు గుర్తించారు. కోవిడ్ కన్నా ముందు నుంచి సిగరెట్ అలవాటు ఉండడం కానీ, గతంలో ఏవైనా వ్యాధులు ఉండడం వల్లకానీ, కుటుంబీకుల్లో రక్త సమస్యలు ఉన్నవారిలో టీకా రిస్క్ ఉన్నట్లు గుర్తించారని స్టడీలోతెలిపారు. మే 2023 నాటికి సుమారు 97 శాతం అర్హులైన వారికి ఇండియాలో ఓ డోసు కోవిడ్ 19 వ్యాక్సిన్ ఇచ్చారు. ఇక అప్పటికే 90 శాతం మందికి రెండు దశల డోసు తీసుకున్నారు. ముందస్తుజాగ్రత్తగా హెల్త్‌కేర్ సిబ్బందికి మూడవ డోసు ఇచ్చారు. 60 యేళ్ల దాటిన వారికి, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి కూడా మూడో డోసు ఇచ్చారు. వ్యాక్సినేషన్ వల్ల బెనిఫిట్స్ జరిగినట్లు స్టడీలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి భారత్‌తోపాటు విదేశాల్లోనూ విస్తృత ఆధారాలు ఉన్నట్లు స్టడీలో తెలిపారు.

## ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహ్మూదీ నెజాద్‌తో ఇజ్రాయెల్ కుట్ర!



### ఖమేనీ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు వ్యూహం లీక్

**టెహ్రాన్,జులై 14:** ఇరాన్‌లో ప్రస్తుత ఇస్లామిక్ ప్రభుత్వాన్ని కూలదోసి, ఆ స్థానంలో అహ్మదీ నెజాద్‌ను ఇరాన్ అధినేతగా కూర్చోబెట్టేందుకు ఇజ్రాయెల్ ఒక భారీ రహస్య వ్యూహాన్ని రచించినట్లు అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ గూఢచారి వర్గాల ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ సంచలన కథనం ప్రచురించింది. ప్రస్తుతం ఈ కుట్ర ఇరాన్ నిఘావర్గాలకు తెలిసిపోవడంతో అహ్మదీ నెజాద్‌ను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) గృహనిర్బంధంలో ఉంచినట్లు తెలుస్తోంది. ఇరాన్ అత్యున్నత నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీతో వచ్చిన విభేదాలు, దేశ పతనంపై ఉన్న అసంతృప్తితోనే అహ్మదీనెజాద్ ఇజ్రాయెల్ ప్రతిపాదనలకు తలొగ్గినట్లు సమాచారం.

2024లో హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లోని లుడోవికా యూనివర్సిటీలో జరిగిన పర్యావరణ సదస్సు కేవలం ఒక ముసుగు మాత్రమేనని, అక్కడే ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొసాద్ అప్పటి చీఫ్ డేవిడ్ బార్నియా నేరుగా అహ్మదీనెజాద్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారని కథనంలో పేర్కొన్నారు. ఇజ్రాయెల్ అధికారులతో చర్చలు జరిపేందుకు అహ్మదీనెజాద్ ప్రయాణ, వసతి ఖర్చులను కూడా ఇజ్రాయెలే భరించిందని,

ఈ విషయాన్ని మొసాద్ సంస్థ అమెరికా సిఐఎకి కూడా చేరవేసిందని సమాచారం. ఇటీవల ఇరాన్ -అమెరికా మధ్య జరిగిన దాడుల సమయంలో ఈ వ్యూహం పతాక స్థాయికి చేరింది. ఇరాన్‌లోని అహ్మదీ నెజాద్ నివాసంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి జరిగి ఆయన రక్షణ వాహనాలు ధ్వంసమైన వెంటనే, ఒక నల్లటి ప్యుజో కారు అక్కడికి చేరుకుని ఆయనను సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లింది. ఆ కారును నడిపింది మొసాద్ ఏజెంట్లని సమాచారం. ఇజ్రాయెల్ తనను మళ్లీ అధికారంలోకి తెస్తుందనే నమ్మకం సడలడం, ఆ రక్షణ చర్యలపై అనుమానాలు రావడంతో అహ్మదీ నెజాద్ ఆ సేఫ్ హౌస్ నుండి బయటకు వచ్చేశారు. ఆ తర్వాత ఫిబ్రవరి నుండి ప్రజల కంటపడని ఆయన గత వారం దివంగత సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియల వేళ మాత్రమే కొద్దిసేపు కనిపించారు.

2005 నుండి 2013 వరకు ఇరాన్ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో అహ్మదీనెజాద్ ఇజ్రాయెల్, పాశ్చాత్య దేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడేవారు. కానీ పదవి నుంచి దిగిపోయాక అవినీతిని వ్యతిరేకిస్తూ తన గొంతు మార్చారు. ప్రస్తుత ఇస్లామిక్ వ్యవస్థ కుప్పకూలితే తాను దేశాన్ని నడిపించగలనని, ట్రంప్ హయాంలో కుదిరిన అబ్రహం ఒప్పందాల తరహాలోనే ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణ స్థితికి తెస్తానని ఆయన సన్నిహితుల వద్ద ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అయితే ఈ సంచలన ఆరోపణలపై అటు ఇరాన్ కానీ, ఇటు ఇజ్రాయెల్ కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

# హార్మూజ్ టాక్స్ విత్‌డ్రా

### గల్ఫ్ దేశాలతో పెట్టుబడి, వాణిజ్య ఒప్పందాలకే ట్రంప్ మొగ్గు

**వాషింగ్టన్,జులై 14:** హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే సరుకు రవాణాపై 20 శాతం రుసుము విధిస్తామని చేసిన ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తీసుకున్నారు. దానికి బదులుగా మధ్యప్రాచ్యంలోని గల్ఫ్ దేశాలు అమెరికాలో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టడం, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా ప్రయోజనం పొందాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్ మధ్యప్రాచ్య దేశాల నాయకులతో అత్యంత ఫలప్రదమైన చర్చలు జరిపిన అనంతరం, అమెరికాకు చెల్లించాల్సిన 20 శాతం రీయింబర్స్‌మెంట్ ఫీజును రద్దు చేసి, దాని స్థానంలో గల్ఫ్ దేశాలతో భారీ పెట్టుబడి, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని నిర్ణయించానని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు అపార స్థాయిలో ఉంటాయని, అవి అమెరికాతో పాటు గల్ఫ్ దేశాల భవిష్యత్తుకూ ఎంతో ప్రయోజనకరంగా మారతాయని ట్రంప్ తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో కొత్త పరిశ్రమలు, తయారీ యూనిట్లు, ప్లాంట్లు, ఆధునిక పరికరాల తయారీ కేంద్రాలు చారిత్రక స్థాయిలో ఏర్పడతాయని, దాంతో లక్షలాది అధిక వేతనాల ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన చెప్పారు. అంతకుముందురోజే ట్రంప్ హార్మూజ్ జలసంధి గుండా రవాణా అయ్యే ప్రతి సరుకుపై 20శాతం రుసుము వసూలు చేస్తామని ప్రకటించారు. ప్రపంచంలోని అత్యంత కీలక సముద్ర మార్గాల్లో ఒకటైన హార్మూజ్ జలసంధి భద్రత కోసం అమెరికా భారీ వ్యయం చేస్తోందని, ఆ ఖర్చును భర్తీ చేసేందుకు ఈ రుసుము అవసరమని ఆయన పేర్కొన్నారు.అమెరికా ఇకపై హార్మూజ్ జలసంధి సంరక్షక దేశంగా వ్యవహరిస్తుందని, ఆ ప్రాంతంలో భద్రత, రక్షణ కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని సరుకు రవాణాపై 20 శాతం రుసుము రూపంలో వసూలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌పై కఠిన వైఖరిహోర్మూజ్ జలసంధి ఇతరదేశాలకు తెరిచి ఉన్నప్పటికీ, ఇరాన్‌కు మాత్రం అందుబాటులో ఉండదని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ నాయకత్వం హింసాత్మక, మోసపూరిత విధానాలను అనుసరిస్తోందని ఆరోపించిన ఆయన, ఇరాన్‌కు సంబంధించిన నౌకలు లేదా ఇరాన్ సరుకు రవాణా చేసే నౌకలపై పూర్తి దిగ్బంధనం అమలు చేస్తామని హెచ్చరించారు.

## కోడలికి మామ ఆస్తిలో పోషణహక్కు: సుప్రీంకోర్టు కీలక తీర్పు



**న్యూఢిల్లీ,జులై 14:** హిందూ కుటుంబాలలో కోడళ్ల హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది.మామ మరణించిన తర్వాత భర్త మరణించినప్పటికీ, కోడలు తన మామ ఆస్తి నుండి భరణం పొందేందుకు అర్హురాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ హక్కు హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం, (1956) ప్రకారం వర్తిస్తుందని కోర్టు పేర్కొంది. జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి ధర్మాసనం ఈ తీర్పునువెలువరించింది. తీర్పులో కుటుంబ సభ్యులను ఆదుకోవడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా సామాజిక, నైతిక బాధ్యత కూడా అని పేర్కొంది. మనుస్మృతిలోని తల్లి, తండ్రి, భార్య మరియు కుమారుడినిఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టకూడదు. వారిని విస్మరించడం నైతిక నేరం అనే భావనను కూడా ప్రస్తావించింది. భర్త మరణించిన సమయాన్ని ఆధారంగా తీసుకుని కోడలికి భరణం నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. మామ బతికున్నప్పుడే భర్త మరణించి ఉండాలనే నిబంధన విధించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 21 (గౌరవప్రదమైన జీవన హక్కు)లకు విరుద్ధమని స్పష్టం చేసింది. మహేంద్ర ప్రసాద్ 2021లో మరణించారు. అనంతరం ఆయన కుమారుడు రంజిత్ శర్మ 2023లో (తండ్రి మరణించిన తర్వాత) మరణించారు. రంజిత్ శర్మ భార్య గీతా శర్మ తన పోషణ కోసం మామ ఆస్తి నుండి భరణం కోరుతూ కోర్టును ఆశ్రయించారు. దిగువ కోర్టు, గీతా శర్మ మామ జీవించి ఉన్న సమయంలో విధవరాలు కాలేదనే కారణంతో ఆమె పిటిషన్‌ను తిరస్కరించింది. సుప్రీంకోర్టు ఆ నిర్ణయాన్ని రద్దు చేస్తూ, భర్త మరణించిన సమయాన్ని ఆధారంగా తీసుకుని భరణం నిరాకరించడం చట్టబద్ధం కాదని పేర్కొంది. గీతా శర్మకు మామ ఆస్తి నుండి భరణం పొందే హక్కు ఉందని తీర్పు ఇచ్చింది. మామ ఆస్తిని పొందిన వారసులు, చట్టం ప్రకారం ఆధారపడిన కోడలి పోషణ బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది భర్తకు స్వంత ఆస్తి లేకపోయినా, తనను తాను పోషించుకోలేని స్థితిలో ఉన్న కోడలికి భరణం కోరే హక్కు ఉంటుంది మహిళల గౌరవం, జీవన భద్రతను కాపాడే విధంగా చట్టాలను విస్తృతంగా అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



## లష్కరేచీఫ్ హాఫీజ్ సయీద్‌కు నాన్‌బెయిలబుల్ వారంట్

**న్యూఢిల్లీ,జులై 14:**లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌పై జమ్మూకశ్మీర్‌కు చెందిన ప్రత్యేక ఎన్ఐఎ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. పెహల్గామ్ ఉగ్రదాడితో లింకున్న కేసులో కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. జూలై 8వ తేదీన ఎన్ఐఎ కోర్టు ప్రత్యేక జడ్జ్ ఆ ఆదేశాలు జారీ చేశారు. పెహల్గామ్ ఉగ్రదాడి కేసులో హాఫీజ్ సయీద్‌పై ఎన్ఐఏ నేరాభియోగం నమోదు చేసిన తర్వాత కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. భారత్, అమెరికా దేశాలు హాఫీజ్ సయీద్‌ను గ్లోబల్ ఉగ్రవాదిగా ప్రకటించిన విషయం తతెలిసిందే. 2008 ముంబై ఉగ్రదాడి కేసులో మాస్టర్‌మైండ్ కూడా. 76 ఏళ్ల సయీద్‌పై సప్లమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

భారతీయ న్యాయ సంహితో పాటు యుఎపిఎ సెక్షన్ల కింద అతనిపై కేసు బుక్ చేశారు. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులోఉన్న సరోగ్దాలో సయీద్ ఉంటున్నట్లు ఎన్ఐఎ కోర్టుకు చెప్పింది. పెహల్గామ్ ఉగ్రదాడి నిందితుడైన హాఫీజ్.. ప్రస్తుతం అరెస్టు నుంచి తప్పించు కున్నట్లు కోర్టు పేర్కొన్నది. హాఫీజ్ అరెస్టు కోసం నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసిన ఎన్ఐఎ.. ఎట్టి పరిస్థితుల్లో అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నది. పెహల్గామ్ ఉగ్రదాడి కేసులో నిష్పాక్షిక దర్యాప్తు కోసం సయీద్‌ను కస్టడీలోకి తీసుకోవాలని ఎన్ఐఎ పేర్కొన్నది. నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ ఆదేశాలను జమ్మూ డీఐజీకి పంపినట్లు ఎన్ఐఎ కోర్టు తెలిపింది. 2025 ఏప్రిల్ 22వ తేదీన పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే.

## ప్రధానిమోడీకి కేతన్ అగర్వాల్ తల్లి సుదీర్ఘలేఖ





**పూణె,జులై 14:** పుణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో న్యాయం చేయాలని కోరుతూ ఆయన తల్లి రాఖీ అగర్వాల్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి భావోద్వేగభరితమైన లేఖ రాశారు. తన కుమారుడి మరణంతో తమ ప్రపంచం శూన్యమైందని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె, ఈ కేసును కేవలం మరో ఫైల్‌గా పరిగణించవద్దని ప్రధానిని వేడుకున్నారు. గత నెల 18న 26 యేళ్ల కేతన్ అగర్వాల్‌ను లోహగడ్ కోటపై నుంచి తోసి హత్య చేసిన ఉదంతం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ దారుణానికి కేతన్ కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హత్యగా నిర్ధారించిన పోలీసులు, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ప్రధానమంత్రికి పంపిన ఈమెయిల్‌లో రాఖీ అగర్వాల్ తన మనోవేదనను పంచుకున్నారు. ప్రతి తల్లిలాగే, నా కుమారుడు వివాహం చేసుకుని మా కళ్ల ముందే సంతోషంగా జీవించాలని కలలు కన్నాను. కానీ, విధి వైపరీత్యం వల్ల నా బిడ్డకు నేనే అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఈ కేసులో మరో విషాదం కూడా చోటుచేసుకుంది. కేతన్ మరణాన్ని తట్టుకోలేక, సుమారు 20 రోజుల తర్వాత అతని తాత దేవీచంద్ అగర్వాల్ (71) గుండెపోటుతో మరణించారు. కేవలం కొద్ది రోజుల వ్యవధిలోనే మా కుటుంబం రెండు తరాలను కోల్పోయిందని రాఖీ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎలాంటి సానుభూతిని లేదా ప్రత్యేక సహాయాన్ని కోరడం లేదని స్పష్టం చేసిన రాఖీ, న్యాయం జరగడంలో జాప్యం జరిగే కొద్దీ తమ బాధ రెట్టింపు అవుతోందని పేర్కొన్నారు. దయచేసి కేతన్ కేసును మరో ఫైల్‌గా మిగిలిపోనివ్వకండి. నాకు అతనే సర్వస్వం. ఏదో ఒకరోజు నా కుమారుడి చిత్రపటం ముందు నిలబడి నీకున్యాయం జరిగిందని చెప్పాలనుకుంటున్నానని ఆమె తన లేఖను ముగించారు. గత వారం కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, విచారణను వేగవంతం చేయాలని విన్నవించారు.

## 14 యేళ్లకు.. పగతీర్చుకున్న ఏనుగు!




### ఓ కుటుంబాన్ని అంతం చేసిన నేపాల్ 'ధ్రుబే'

**ఖాట్మండు,జులై 14:** నేపాల్‌కు చెందిన ఒక ఏనుగు పగబట్టి ఓ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. పగబట్టి వెంటాడింది. ఈ క్రమంలో 14 యేళ్ల క్రితమే ఇద్దరిని చంపేసింది. దాంతో భయపడిన ఆ కుటుంబం ఊరి వదిలిపోయి వేరే ఊళ్లో మకాం పెట్టింది. అయినా ఆ కుటుంబాన్ని పసిగట్టి మరో ఇద్దరిని చంపేసింది. దాంతో ఆ ఏనుగు దాడిలో ఒకే కుటుంబానికి చెందిన నాలుగు ప్రాణాలు గాల్లో కలిసిపోయినట్లు అయ్యింది. ఈ హృదయవిదారక ఘటన నేపాల్‌లో చోటుచేసుకుంది. నేపాల్‌లోని చిత్వాన్ నేషనల్ పార్క్ సమీపంలో నివసించే శనిచర బోటే కుటుంబానికి ధ్రుబే అనే ఏనుగు రూపంలో మృత్యువు వేటాడింది. 2012 డిసెంబర్‌లో మాడి అనే పట్టణంలో ధ్రుబే ఏనుగు దాడిచేసి శనిచర తల్లిదండ్రులు ప్రాణాలు కోల్పోయారు. ఈ భయంకరమైన ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన శనిచర తన కుటుంబాన్ని ఈ ప్రమాదం నుంచి కాపాడుకోవాలని నిర్ణయించుకున్నాడు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాప్తి నది దాటి దాదాపు 9 మైళ్ల దూరంలోని జగత్‌పూర్‌కు తన నివాసాన్ని మార్చాడు. ఇకతమకు ఆ ఏనుగు నుంచి ఎలాంటి ప్రమాదం ఉండదని భావించాడు. అయితే విధి వారిని వెక్కిరించింది. 14 యేళ్ల తర్వాత అదే ధ్రుబే ఏనుగువాసనతో పసిగట్టి వారిని వెతుక్కుంటూ వచ్చింది.

ఈ నెల ఆరంభంలో జగత్‌పూర్‌లోని శనిచర ఇంటిపై దాడిచేసి, అతని 25 ఏళ్ల కోడలు ఆషికాబోటేను, 4 ఏళ్ల మనవడు భరత్ బోటేను అతి కిరాతకంగా చంపేసింది. నదులుదాటి ఇంత దూరం వస్తే మమ్మల్ని ఏమీ చేయలేదని అనుకున్నాం. కానీ ఇన్ని సంవత్సరాల తర్వాత అదే ఏనుగు మమ్మల్ని వెతుక్కుంటూవచ్చి నా కోడలిని, మనవడిని బలిగొంది. ఇక పారిపోవడానికి చోటు కూడాలేదు అంటూ ఆయన కన్నీరుమున్నీరయ్యారు. ధ్రుబే ఏనుగు నేపాల్‌లో అత్యంత ప్రమాదకరమైనదిగా పేరుగాంచింది. 2010 నుంచి ఇప్పటివరకు ఈ ఒక్క ఏనుగే 25 మందిని చంపినట్లు చిత్వాన్ నేషనల్ పార్క్ అధికారులు ధ్రువీకరించారు.

# సంక్షిప్త వార్తలు

## అభా విమానాశ్రయంపై హూతీల దాడి



**రియాద్, జులై 14:** అమెరికా - ఇరాన్ ఉద్రిక్తతలు సరిపోనట్లు.. ఇప్పుడు సౌదీ అరేబియా-హూతీల మధ్య మరోసారి ఘర్షణలు చెలరేగాయి. సౌదీలోని అభా అంతర్జాతీయ విమానాశ్రయంపై హూతీ తిరుగు బాటుదారులు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డారు. ఇరాన్ నుంచి హూతీ ప్రతినిధుల బృందాన్ని తీసుకువస్తున్న విమానాన్ని అడ్డుకునేందుకు సోమవారం సౌదీ మద్దతున్న యెమెన్ ప్రభుత్వం సనా అంతర్జాతీయ విమానాశ్రయంలోని రన్‌వేపై బాంబు దాడి చేయడంతో ఈ ఘర్షణలు ప్రారంభమయ్యాయి. దాదాపు నాలుగేళ్లుగా సౌదీ అరేబియా, ఇరాన్ మద్దతు ఉన్న హూతీ మధ్య ఉన్న ప్రశాంతతకు ఈ దాడులతో బ్రేకులు పడినట్లయింది.

## మూడు లక్షలకుపైగా అమర్‌నాథ్‌ను సందర్శించిన భక్తులు



**శ్రీనగర్,జులై 14:** పవిత్ర అమర్‌నాథ్ యాత్ర అత్యంత భక్తి శ్రద్ధలతో విజయవంతంగా కొనసాగుతోంది. యాత్ర ప్రారంభమైన తొలి 11 రోజుల్లోనే దర్శించుకున్న భక్తుల సంఖ్య 2.75 లక్షలు దాటి మూడు లక్షలకు చేరువైంది. యాత్రికుల తాకిడి రోజురోజుకు క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో మంగళవారం అమర్‌నాథ్‌ను దర్శించుకున్న భక్తుల సంఖ్య మూడు లక్షలు దాటే అవకాశం ఉంది. మంగళవారం జమ్మూ నుంచి 5,335 మంది భక్తులతో కూడిన మరో బృందం కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్‌కు బయలుదేరింది.

## భోజ్‌శాలలో శుక్రవారం ప్రార్థనలకు సుప్రీం అనుమతి

**న్యూఢిల్లీ, జులై 14:** మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాలలో ఉన్న వివాదాస్పద సరస్వతీ దేవి గుడి స్థలం వద్ద శుక్రవారం పూట ప్రార్థనలు జరుపుకునేందుకు ముస్లింలకు సుప్రీంకోర్టు తాత్కాలిక ఊరట కల్పించింది. వివాదాస్పద ప్రాంతానికి పక్కలో ముస్లింలకు కొంత స్థలాన్ని ప్రార్థనల కోసం కేటాయించాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఆ స్థలంలో శుక్రవారం మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల మధ్య ముస్లింలు నమాజ్ చేసుకోవాలని కోర్టు సూచించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.

## అవినీతి నిరోధకశాఖ డైరెక్టర్ ఆకస్మిక బదిలీ



**చెన్నై,జులై 14:** తమిళనాడు రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపిఎస్ అధికారి ఎ. అరుణ్‌ను నియమించిన రెండు నెలల్లోనే విజయ్ ప్రభుత్వం ఆ పోస్టు నుంచి బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ర్యాంక్ అధికారిణి సి.మహేశ్వరిని డివిఎసి పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో కొత్త చీఫ్‌గా నియమిస్తూ అడిషనల్ చీఫ్ సెక్రటరీ కె.మణివాసన్ తక్షణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎడిజిపి ర్యాంక్ అధికారి అయిన అరుణ్‌ను చెన్నైలోని తమిళనాడు పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా పంపారు. ఈ యేడాది అసెంబ్లీ ఎన్నికల తర్వాత మే నెల చివరి వారంలో విజయ్ ప్రభుత్వం అరుణ్‌ను డివిఏపి చీఫ్‌గా నియమించింది.

## ప్రశాంత్ కిశోర్ ఆస్తులు రూ. 96 కోట్లు!

**బంకిపూర్,జులై 14:** బీహార్‌లోని బంకిపూర్ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ.96 కోట్లకు పైగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.22.19 కోట్ల విలువైన చరాస్తులు, రూ.73.87 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయని తెలిపారు. ఆయన భార్య జాహ్నవి దాస్ పేరిట రూ.89.51 కోట్ల చరాస్తులు, రూ.12.42 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడైంది. నామినేషన్ దాఖలు చేసే ముందు సోన్‌పూర్‌లోని బాబా హరిహర్‌నాథ్ ఆలయంలో ప్రశాంత్ కిశోర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మహిళల వ్యవసాయ కమతాల్లో స్వల్ప పెరుగుదల

## 11.98 శాతానికి చేరిన భూయాజమాన్యం

### కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ నివేదిక

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు, వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు ప్రధాన జీవనోపాధి వనరుగా ఉన్నాయి. గ్రామీణ మహిళల్లో 80 మంది ఈ రంగాలలోనే నిమగ్నమై ఉన్నారు. వీరిలో 33 మంది వ్యవసాయ కూలీలుగా ఉండగా, 48 మంది స్వయం ఉపాధి రైతులుగా ఉన్నారు. వ్యవసాయ రంగంలో మహిళా రైతులు ఒక కీలకమైన భాగంగా ఉన్నారు, ఈ రంగంలో మహిళల భాగస్వామ్యం నానాటికీ గణనీయంగా పెరుగుతోంది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం, మహిళల వ్యవసాయ భూమి యాజమాన్యం 2015-16లో 11.72 శాతం నుండి ఇప్పటికి 11.98 శాతానికి స్వల్పంగా పెరిగింది. పీఎం కిసాన్ పథకం రుణ పరిమితులను సులభతరం చేయడం, పెట్టుబడి కొనుగోళ్లను మెరుగుపరచడం మరియు చాలా మంది లబ్ధిదారులకు వ్యవసాయ ఆదాయాలను పెంచడం ద్వారా సానుకూలమైన కానీ పరోక్ష ప్రభావాన్ని చూపినట్లు కనిపిస్తోంది. కొత్తగా చేరిన ప్రతి నలుగురు లబ్ధిదారులలో ఒకరు మహిళ అని, కొత్తగా చేరిన వారిలో మహిళల వాటా 26.20 శాతంగా ఉందని నివేదిక పేర్కొంది. పీఎంకిసాన్ లబ్ధిదారులలో వారి మొత్తం వాటా 22.64 శాతంగా ఉంది, ఇది ప్రస్తుత లబ్ధిదారులలో వారి వాటా కంటే ఎక్కువ. వ్యవసాయంలో లింగ దృక్పథం యొక్క ఆవశ్యకతను నొక్కిచెబుతూ, వ్యవసాయ కార్యకలాపాలు, పశువుల సంరక్షణ, పంట కోతానంతర పనులు, అనుబంధ జీవనోపాధులలో మహిళల పాత్రను ఈ నివేదిక ప్రముఖంగా పేర్కొంది.

ఉత్పాదకత, స్థితిస్థాపకత, ప్రభుత్వ సహాయానికి సమాన ప్రాప్యత కోసం లింగ సమ్మిళితం అత్యవసరమని ఇందులో అభిప్రాయపడింది. వ్యవసాయం మరింత సాంకేతికత ఆధారితంగా మారుతున్న తెలంగాణ వంటి రాష్ట్రాలలో, నేల పరీక్ష, విత్తన ఎంపిక నుండి మార్కెటింగ్, విలువ జోడింపు వరకు ప్రతి దశలోనూ మహిళలను భాగస్వాములను చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ఇప్పటికే పంట ఉత్పత్తి, పశుసంపద నిర్వహణ, వ్యవసాయ అటవీకరణ, మత్స్య పరిశ్రమ, ఉద్యానవనం, పంటకోతకు ముందు కార్యకలాపాలు, పంటకోత అనంతర ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వంటి మొత్తం వ్యవసాయ విలువ గొలుసు అంతటా వారి ప్రమేయం విస్తరించి ఉంది. తత్ఫలితంగా, వ్యవసాయ వృద్ధిని సాధించడంలో, ఆహార భద్రతను మెరుగుపరచడంలో మరియు గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేయడంలో మహిళల భాగస్వామ్యం కీలకంగా ఉందని వ్యవసాయ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.



గద్వాల్ విజయలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న మహిళలు, ఇఆర్వో శంకర్ తదితరులు.

# మహిళా బిఎల్వోలపై దాడి బాధ్యులపై చర్యలు తీసుకోండి

### మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌కు ఫిర్యాదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 14, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ విధులు నిర్వహిస్తున్న మహిళా బూత్‌లెవల్ ఆఫీసర్స్(బీఎల్వోల)పై దాడికి పాల్పడి వారి గౌరవానికి భంగం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మికి అధికారులతోపాటు మహిళలు పెద్దఎత్తున ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్‌లోని ఆమె నివాసినికి వచ్చిన మహిళలతోపాటు దాడికి గురైన బీఎల్వో సంధ్య, ఈఆర్వో శంకర్ తదితరులు ఈ మేరకు ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ నెల 13న మహిళా బీఎల్వోలపై కొందరు జరిపిన దాడిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైందని, మహిళా ఉద్యోగుల విధులను అడ్డుకొని దాడికి పాల్పడటం అత్యంత అవమానకర చర్య అని అన్నారు. దాడి కారణంగా భయభ్రాంతులకు గురిచేయడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడం, మమిళల భద్రతకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ముప్పుగా భావిస్తున్నట్లు మహిళలు ఆయా వినతిపత్రంలో కోరారు. మహిళా బీఎల్వోలకు తగిన రక్షణ కల్పించాలని, సంఘటనపై సమగ్రమైన నివేదికను పోలీసుల నుండి కోరాలని, దర్యాప్తు నిస్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకొనేలా సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని ప్రసన్నలత, నాగలక్ష్మి, సంధ్య, హేమలత, శాంతి నాగజ్యోతి తదితరులు వినతిపత్రంలో పేర్కొన్నారు.

# ఎరువుల ఉచిత రవాణా రద్దు

### రైతులపై రూ.150 కోట్లు అదనపు భారం

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** ఎరువుల (యూరియా) ఉచిత రవాణాను పూర్తిగా రద్దు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్), ఆగ్రో రైతు సేవా కేంద్రాల (ఏఆర్ఎస్‌కే) లకు ఉచితంగా ఎరువులను రవాణా చేసేవారు. ప్రభుత్వం ఈ సదుపాయాన్ని పూర్తిగా ఎత్తివేయడంతో, ఇకపై రవాణా ఛార్జీల భారం నేరుగా రైతులపై పడే అవకాశం ఉంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కాగా యూరియాతో పాటు, ఇతర ఎరువుల పంపిణీకి తెలంగాణ మార్కెటింగ్ ఫెడరేషన్ (టిజిమార్క్‌ఫెడ్) నోడల్ ఏజెన్సీగా ఉన్నది. పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లు, ఏఆర్ఎస్‌కేలకు ఉచితంగా ఎరువులను సరఫరా చేసేది. ప్రస్తుతం మార్క్‌ఫెడ్‌కు 22 రేక్ పాయింట్లు ఉన్నాయి. రైళ్ల ద్వారా వచ్చిన ఎరువులను రేక్ పాయింట్ల నుంచి నుంచి గోదాముల్లోకి తరలిస్తారు. అక్కడి నుంచి పీఏసీఎస్, ఇతర ఏజెన్సీలకు ఇప్పటి వరకూ ఉచితంగా ఎరువులను రవాణా చేసేవారు. ఇలా ఎరువుల ఉచిత ఎరువుల రవాణా కోసం ప్రభుత్వానికి ఏటా రూ.150 కోట్ల వరకు ఖర్చవుతున్నట్టు అంచనా. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే డీసీఎంఎస్‌లు, ఏఆర్ఎస్‌కేలకు ఉచిత రవాణా సదుపాయాన్ని రద్దు చేసింది. కేవలం పీఏసీఎస్‌లకు మాత్రమే కొనసాగించింది.

# జిఒ 25ను తక్షణమే సవరించాలి

### సబ్జెక్టువారీ పేపర్లతో స్పెషల్ టెట్ నిర్వహించాలి

### విద్యారంగ సమస్యలపై ఐక్యఉద్యమం

### యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ నిర్ణయం

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** ప్రాథమిక విద్యకు నష్టదాయకమైన జిఒ 25ను సవరించాలని, సబ్జెక్టు వారీ పేపర్లతో స్పెషల్ టెట్ నిర్వహించాలని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఐక్య ఉద్యమం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్‌పిసి) స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలసి ఐక్య పోరాటం నిర్వహించాలని స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సమావేశం మంగళవారం టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో టిటిఎ అధ్యక్షుడు ఎస్ హరికృష్ణ అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాథమిక విద్యకు నష్టదాయకమైన జిఒ 25ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రెసిడెన్షియల్ ఆర్డర్(పీవో)-2018కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని సమావేశం విమర్శించింది. టెట్‌లో సర్వీసు వెయిటేజ్ ఇవ్వాలని, సబ్జెక్టు వారీ పేపర్లతో స్పెషల్ టెట్ నిర్వహించాలని నిర్ణయించినట్టు నాయకులు తెలిపారు. బిసి, గిరిజన గురుకులాల టైంటేబుల్ మార్చాలని, మోడల్ స్కూల్స్‌ను విద్యాశాఖలో విలీనం చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని తీర్మానం చేశారు. 5 వాయిదాల కరువు భత్యం(డిఎ)ను వెంటనే ప్రకటించాలని, పిఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని అమలు చేయాలని నిర్ణయించారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సమావేశంలో యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, ఎ వెంకట్(టిఎస్ యుటిఎఫ్) సిహెచ్ అనిల్ కుమార్, ఎన్ తిరుపతి(టిపిటిఎఫ్), ఎం సోమయ్య, టి లింగారెడ్డి (డిటిఎఫ్), కొమ్ము రమేష్ (బిటిఎఫ్), యానం విజయకుమార్, ఇటికాల రవీందర్(ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం), బి కొండయ్య (ఎంఎస్ టిఎఫ్), లక్ష్మణ్(టిటిఎ), రవీందర్, లక్ష్మయ్య యాదవ్(టిపిటిఎఫ్) పాల్గొన్నారు.

# 'కాళేశ్వరం'పై సాగునీటి ప్రాజెక్టు ఇంజినీర్లతో ప్రత్యేక కమిటీ వేయాలి


### అధికార, ప్రతిపక్షాలు వ్యక్తిగత దూషణలు ఆపాలి

### రైతులకు సాగు నీరందించడంపై దృష్టి సారించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టుపై సాగునీటి ప్రాజెక్టుల ఇంజనీర్లతో ప్రత్యేక కమిటీ వేయాలని, అధికార, ప్రతిపక్షాలు వ్యక్తిగత దూషణలు ఆపాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు ఎలా అందించాలనే అంశంపై దృష్టి సారించాలని సూచించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) ద్వారా నిపుణులను పంపించి అధ్యయనం చేయించాలని అసలు విషయం తేల్చి ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివరావు రావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహాతో కలిసి మాట్లాడారు. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ నాయకులు పరస్పరం వ్యక్తిగత దూషణల పర్వంతో రాజకీయ వికృత క్రీడకు, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని కూనంనేని సాంబ శివరావు అగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత దూషణల పర్వాన్ని వెంటనే ఆపి రైతులకు సాగు నీరు ఎలా అందించాలనే అంశంపై దృష్టి సారించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సాగు నీటి ప్రాజెక్టుల ఇంజనీర్లతో ప్రత్యేక కమిటీ వేయాలని, ఈ కమిటీలో కేంద్ర జల వనరుల నిపుణులతో పాటు రాజకీయ పార్టీలు సూచించే నిపుణులను చేర్చి పూర్తిస్థాయి అధ్యయనం చేయించి కమిటీ సిపార్సు మేరకు తుది నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో కారణంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సాగు నీటి సమస్య కంటే అధికార, ప్రతిపక్ష నాయకులు రాజకీయ పంతాలే ముఖ్యమన్నట్లుగా వ్యవహరిస్తున్నారని కూనంనేని విమర్శించారు. రాజకీయ నాయకుల భాష, సంస్కృతి చాలా అభ్యంతరకరంగా, ఇబ్బంది కరంగా మారిందని, పదేళ్ల కాలంలో ఎప్పుడూ లేనటువంటి ఒక నీచమైన సంస్కృతికి తెర లేపారని, దీనికి ఆద్యుడు మాజీ సిఎం కెసిఆర్ అయితే, ఇప్పుడు ఆయనను మించిన భాషను వాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయాలా వద్దా అనే అంశం తేల్చేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు సాగు నీటి రంగ నిపుణులు కారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. సింగరేణి పరిధిలోని అన్ని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించి ఈ నెల 24తో గడువు ముగుస్తున్న నేపథ్యంలో, ఆ సమయం ఏమాత్రం సరిపోదని, గడువును కనీసం మరో మూడు నెలల పాటు పొడిగించాలని సాంబశివరావు ఎన్నికల కమిషన్ కోరారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలలోనే 40 లక్షల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉన్నదనే సమాచారం నేపథ్యంలో అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదును పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు.

# ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేయాలి



సత్యాగ్రహ దీక్షనుద్దేశించి ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య

### ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రలు మానుకోవాలి : ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జులై 14, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా 14 లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు 8వేల కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్కాలర్‌షిప్‌లు, ఫీజుల బకాయిల సాధనకై ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్.కృష్ణయ్య సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ స్పీకర్, శాసన మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, వివిధ బీసీ సంఘాల నేతలు హాజరై మద్దతు తెలిపారు. బీసీ సంఘం యువనేతలు విద్యార్థులతో కలసి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజురీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, వెంటనే ఇటు వంటి కుట్రలను ప్రభుత్వం మానుకోకపోతే ప్రభుత్వంపై బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీలకు ఒక కొత్త స్కీంను కూడా ప్రకటించలేదని, బీసీలకు మంత్రి వర్గంలో, నామినేటెడ్ పదవుల కేటాయింపులో, బడ్జెట్ కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. గత 50 సంవత్సరాలుగా బీసీల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేశామని, ఇంతవరకు రేవంత్‌రెడ్డి వంటి బీసీ వ్యతిరేక ముఖ్యమంత్రిని చూడలేదని అన్నారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం ద్వారా బీసీ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని బీసీ సమాజంలో గుణాత్మకమైన మార్పు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలని సూచించరు. మధుసూదనాచారి మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థి ఉద్యమాలను సీఎం రేవంత్‌రెడ్డి తక్కువ అంచనా వేస్తున్నారని, విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాగించలేదనే విషయం గ్రహించాలని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజురీయంబర్స్‌మెంట్ పథకాన్ని యధావిధిగా కొనసాగించిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని అమలుచేయాలని సూచించారు. విద్యార్థులు చేస్తున్న న్యాయ పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ దీక్షా కార్యక్రమంలో శ్రీనివాసగౌడ్ బీసీ సంక్షేం సంఘం తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రాష్ట్ర నాయకులు అనంతయ్య, బీసీ యువజనసంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోదీ రాందేవ్, కన్వీనర్లు నిఖిల్ పటేల్, పగిళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్ విజయవంతం

### ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త కళాశాలల బంద్ విజయ వంతమైందని సంఘం రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్ మెంట్ ఎత్తివేత కుట్రలను ఆపి, పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటాలొద్దని, పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యను అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త కళాశాలల బంద్ విజయవంతమైందని తెలిపారు. రాంబాబు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 20 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాం గులు, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యా ర్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి చదువుకుం టున్నారని, ఈ పథకాన్ని ఎత్తివేస్తే విద్యార్థుల జీవితాలు నాశనం అవుతాయన్నారు. పేదవాడికి ఇంజనీరింగ్, మెడిసిన్, లా వంటి చదువులు అందని ద్రాక్షగా మిగులుతాయన్నారు. ప్రభుత్వం సరైన సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయని కారణంగా రూ. 11000 కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు.

ప్రభుత్వ నిరక్ష్యం కారణంగా ప్రతి యేటా 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతు న్నారని, విద్యార్థులు సర్టిఫికెట్స్ తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రాష్ట్రానికి చెందిన విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వలసవెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తుంగలో తొక్కుతూ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసిందని, తమ ప్రభుత్వంలో బకాయిలు చెల్లించడంతో పాటుగా, గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఫీజులు చెల్లిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తానే స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు బకాయిలు విడుదల చేయకపోవడంతో ఈ విషయం కోర్టు మెట్లు ఎక్కిందనీ రాంబాబు గుర్తు చేశారు.

ప్రైవేట్ కాలేజీలు ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకంలో విద్యార్థులు బలి అవుతున్నారని, ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, ప్రభుత్వం కళ్ళు తెరవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని రాంబాబు హెచ్చరించారు.

# సివిల్స్-2027 ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

### నేటి నుంచి ఆగస్టు 7 వరకు స్వీకరణ

### బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ హరికృష్ణ

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని నిరుపేద బీసీ నిరుద్యోగులకు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్-2027 కోసం ఉచిత శిక్షణను బీసీ సంక్షేమ శాఖ అందించనుంది. ఇందకు సంబంధించిన శిక్షణ కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి స్క్రీనింగ్ పరీక్షను నిర్వహించి ఉత్తమ ప్రతిభ సాధించిన 150 మందికి ఉచితంగా సివిల్స్-2027 కోచింగ్‌ను ఇవ్వనున్నట్టు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరక్టర్ మామిడి హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్-కమ్-మెయిన్స్)-2027 ఉచిత శిక్షణ కార్యక్రమానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ కోచింగ్ క్లాసులు ఆగస్టు 24 నుంచి 2027 వరకు హైదరాబాద్‌లో నిర్వహించబడుతుందని తెలిపారు. 150 మంది అభ్యర్థులకు శిక్షణ అందించనుండగా, అందులో 100 మంది ఓపెన్ కేటగిరీ ద్వారా, 50 మంది తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ప్రిలిమ్స్ అర్హత పొందిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5,000 స్టైపెండ్ (ప్రభుత్వ నిబంధనల మేరకు)ఒకేసారి రూ.5,000 పుస్తక భృతి. గ్రంథాలయ సౌకర్యం, నిపుణుల ద్వారా ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్, మాక్ టెస్టులు, మార్గదర్శకత్వం, గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత కలిగి కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షలలోపు ఉన్న తెలంగాణ నివాసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 17 నుంచి ఆగస్టు 7 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఆగస్టు 13 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌కి అవకాశం కల్పించారు. ఆగస్టు 16న దరఖాస్తు చేసుకున్న వారికి స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహించి 19న ఫలితాలను విడుదల చేస్తారు. 21న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించి ఆగస్టు 24 నుంచి క్లాసులను ప్రారంభిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు.

# చలో సెక్రటేరియట్ ఉద్రిక్తం

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్

### అడ్డుకున్న పోలీసులు, తోపులాట

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు మంగళవారం తలపెట్టిన ఛలో సెక్రటేరియట్ ఉద్రిక్తంగా మారింది. సచివాలయంలోనికి వెళ్లడానికి విద్యార్థి సంఘాల నాయకులు ప్రయత్నించడంతో.. పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట జరిగిన సమయంలో సచివాలయం ముందు కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి సంఘాల నాయకులు పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఏఐఎఫ్‌డిఎస్, ఏఐఎస్‌బి, ఏఐడిఎస్‌వో, ఏఐపిఎస్‌యు వామపక్ష విద్యార్థి సంఘాలు సోమవారం సచివాలయం ముట్టడికి ప్రయత్నించాయి. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన "చలో సెక్రటేరియట్" ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వందలాది మంది విద్యార్థులు, నాయకులు సచివాలయం వైపు దూసుకువెళ్లడంతో సెక్రటేరియట్ పరిసర ప్రాంతాలు విద్యార్థి పోరాట నినాదాలతో దద్దరిల్లాయి... నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులను పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేయడాన్ని విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. సచివాలయం సమీపంలోకి చేరుకున్న విద్యార్థి నాయకులను పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, విద్యార్థి నాయకులకు మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు విద్యార్థులను ఈడ్చుకెళ్తూ, బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ వాహనాల్లోకి ఎక్కించారు. ఈ తోపులాటలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

# యుద్ధప్రాతిపదికన మోడల్ సోలార్ విలేజ్‌లు

### ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) పరిధిలో చేపట్టిన 37 గ్రామాల పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయనున్నట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఎంపిక చేసిన మోడల్ సోలార్ గ్రామాల్లో గృహాల పైకప్పులపై ఏర్పాటు చేస్తున్న రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల పనులను వేగంగా పూర్తి చేయాలని ఎస్ఈలకు సూచించారు.

ఇందుకు అవసరమైన నెట్ మీటర్లు తగినంతగా అందుబాటులో ఉన్నాయని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి నిర్ణీత గడువులో లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం వ్యవసాయ మోటార్లకు సోలార్ పంప్‌సెట్ల ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ సాంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) ఎండి ముషారఫ్ ఫరూఖి మాట్లాడుతూ మోడల్ సోలార్ విలేజ్ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు రెడ్‌కో, ఎన్పీడీసీఎల్, అమలు సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, గ్రిడ్ సింక్రనైజేషన్, నెట్ మీటరింగ్ తదితర సాంకేతిక ప్రక్రియలను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. సాంకేతిక ఇబ్బందులు తలెత్తిన వెంటనే పరస్పర సహకారంతో పరిష్కరించుకుని పనుల్లో మరింత వేగం తీసుకురావాలని సూచించారు.

# పాఠశాలల్లో అత్యవసర పరిస్థితులకు సన్నద్ధంగా ఉండాలి

### రాష్ట్ర అగ్నిమాపక, పౌర రక్షణ శాఖల డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్‌మాన్

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జులై 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో అత్యవసర పరిస్థితులకు సన్నద్ధంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు ప్రతిస్పందన, అత్యవసర పౌరరక్షణశాఖల డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్ మాన్ సూచించారు. విద్యార్థుల భద్రత, విపత్తు సన్నంద్ధత లక్ష్యంగా తమ శాఖ బేసిక్ ఎలిమెంట్స్‌తో కలిసి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మంగళవారం సాయంత్రం పాఠశాలల యాజమాన్యాల కోసం ఏర్పాటు చేసిన అగ్నిమాపక భద్రత అవగాహన కార్యక్రమాన్ని జ్యోతిప్రకాసనం చేసి ప్రారంభించి ప్రసంగించారు. అగ్నిమాపక భద్రత అనేది కేవలం ఒక చట్టబద్ధమైన నిబంధన మాత్రమే కాదని, అది మనందరి ఉమ్మడి బాధ్యతని స్పష్టం చేశారు. ప్రతి విద్యాసంస్థ అత్యవసర పరిస్థితులను అధిగమించడానికి, ప్రమాదం సంభవిస్తే సమర్ధవంతంగా స్పందించడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అవగాహన, సన్నద్ధత, క్రమం తప్పకుండా నిర్వహించే భద్రతా తనిఖీలు ఎన్నో పాఠశాలలో అత్యవసర పరిస్థితులకు సన్నద్ధంగా ఉండాలి ప్రాణాలను కాపాడతాయని అన్నారు. అనంతరం గౌరవ అతిథి తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ప్రతిబిడ్డకూ సురక్షితమైన, రక్షణతో కూడిన వాతావరణంలో చదువుకునే హక్కుందన్నారు. పాఠశాల యాజమాన్యాలు నిబంధనలు తు.చ తప్పకుండా అమలు చేయాలన్నారు. క్రమం తప్పకుండా తనిఖీలు, సిబ్బందికి, విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా అగ్నిమాపక భద్రతను ప్రాంగణ పరిపాలనతో భాగంగా మార్చాలని సూచించారు. కార్యక్రమంలో బేసిక్ ఎలిమెంట్స్ పాఠశాలల కోసం రూపొందించిన ఎఫ్ఐటీ స్మార్ట్ ఐఓటీ మానిటరింగ్ సొల్యూషన్లను ఆవిష్కరించారు. ఇది భారతదేశంలో మొదటిసారి స్వతంత్ర సంస్థల కోసం రూపొందించిన స్టాండ్ అలోన్ స్మార్ట్‌ఫైర్ డిటెక్టర్, పాఠశాలల కోచింగ్ సెంటర్లు, క్లినిక్‌లు, రిటైల్ అవుట్‌లెట్లు, కార్యాలయాలు, ఫార్మసీలు, రెస్టారెంట్లు తదితర చిన్న వాణిస్య సంస్థల్లో అగ్నిప్రమాదాలను సులభంగా గుర్తించవచ్చు. బీఈ ప్రాంప్ట్, ఇగ్నికాప్ వంటి దేశంలోనే మొదటిసారి రూపొందించిన వినూత్న ఉత్పత్తులను కూడా ప్రదర్శించారు.

అగ్నిప్రమాదం వంటి అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులు, బాధ్యులు, ఇతర నిర్దేశిత వ్యక్తులకు తక్షణ హెచ్చరికలు పంపే అత్యవసర సమాచార వ్యవస్థలుగా ఇవి అనిచేస్తాయన్నారు. తెలంగాణలో ఉన్న విద్యాసంస్థల నుండి 500 మందికిపైగా పాఠశాల యజమానులు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, సీనియర్ అడ్మినిస్ట్రేటర్లు హాజరయ్యారు.



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విక్రమ్‌సింగ్‌మాన్, నవీన్ నికోలస్, ప్రసాద్ నిష్టల తదితరులు

## 4, 5 తేదీల్లో బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశం

### ఏర్పాట్లపై సిఎస్ సంజయ్‌జాజు సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 14:** ఆగస్టు 4,5 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 2వ బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశం ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు మంగళవారం సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయంపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు భారత ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. 2వ బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశానికి బ్రిక్స్‌లోని 11 సభ్య దేశాల నుంచి సుమారు 40 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరుకానున్నారు. అదనంగా, భారత ప్రభుత్వానికి చెందిన సుమారు 40 మంది సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొని చర్చల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ పర్సనల్ అండ్ ట్రెయినింగ్ విభాగం (డిఓపిటి) సంయుక్త కార్యదర్శి సుశీల్ కుమార్ పటేల్ సమావేశ నిర్వహణకు సంబంధించిన అంశాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు.




## శ్రీచైతన్య నీట్ రెడి లాప్‌టాప్

### ఎసర్, ఇంటెల్, ఇన్ఫినిటీ లెర్న్ భాగస్వామ్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై14:** దేశంలోనే అతిపెద్ద వైద్య విద్యా ప్రవేశ పరీక్ష అయిన నీట్–2027వ సంవత్సరం నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సిబిటి) విధానంలోకి మారనుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులను డిజిటల్ పరంగా సిద్ధం చేసేందుకు గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజాలు ఏసర్,ఇంటెల్ సంస్థలతో కలిసి ప్రముఖ విద్యా సంస్థ శ్రీచైతన్య అనుబంధ 'ఇన్ఫినిటీ లెర్న్' చేతులు కలిపింది. దేశంలోనే మొట్టమొదటిసారిగా 'నీట్ రెడీ లాప్‌టాప్,సమగ్ర ఈకోసిస్టమ్‌ను ఈ సంస్థలు సంయుక్తంగా మంగళవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించాయి. కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు మారే తరుణంలో విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ వినూత్న లాప్‌టాప్‌ను రూపొందించారు. లాప్‌టాప్ ప్రత్యేకతలు:- ఇంటెల్ ప్రాసెసర్‌తో పనిచేసే ఏసర్ యాస్పైర్ సిరీస్ లాప్‌టాప్ విద్యార్థుల నిరంతర అభ్యాసానికి ఉపయోగపడుతుంది. నీట్ ప్రిపరేషన్‌కు కావాల్సిన పూర్తి స్టడీ మెటీరియల్ ఇందులో ముందే లోడ్ చేయబడి ఉంటుంది. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడానికి ఐనా అనేక ప్రత్యేక ఎఐ మెంటార్ సేవలు అందుబాటులో ఉంటాయి. అసలైన నీట్ పరీక్ష వాతావరణాన్ని తలపించేలా మాక్ టెస్ట్‌లు,లైవ్ అండ్ రికార్డెడ్ క్లాసులు,చాప్టర్ వైజ్ ప్రాక్టీస్ టెస్టులు,విద్యార్థుల ప్రతిభను విశ్లేషించే అనలిటిక్స్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి. శ్రీచైతన్య సీఈఓ బొప్పన సుష్మ మాట్లాడుతూ 2027 నుండి రాబోయే కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం ఒక పెద్ద మార్పు,విద్యార్థులకు కేవలం చదువే కాకుండా డిజిటల్ పరిజ్ఞానం కూడా అంతే ముఖ్యం, ఎసర్,ఇంటెల్ సంస్థలతో కలిసి మా విద్యా నైపుణ్యాన్ని జోడించి ఈ ఈకోసిస్టమ్‌ను తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సమగ్ర నీట్ ప్రిపరేషన్ లాప్‌టాప్ సొల్యూషన్ ప్రముఖ ఈ–కామర్స్ వేదిక ఫ్లిప్‌కార్ట్‌లో ప్రత్యేకంగా లభిస్తుంది. విద్యార్థుల సౌకర్యార్థం నెలకు కేవలం రూ.2,500 ప్రారంభ ఈఎంఐ ఆప్షన్లతో కొనుగోలు చేయడానికి వీలు కల్పించారు.

## లూలూ మాల్‌లో తుపాకీతో బెదరింపు కలకలం

### మాల్ యాజమాన్యంపై కేసు



**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), జులై 14, ప్రభాతవార్త :** కెపిహెచ్‌బి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లూలూ మాల్ పార్కింగ్ బేస్‌మెంట్‌లో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణ తుపాకీ బయటకు తీయడంతో ఉద్రిక్తతకు దారితీసింది. రెండు కుటుంబాల మధ్య వాగ్వాదం జరుగుతుండగా, వారిలో సిద్ధికీ అనే వ్యక్తి తన వద్ద ఉన్న తుపాకీని బయటకుతీసి ఎదుటి వ్యక్తిని బెదిరించినట్లు సమాచారం. దీంతో భయాందోళనకు గురైన బాధితుడు వెంటనే అక్కడి నుంచి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సిద్ధికీ వద్ద ఉన్న తుపాకిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో అతని వద్ద ఉన్న ఆయుధానికి చెల్లుబాటు అయ్యే లైసెన్స్ ఉన్నట్లు గుర్తించారు. అయితే తుపాకీతో మాల్‌లోకి ప్రవేశించినప్పటికీ భద్రతా సిబ్బంది సరైన తనిఖీలు నిర్వహించకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా భావించిన పోలీసులు, లూలూ మాల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడిన గంజాయి స్మగ్లర్

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** యేడాదిగా పరారీలో వున్న గంజాయి స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఇతని వద్ద నుంచి 115 గ్రాముల గంజాయిని జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ మ ంగళవారం మీడియాకు వెల్లడించారు. రాజ్‌భవన్ ప్రాంతంలోని ఎంఎస్ మక్తాకు చెందిన మహమ్మద్ షేక్ జావెద్ (33) వృత్తిరీత్యా పెయింటర్. అయితే ఇందులో పెద్దగా ఆదాయం లేకపోవడంతో గంజాయి స్మగ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో ఇతను తన నివాసాన్ని పోలీసులు గుర్తించకు ండా వుండేందుకు సంగారెడ్డి జి ల్లాలోని చెర్యాల్ టోల్ గేట్ వద్ద వున్న పెరోంకి మసీదుకు మార్చాడు. ఇతనిపై సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో గంజాయి స్మగ్లింగ్ కేసుతో పాటు రౌడీషీట్ కూడా వుంది. 2025 మే నెలలో నమోదైన కేసులో ఇతను నిందితుడుగా వుండగా అప్పటి నుంచి ఇతను పరారీలో వుంటూ తనను గుర్తించకుండా వుండేందుకు నీలం రంగు టవల్ ధరించి దానిని తలకు కప్పుకుంటున్నాడు. ఇతనిపై వారంట్ కూడా వుంది. కాగా సంగారెడ్డి జిల్లాలోని తన మకాం నుంచి నగరంలోని ఫుల్‌బాగ్‌కు జావెద్ వచ్చిన ట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి ఇతన్ని అరెస్టు చేశారు. ఈ సమయంలో ఇతని వద్ద 115 గ్రాముల గంజాయితో పాటు నీలంరంగు టవల్‌ను జప్తు చేశారు. నిందితుడిని సైఫాబాద్ పోలీసులకు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించారు.

## రేపటి నుంచి చేతివృత్తుల వస్తుప్రదర్శన, అమ్మకాలు

### హెచ్‌ఎండిఎ గ్రౌండ్స్‌లో 60 స్టాళ్ల ఏర్పాటు

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** ఆషాఢమాస బోనాల మహోత్సవాల సందర్భంగా ఈ నెల 16 నుంచి హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ (పెద్ద అంబేద్కర్ విగ్రహం పక్కన)లో రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఎఫ్.ఎ.సి), కమిషనర్ బాల మాయాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన అన్ని రకాల చేతివృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటనలో పేర్కొన్నారు.ఈ నెల 16న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ సలహాదారు వి హనుమంతరావు, అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభిస్తారని తెలిపారు.

# ఇంటర్ పరీక్షల్లో బట్టీ విధానానికి స్వస్తి!

**80 శాతం మార్కులకు థియరీ పరీక్ష**

**20 శాతం మార్కులు ఇంటర్నల్స్‌కు**

**మొదటి సంవత్సరం ప్రశ్నపత్రంలో మార్పులు**

**ఈ యేడాది నుంచే అమలు**

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఇకపై పరీక్షలకు బట్టీపట్టే అవసరం లేకుండా ఇంటర్ బోర్డు ప్రశ్నా పత్రాన్ని రూపొందించింది. సుదీర్ఘమైన సమాధానాలను కంఠస్థం చేయాల్సిన ఒత్తిడిని తగ్గించి, భావనాత్మక అవగాహనను ప్రోత్సహించే విధంగా ఇంటర్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్ష ప్రశ్నపత్ర నమూనాను సవరించింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ మినహా మిగిలిన అన్ని సబ్జెక్టులకు థియరీ పరీక్ష ప్రశ్నపత్రం నమూనాను ఇంటర్ బోర్డు సవరించింది. నూతన పరీక్ష విధానం 2026–27 విద్యా సంవత్సరం నుండి అమలు చేయనున్నారు. ప్రధానంగా గణితంతోపాటు సీఈసీ, హ్యూమానిటీస్ విభాగాలు లాంగ్వేజెస్‌లకు అంతర్గత మార్కులను ప్రవేశ పెట్టింది. గణితంకు 15 మార్కులకు, సీఈసీ, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్‌కి 20 మార్కులకు అంతర్గత మూల్యాంకనాన్ని ప్రవేశపెడుతూ బోర్డు ప్రశ్నపత్రాలను పునర్నిర్మించింది. ఇప్పటి వరకు కొనసాగిన విధానంలో గణితం 1ఏ, 1బిలకు 75 మార్కుల చొప్పున నిర్వహించేవారు ఇకపై ఒక్కొక్కటి 60 మార్కులకు నిర్వహించబడతాయి. దాంతోపాటు స్వల్ప, దీర్ఘ సమాధానాల విభాగాలలో ప్రధాన మార్పులు చేయబడ్డాయి. సెక్షన్–ఏలో రెండు మార్కుల చొప్పున 10 తప్పనిసరి అతి స్వల్ప సమాధాన ప్రశ్నలను యథాతథంగా ఉంచుతూనే, సెక్షన్–బిలో సమాధానం ఇవ్వాల్సిన నాలుగు మార్కుల స్వల్ప సమాధాన ప్రశ్నల సంఖ్యను 5 నుండి 6కి పెంచింది. సెక్షన్–సిలో గతంలో ఏడు ప్రశ్నల్లో ఐదింటికి సమాధానం రాయాల్సి ఉండగా.. ఇప్పుడు మూడు ప్రశ్నలలో రెండింటికి మాత్రమే సమాధానం రాస్తే సరిపోతుంది. ఈ విభాగంలో ఒక్కో ప్రశ్నకు కేటాయించిన మార్కులను ఏడు నుండి ఎనిమిదికి పెంచారు. మొత్తంగా చూస్తే, గణితం 1ఏ, 1బిలో గతంలో 24 ప్రశ్నలలో 20కి సమాధానం రాయాల్సి ఉండగా, ఇప్పుడు 21 ప్రశ్నలలో 18కి సమాధానం రాస్తే సరిపోతుంది. సీఈసీ కోర్సును ఎంచుకున్న విద్యార్థులపై భారం తగ్గిస్తూ పరీక్షా విధానం రూపొందించింది. ప్రతి సబ్జెక్టు పరీక్షకి గతంలో 100 మార్కులకు ఉండేది, ఇకపై 80 మార్కులకు నిర్వహించబడుతుంది. దీనికి అనుగుణంగా కామర్స్ సబ్జెక్టులోని పార్ట్1, పార్ట్2 (అకౌంటెన్సీ) వెయిటేజీ ఒక్కొక్కటి 50 నుండి 40 మార్కులకు తగ్గించిది. సెక్షన్–ఏలో గతంలో 10 ప్రశ్నలకు సమాధానం రాయాల్సి ఉండగా, ఇప్పుడు 6 మార్కుల చొప్పున ఉండే మూడు ప్రశ్నలలో రెండింటికి సమాధానం రాస్తే సరిపోతుంది. సెక్షన్–బిలో ఆరు ప్రశ్నలలో నాలుగింటికి సమాధానం రాసే విధానాన్ని బోర్డు మార్చకపోయి నప్పటికీ ఒక్కో ప్రశ్నకు కేటాయించిన మార్కులను 5 నుంచి 4కి తగ్గించింది. సెక్షన్–సిలో గతంలో ఎనిమిది ప్రశ్నలలో ఐదింటికి సమాధానం రాయాల్సి ఉండగా దానిని కాస్త మార్చి ఇప్పుడు రెండు మార్కుల చొప్పున ఉండే తొమ్మిది ప్రశ్నలలో ఆరింటికి సమాధానం రాసేలా మార్పులు చేసింది. పార్ట్–2 (అకౌంటెన్సీ) విషయానికి వస్తే, సెక్షన్–డిలోని ప్రశ్నల సంఖ్యలో మార్పు చేయలేదు. కానీ ప్రశ్నకు కేటాయించిన మార్కులను 20 నుండి 12కి తగ్గించారు. సెక్షన్–ఈలో ఇప్పటి వరకు 10 మార్కుల చొప్పున ఉండే రెండు ప్రశ్నలలో ఒకదానికి సమాధానం రాయాల్సి ఉండేది. కానీ ఇప్పుడు ఆ విధానాన్ని మార్చి 6 మార్కుల చొప్పున ఉండే 5 ప్రశ్నలలో మూడింటికి సమాధానం రాసే వెసులుబాటును విద్యార్థులకు కల్పిస్తూ ఇంటర్ బోర్డు ప్రశ్నాపత్రం రూపొందించింది. గతంలో 5 మార్కుల చొప్పున రెండు ప్రశ్నలు ఉండే సెక్షన్–ఎఫ్‌ను తొలగించారు. అలాగే 2 మార్కుల చొప్పున ఉండే ఐదు ప్రశ్నలను మాత్రం అలాగే కొనసాగించింది. ఎకనామిక్స్, సివిక్స్ ప్రశ్నపత్రాలలో కూడా మార్పులు చేసింది. రెండు సబ్జెక్టులలోనూ సెక్షన్–ఏలోని దీర్ఘ సమాధాన ప్రశ్నలకు 10 మార్కులకు బదులుగా 8 మార్కులు కేటాయించింది. సెక్షన్–బిలో 8 ప్రశ్నలకు 5 మార్కులకు బదులుగా, 4 మార్కులను కేటాయించింది. రెండు సబ్జెక్టులలో ప్రశ్నల సంఖ్యను 20 నుండి 16కి తగ్గిస్తూ ప్రశ్నాపత్రం రూపొందించింది. సెక్షన్–సిలో 15 ప్రశ్నలకు బదులుగా 12 ప్రశ్నలకు సమాధానం రాయాల్సి ఉంటుంది. చరిత్ర సబ్జెక్టుకు కూడా ఇదే విధానం వర్తిస్తుందని ఇంటర్ బోర్డు ప్రకటించింది.

## వెంటనే ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

### మీ అమూల్యమైన ఓటు హక్కును కాపాడుకోవాలి

### ఓటర్లకు సిఇఒ సి.సుదర్శన్‌రెడ్డి పిలుపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 14:** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా అందజేసిన ఎన్యూరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బిఎల్ఒలకు అందజేసి మీ ఆమూల్యమైన ఓటుహక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బిఎల్ఒలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను అతికించి బిఎల్ఒలకు అందించాలని సిఇఒ కోరారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పనిసరిగా ఓటర్ సంతకం, తేదీతోపాటు బిఎల్ఒల సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిఎల్ఒలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బిఎల్ఒలకు ఇవ్వాలని, మరొకటి ఓటర్ భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఒలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయిన ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బిఎల్ఒలకు అందజేయాలన్నారు. రాష్ట్రంలోని మొత్తం3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది (49.28) ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సమర్పిం చారు. సర్ ప్రక్రియ జూన్ 25న ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ఈ ప్రక్రియ ముగుస్తుందని, ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బిఎల్ఒలకు అందజేయాలని సూచించారు.

## డిజిటల్ వ్యవసాయ ఆవిష్కరణలకు తెలంగాణ నమూనా

### వ్యవసాయంలో రాష్ట్రం భేష్

### పంట డేటా వ్యవస్థల బలోపేతం

### సాంకేతికత వినియోగంలో అగ్రగామి

### కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ నివేదిక

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** డిజిటల్ వ్యవసాయంపై కేంద్రం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని సాంకేతిక రంగంలో రాష్ట్రం ముందుకు దూసుకుపోతోంది. కేంద్రం యొక్క డిజిటల్ వ్యవసాయం తెలంగాణ యొక్క సాంకేతికత ఆధారిత వ్యవసాయ సేవలను, పంట డేటా వ్యవస్థలను బలోపేతం చేస్తోందని భావిస్తోంది. డిజిటల్ వ్యవసాయ రంగంలో తెలంగాణ అగ్రగామిగా ఉండటంతో రైతుల నమోదు, పంటల డేటా సేకరణ, సాంకేతికత ఆధారిత వ్యవసాయ సేవల పంపిణీని వేగవంతంగా జరుగుతోంది కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ 2025–26 వార్షిక నివేదిక లో పేర్కొంది. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ఈ నివేదికలో డిజిటల్ వ్యవసాయ మిషన్ ద్వారా ఎనిమిది కోట్లకు పైగా రైతు ఐడీలు ఇప్పటి వరకూ సృష్టించబడ్డాయని, పంట సర్వేలు విస్తరించాయని, పంట బీమా కింద ఆన్‌లైన్ క్లెయిమ్ పరిష్కారాన్ని సులభతరం చేసిందని పేర్కొంది. తెలంగాణలో డిజిటల్ పంటల సర్వే, వ్యవసాయ డేటా మార్పిడి, అంతకుముందు చేపట్టిన ఏఐ ఆధారిత వ్యవసాయ కార్యక్రమాల ద్వారా డిజిటల్ మార్పు రాష్ట్రంలో స్పష్టంగా కనిపిస్తోందని వెల్లడించింది. సబ్సిడీ లక్ష్య నిర్దేశం, బీమా పరిష్కారం, పథకాల అమలును మెరుగుపరిచే లక్ష్యంతో, సాగు భూమికి సంబంధించిన విశ్వసనీయమైన డేటాబేస్‌ను రూపొందించడానికి అధికారులు గ్రామాల్లో పంటల సర్వేలను వేగవంతం చేస్తున్నారు. కేంద్రం డిజిటల్ ఫ్రేమ్ వర్క్, తెలంగాణ వ్యవసాయసాంకేతిక దిశకు తోడ్పాటునిస్తుంది. కేంద్రం చేపట్టిన ఈ చొరవ తెలంగాణ వంటి రాష్ట్రాలకు వ్యవసాయ డేటాకు, వ్యవసాయ సహాయానికి మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడంలో సహాయపడగలదని అంచనా వేసింది. రైతు ఐడీలు, పంట సర్వేలు, భీమా వ్యవస్థలను పూర్తిగా అనుసంధానిస్తే, పునరావృత్తిని తగ్గించవచ్చు, పారదర్శకతను మెరుగు పరచడం, చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనాలను వేగంగా అందించవచ్చని తెలిపింది. వ్యవసాయం డిజిటల్ పర్యవేక్షణ, స్వయంచాలక సలహాలతో అంతకంతకూ ముడిపడి ఉన్న తెలంగాణలో, ఈ కొత్త కేంద్ర ప్రోత్సాహం పరిపాలన, ప్రణాళిక, నష్టపరిహార పంపిణీని మరింత బలోపేతం చేస్తుందని కేంద్ర వ్యవసాయ శాఖ తన నివేదికలో స్పష్టం చేసింది.

## యువతుల వివాహ వయసు 21కి పెంపు!

**న్యూఢిల్లీ, జులై 14:** మారుతున్న సామాజిక పరిస్థితులు, మహిళల విద్య, ఉపాధి అవకాశాలను పరిగణలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతోంది. దేశంలోని అమ్మాయిల కనీస వివాహ వయసును 18 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు పెంచే దిశగా ఆలోచన చేస్తున్నది. తాజా సర్వేల గణాంకాలు, రాబోయే జనగణన లెక్కల ఆధారంగా కేంద్రం మార్పులు చేసేందుకు కసరత్తు చేస్తోంది. అయితే, శాంపిల్ రిజిస్ట్రేషన్ సర్వే, నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే వెల్లడించిన తాజా నివేదికల ప్రకారం.. దేశంలో అమ్మాయిల సగటు పెళ్లి వయసు గడిచిన కొన్నేళ్లలో గణనీయంగా పెరిగింది. గతంలో ఉన్న సగటు వివాహ వయసు 19.3 ఏళ్ల నుంచి ప్రస్తుతం 23.1 ఏళ్లకు పెరిగినట్లుగా సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఇక పట్టణ ప్రాంతాల్లో అమ్మాయిల సగటు వివాహ వయసు 24.4 ఏళ్లుగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది 22.6 ఏళ్లుగా నమోదైంది. అమ్మాయిల వివాహ వయసు చట్టబద్ధంగా 18 ఏళ్ల అయినా మారుతున్న కాలంతో పాటు అమ్మాయిలు ఉన్నత చదువులు, ఉద్యోగాలు చేసేందుకు ఆసక్తి చూపుతూ పెళ్లి ఆలస్యంగా చేసుకుంటున్నట్లుగా నివేదికల్లో తేలిందని సామాజిక నిపుణులు చెబుతున్నారు. ఇక అమ్మాయిల పెళ్లి వయసును పురుషులతో సమానంగా 21 ఏళ్లకు పెంచేందుకు 2021లో మోడీ సర్కార్ గతంలోనే ఓ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ఆ బిల్లు పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉండగానే 17వ లోక్‌సభ రద్దు కావడంతో అది అక్కడితో ఎండ్ అయింది. ఈ నేపథ్యంలో రాబోయే 2027 జనగణన ప్రక్రియ పూర్తయిన తర్వాత లభించే అధికారిక జనాభా గణాంకాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తిరిగి ప్రవేశపెట్టి చట్టరూపం తీసుకురావాలని యోచిస్తోంది.

## హత్యకేసు నిందితుడు కుటుంబంతో ఆత్మహత్య

### సింగరాయకొండ స్టేషన్‌లో విషాద ఘటన

### భార్య, ఇద్దరు చిన్నారులతో కలిసి హరికృష్ణ బలవన్మరణం

### బావ శ్రీహరి హత్యకేసులో హరికృష్ణ ప్రధాన నిందితుడు



హరికృష్ణ ప్రణీత మూగాంబిక కౌనిక్ కృష్ణ

**సింగరాయకొండ / బుచ్చి (నెల్లూరు) జులై 14, ప్రభాత వార్త :** సింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో హృదయ విదారక ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలు, ఇద్దరు చిన్నారులు గూడ్స్ రైలు కిందపడి మృతి చెందారు. మృతులు నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం ఆర్.ఎన్. కండ్రిగ గ్రామానికి చెందిన కుడుముల హరికృష్ణ (32), అతని భార్య ప్రణిత (30), కుమారుడు కౌనిక్ కృష్ణ (3), కుమార్తె మూగాంబిక (5)గా గుర్తించారు.పోలీసుల వివరాల ప్రకారం నెల్లూరు జిల్లా తోట పల్లి గూడూరు మండలం ఆర్.ఎన్ కండ్రిగ గ్రామానికి చెందిన కుడుముల హరికృష్ణ కుటుంబ సభ్యులు భార్య ప్రణిత, ఇద్దరుపిల్లలతో కలిసి మంగళవారం మధ్యాహ్నం సింగరాయకొండ రైల్వేస్టేషన్ తూర్పువైపు రెండో ప్లాట్‌ఫారంపై కొంతసేపు ఉన్నారు. అనం తరం ఒంగోలు వైపు నుంచి వస్తున్న గూడ్స్ రైలు సమీపిస్తుండగా భార్యాభర్తలు ఇద్దరు చిన్నారులను ఎత్తుకుని పట్టాలపైకి వెళ్లడంతో నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సమాచారం అందుకున్న నెల్లూరు డీఎస్పీ మురళీధర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డియస్పీ తెలిపిన వివరాలు మేరకు గత నెలలో బుచ్చిరెడ్డిపాలెం వ్యవసాయ శాఖ అధికారి శ్రీహరి హత్య కేసులో కుడుముల హరికృష్ణ ప్రధాన నిందితుడుగా నిర్ధారణ కావడం, ఈ నెల 9న కేసు నమోదైన తర్వాత విచారణలో అతని పాత్ర నిర్ధారణ కావడంతో అప్పటి నుంచి పరారీలో ఉన్నట్లు తెలిపారు. అదే కేసులో ఏ2 నిందితుడు సోంపల్లి రవీంద్ర ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నట్లు చెప్పారు.ఏ3 నిందితుడును అరెస్ట్ చేయడం జరిగిందని, హత్యకు గురైన శ్రీహరి హరికృష్ణకు సొంత బావమరిది అని పోలీసులు తెలిపారు. కేసు నేపథ్యంలో ఏర్పడిన కుటుంబ పరిస్థితులు, తీవ్ర మనస్తాపం కారణంగానే ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని ప్రాథమిక విచారణలో భావిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.ఎఫ్ఎస్ఎల్ బృందం ఆధారాలు సేకరించిందని, పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ కు తరలించడం జరిగిందన్నారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు.ఈ విషాద ఘటనతో ఆర్.ఎన్. కండ్రిగ గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు గ్రామానికి చెందిన వ్యవసాయాధికారి శ్రీహరి హత్యకేసులో ఎ–1 ముద్దాయి కుడుముల హరికృష్ణ,కుటుంబంతో సహా ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వేస్టేషనలో గూడ్సు రైలు కింద పడి దుర్మరణం చెందారు. హరికృష్ణ బావ వ్యవసాయాధికారి శ్రీహరిని పథకం ప్రకారం పెంచలకోనకు తీసుకొని వెళ్లి మార్గ మధ్యంలో ఇద్దరుతో కలిసి హత్య చేసి దానిని గుండె పోటుతో మృతి చెందినట్లుగా చిత్రీకరించారు.అయితే వ్యవసాయాధికారి శ్రీహరి మొదటి బార్య జిల్లా ఎస్‌పి అజితా వెజండ్లకు ఫిర్యాదు చేయడంతో అసలు కథ బయటకు వచ్చింది. శ్రీహరిది గుండెపోటు మరణం కాదని ముమ్మాటికి హత్యేనని తేలింది. ఈహత్య చేయించింది. రెండో భార్య సోదరుడు కుడుముల హరికృష్ణ మరో ఇద్దరితో కలిసి చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇద్దర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఎ–1 ముద్దాయి హరికృష్ణ కోసం వేట ప్రారంభించారు. దీంతో హరికృష్ణ రెండు రోజుల క్రితం సోషల్ మీడియాలో తనకు ఏమి తెలియదంటు వీడియో విడుదల చేశాడు. నేను చనిపోతాను అని కూడా ఆవీడియోలో స్పష్టం చేశాడు. చెప్పిన విధంగానే హరికృష్ణ సింగరాయ కొండ రైల్వేస్టేషన్‌లో కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకొని మంగళవారం మృతి చెందారు. ఏపాపం తెలియని భార్యా బిడ్డల్ని కూడా బలి చేశాడని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా అంతర్జాతీయ వ్యవస్థ నిర్మాణం

### బ్రిక్స్ ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జులై 14, ప్రభాతవార్త :** సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా విస్తరిస్తున్నప్పటికీ, భవిష్యత్తులో ఉపాధి రంగాలు కార్మికుల సంక్షేమం, సామాజిక న్యాయం మరియు మానవ విలువలకు లోబడి పనిచేసేలా అంతర్జాతీయ వ్యవస్థను నిర్మించుకోవాలని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రారంభమైన 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సదస్సు 2026కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, సదస్సును ఘనంగా ప్రారంభించారు. కేంద్రమంత్రి మాట్లాడుతూ, బ్రిక్స్ కూటమి దేశాల్లో సమ్మిళిత అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా భారత్ అధ్యక్షతన ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కార్మికుల శ్రమ ఎనలేనిదని, వారి హక్కులను కాపాడటంలో ట్రేడ్ యూనియన్ల పాత్ర కీలకమని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాల (లేబర్ కోడ్స్) ద్వారా 29 పాత చట్టాలను సరళీకరించి ఒకే గొడుగు కిందికి తెచ్చామని మంత్రి వివరించారు. దీనివల్ల కనీస వేతనాలు, ఆరోగ్య రక్షణ, నియామక పత్రాల అందజేతతో పాటు గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సైతం తొలిసారిగా చట్టబద్ధ గుర్తింపు లభించిందని తెలిపారు. ఇశ్రమ్ పోర్టల్ ద్వారా దేశవ్యాప్తంగా 31.7 కోట్ల మందికి పైగా అసంఘటిత రంగ కార్మికులు నమోదు చేసుకుని ప్రభుత్వ లబ్ధిని పొందుతున్నారని చెప్పారు. దేశంలో సామాజిక భద్రతా పథకాల పరిధిని కేంద్ర ప్రభుత్వం భారీగా విస్తరించిందని డాక్టర్ మాండవీయ వెల్లడించారు. 2015లో కేవలం 19 శాతంగా ఉన్న సామాజిక భద్రతా కవరేజీ, 2025 నాటికి 64.3 శాతానికి (94 కోట్ల మందికి) చేరిందని, తాజాగా 2026 ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ సంఖ్య వంద కోట్ల (ఒక బిలియన్) మార్కును దాటిందని ఆయన ప్రకటించారు.

## ఏరియా ఆస్పత్రుల్లో సిటి స్కాన్ సేవలు అందుబాటులోకి

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోద రాజనర్సింహా

**హైదరాబాద్, జులై 14, ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం సహా రాష్ట్రంలోని అన్ని ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను మంజూరు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లలను అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.

## శ్రీవారి హారతుల నిబంధనలపై కర్ణాటక సిఎం డికె జోక్యం మంచిదికాదు

### ఆయనకు అవగాహన కల్పించేలా చూస్తాం: టిటిడి బోర్డు సమావేశం నిర్ణయం

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి వేకువజామున తోమాల, అర్చన సేవల తరువాత పారంపర్యంగా నిర్వహించే హారతుల నిబంధనలపై కర్ణాటక సిఎం డికె శివకుమార్ చేసిన సంచలన వ్యాఖ్యలపై టిటిడి బోర్డు కూలంకుషంగా చర్చించింది. మంగళవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డుసభ్యులు ఈ అంశంపై తీవ్రస్థాయిలో చర్చించారు..అందరూ ఒకే అంశంపై ముక్తకంఠంతో తీర్మానం చేశారు. తిరుమల ఆలయంలో దేవదేవునికి ఇచ్చే నిత్య హారతుల్లో పూర్వం మైసూరు మహారాజు శ్రీవారికి చేసిన సేవలు, అందించిన కానుకలకు గుర్తింపుగా ఆ మైసూరు మహారాజు కుటుంబానికి, పలు మఠాలు, మైసూరు సంస్థానం తరపున హారతులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం తొలి గంట నైవేద్య సమయంలో స్వామివారికి 21నిత్యహారతులు ఇస్తారు. 20 మఠాలతో బాటు మైసూరు సంస్థానం తరపున ప్రతినిధులు హారతిపళ్లెం, నైవేద్యాలుతో ఆలయంలోనికి వెళ్తారు. ఆలయంలోపల టిటిడి అర్చకులు హారతి పళ్లెంను శ్రీవారికి సమర్పించి తిరిగి దాన్ని వారికే అందజేస్తారు.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Rayapudi, Amaravati-522237, Andhra Pradesh.
NIT No. 21/MAU61-ADMN0STG(OTH)/12/2026, Dt: 14/07/2026
**E-PROCUREMENT TENDER NOTICE**
Name of Work: APCRDA - "Request for Proposal (RFP) for Selection of Consultant to Provide Comprehensive Multi-layered Third-Party Quality Assurance & Quality Control Services for infrastructure and construction works of development in Amaravati Capital City, Andhra Pradesh, India". The bid can be downloaded on AP e-procurement portal from 15.07.2026 to 05.08.2026 up to 14.00 Hrs., Due date for submission of Bid is 05.08.2026 up to 15.00 Hrs., Technical bid opening 05.08.2026 @16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Amaravati

తెలంగాణ ప్రభుత్వం
**పురపాలక సంఘం చొప్పదండి, జిల్లా కరీంనగర్**
బహిరంగ వేలము ప్రకటన - 3వ పిలుపు తేది: 14.07.2026
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ తెలిపిన ప్రదేశములలో గల టేకు చెట్లను తేదీ: 20-07-2026 సోమవారము రోజున ఉ.11.00 గంటలకు చొప్పదండి పురపాలక సంఘ కార్యాలయములో బహిరంగ వేలం నిర్వహించబడును. 1) 13వ వార్డు పరిధిలోని ప్రతిభ విద్యానికేతన్ స్కూల్ ముందు గల రక్షిత మంచినీటి సరఫరా OHSR ట్యాంక్ చుట్టు గల (49) టేకు చెట్లను వేలం వేయుట. 2) 8వ వార్డు పరిధిలోని కుడి చెరువు దగ్గర గల రక్షిత మంచినీటి సరఫరా బావి చుట్టు గల (32) టేకు చెట్లను వేలం వేయుట. కావున ఆసక్తి గల వారు కమిషనర్, చొప్పదండి మున్సిపాలిటీ గారి పేరున ఏదేని జాతీయ బ్యాంక్ యందు రూ.10,000/-లు D.D. చెల్లించి తమ యొక్క దరఖాస్తుతో పాటు చెల్లించిన D.D. లను జతపరచి తేది: 18-07-2026 శనివారము సా.5.00 ల లోపు కార్యాలయములు ఆఫీసు పని వేళలలో వేలము నిబంధనలు తెలుసుకొని దరఖాస్తులు అందజేసి వేలము యందు పాల్గొనగలరు. (వేలములో పాల్గొను వారు మున్సిపల్ కార్యాలయమునకు ఎలాంటి బకాయిలు ఉండరాదు, వేలము హక్కులు పొందిన వారు వేలము పాట మొత్తము చెల్లించిన తరువాతనే టేకు చెట్లను కోయుటకు అనుమతి ఇవ్వబడును.) పూర్తి వివరములకై ఆఫీసు పని వేళలలో కార్యాలయము నందు సంప్రదించగలరు.
సం/- కమిషనర్, పురపాలక సంఘం, చొప్పదండి
DIPR.No.6040-PP/CL/Advt/1/2026-27, తేది: 14.07.2026

## తిరుమల సమాచారం



### శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి ఆలయంలో శుక్రవారం సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వెలుపల టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరితో కలిసి ఈ మహాయజ్ఞంలో పాల్గొన్నారు. సంవత్సరంలో నాలుగుసార్లు ఉగాది, ఆణి వార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుండి ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి పూజలు నిర్వహించారు. భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో అష్టదళపాదపద్మారాధనసేవ రద్ద య్యింది. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, జెఇఒ డాక్టర్ ఏ.శరత్, సివిఎస్ఒ మురళీకృష్ణ, డిప్యూటీ ఇఒ లోకనాథం, బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



### టిటిడి ట్రస్ట్‌లకు రూ.50 లక్షలు విరాళం

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరుకు చెందిన బృందా న్యూరో సెంటర్ మంగళవారం ఉదయం టిటిడి పథకాలకు భారీ విరాళాలందించింది. వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు 10,00,116 లక్షలు, వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు 10,00,116, బర్డ్ ట్రస్టుకు 10,00,116 విరాళంగా అందించింది. ఆ సంస్థ అధినేతలు డాక్టర్ హనుమ శ్రీనివాస రెడ్డి, సిద్ధార్థలు శ్రీవారి ఆలయంలోని రంగ నాయకుల మం డపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు విరాళం డిడిలను అందజేశారు. అలాగే బెంగుళూరుకు చెందిన శ్రీపతి శ్రీనివాస్, కొటారు సునీల్ లు వేంకటే శ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 10,00,116 లక్షలు విరాళంగా అందించగా, విశాఖపట్నంకుచెందిన చాగర్లమూడి సీతారామయ్య బర్డ్ ట్రస్టుకు 10,00,116 లక్షలు రూపాయలు విరాళంగా అందించారు. దాతల తరఫున టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోని రంగనాయ కుల మండపంలో ఇఒ ముద్దాడ రవిచంద్రకు విరాళం డిడిలను అందజేశారు.



### రూ.60.61 లక్షలు విరాళాలు అందజేత

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** పలువురు దాతలు మంగళవారం రాత్రి టిటిడి ట్రస్ట్‌లకు భారీ విరాళాలిచ్చారు. ఎస్వీఅన్న ప్రసాదం ట్రస్ట్‌కు 60.61 లక్షలు విరాళంగా అందింది.విశాఖపట్నంకు చెందిన ఎస్ఎస్ఎన్ఆర్ ప్రోజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 10.50లక్షలు, విశ్వ సి.వి.చెరుకూరి భక్తుడు 10 లక్షలు, వంత ఇన్ ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 10 లక్షలు, వెర్టెక్స్ కౌం టీ ఎల్ఎల్పీ సంస్థ 10 లక్షలు, హైదరాబాద్ కు చెందిన సాయిలీల ఎలక్ట్రికల్ ప్రోజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 10 లక్షలు, అమరావతిలోని తుళ్లూరుకు చెందిన జొన్నలగడ్డ కిరణ్ కుమార్ 10,11,116 లక్షలు రూపాయలుయ విరాళంగా అందించారు. దాతల తరఫున టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు తిరుమలలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం డిడిలను అందజేశారు.ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి ్ర, జాస్తి పూర్ణ సాంబశివరావు, శాప్ చైర్మన్ రవి నాయుడు పాల్గొన్నారు.

## నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరానే లక్ష్యం

### రూఫ్ టాప్ సోలార్ పనులు వేగవంతం-విడియో కాన్ఫరెన్స్‌లో సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి కోరారు. తిరుపతిలోని ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుండి మంగళవారం శివశంకర్ లోతేటి సంస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, సత్వర సేవలతో అంతరాయం లేని విద్యుత్తును సరఫరా చేస్తూ వినియోగదారుల మన్నన పొందాలని సూచించారు. సంస్థ పరిధిలో ఎక్కడైనా ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతుకు గురైతే నిర్ణీత గడువులోగా ట్రాన్స్ ఫార్మర్ను అమర్చాలని ఆదేశించారు. ఈ అంశంలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులను సీనియారిటీ ప్రాతిపదికన మంజూరు చేయా లని, ఈ అంశంలో నిబంధనల్ని అతిక్రమిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద ఎస్సి, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు రూఫ్ సోలార్ ఏర్పాటు పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్లు తగిన స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేసుకుని, నిర్ణీత గడువులోగా పనుల్ని పూర్తి చేయాలని కోరారు. ఈ పనులను సంబంధిత సర్కిల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సంస్థ పరిధిలోని వివిధ సర్కిళ్లలో చేపడుతున్న విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్ఎస్ఎస్) పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లతో సమీక్షిస్తూ పనుల్ని సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్(ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్(టెక్నికల్ హెచ్ఆర్డి) కె.గుర వయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్ఎసి) కె. రామమోహన రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్. పద్మ, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్.రమణ, ఎం. మురళీ కుమార్, జనరల్ మేనేజర్లు జగదీష్, చక్రపాణి, లత, శ్రీకాంత్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు శేషాద్రి శేఖర్, ప్రదీప్ కుమార్, సుధాకర్, రాఘవేంద్రం, చంద్రశేఖర్ రావు, సోమశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, మోజెస్, అమర్ బాబు, 9 సర్కిళ్ళ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, అకౌంట్స్ ఆఫీసర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# 'రా ఎన్టీఆర్'కు ఎలాంటి అధికారాలు లేవు

### ఆ పేరుతో కార్యకలాపాలు నిర్వహించకూడదు: జూ.ఎన్టీఆర్ కార్యాలయం

**విజయవాడ,జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** టాలీవుడ్ స్టార్ ఎన్టీఆర్ పేరుతో ప్రకటనలు చేస్తూ, కార్యక్రమాలు నిర్వహిస్తున్న రా ఎన్టీఆర్ (ఆర్ఎడబ్ల్యూ ఎన్‌టీఆర్) సంస్థకు ఎలాంటి అధికారం లేదని నటుడు నందమూరి తారక రామారావు కార్యాలయం స్పష్టం చేసింది. ఆయనకు సంబంధించిన సేవా, ప్రజా సంక్షేమ కార్యక్రమాల వివరాలు కేవలం వ్యక్తిగత లేదా ఆయన అధికారిక బృం దం ద్వారా మాత్రమే వెల్లడి అవుతాయని ఈ సందర్భంగా ప్రకటన చేసింది. ఆర్ఎడబ్ల్యూ ఎన్‌టీఆర్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఒక సంస్థ ఎన్టీఆర్‌తో సంబంధం ఉన్నట్లు ప్రజల్లో భావన కలిగించే విధంగా వ్యవహరిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఈ సందర్భంగా మేము ఒక విజ్ఞప్తి చేస్తున్నాం. ఎన్టీఆర్‌కి గాని, ఆయన కార్యాలయానికి 'రా ఎన్టీఆర్' అనే సంస్థతో లేదా వాటి కార్యకలాపాలతో ఏ విధమైన సంబంధం, అనుమతి, ప్రమేయం లేదు. సంబంధిత సంస్థకు ఎన్టీఆర్ తరపున ప్రాతినిధ్యం వహించే అధికారం లేదు. ఎన్టీఆర్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు చేయడానికి వీల్లేదు. ఎన్టీఆర్‌కు సంబంధించిన ఏదైనా సేవా కార్యక్రమం, అధికారిక ప్రకటన లేదా ఇతర కార్యకలాపాల గురించి సమాచారం ఎన్టీఆర్ లేదా ఆయన అధికారిక బృందం ద్వారానే వెల్లడిస్తారు.ఎన్టీఆర్ జులై 18న రాజకీయాల్లోకి రానున్నారంటూ వస్తున్న వార్తలపై ఎన్టీఆర్ అభిమానుల సంఘం సోమవారం ఓలేఖను రిలీజ్ చేసి ఆ వ్యాఖ్యలన్నీ అవాస్తవమని ఖండించింది. ఆ రోజు నిర్వహించనున్న ఊరువాడ కార్యక్రమానికి తారక్ పొలిటికల్ ఎంట్రీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఇది ఒక సామాజిక కార్యక్రమం మాత్రమేనని వెల్లడించింది. ఇంతలో కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే మంగళవారం మరో సంస్థ తిరుపతి రాఎన్టీఆర్ తాజ్ హోటల్‌లో ఎన్టీఆర్ ప్రెస్ మీట్ పెట్టనున్నారని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం ఆశ్చర్యకరం. ఈ వార్తలు పలు మీడియా ఛానెళ్లలో సైతం ప్రసారం కావడంతో చివరికి ఎన్టీఆర్ ఆఫీస్ రంగంలోకి దిగి మరీ ఇవన్నీ అవాస్తవాలు అని క్లారిటీ ఇవ్వాల్సి వచ్చింది. దాంతో సంబంధిత సంస్థ చేసిన వ్యాఖ్యలు అనధికారికమైనదిగా తేలింది. ఎన్టీఆర్ అభిమానుల సంఘం జులై 18న ఊరువాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దీనికి ఎప్పుడో ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపింది. దీన్ని రాజకీయాలతో ముడిపెట్టొద్దని విజ్ఞప్తి చేసింది. అసత్య ప్రచారాలను నమ్మొద్దని అందరినీ కోరింది. ఇలాంటి వాటిని ప్రచారం చేయొద్దని మీడియా సంస్థలు, సోషల్ మీడియా పేజీలకు సైతం తెలియజేసింది. దీని వల్ల అభిమానులు అనవసరంగా అయోమయానికి గురవుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. దీనిపై క్లారిటీ ఇస్తూ ఎన్టీఆర్ అభిమానుల సంఘం సంబంధిత లేఖలో పేర్కొంది.

## ఎపి చేనేత ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్: ఎంపి విజయేంద్ర ప్రసాద్

**విజయవాడ,జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ చేనేత, వస్త్ర ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని రాజ్యసభ సభ్యుడు వి.విజయేంద్ర ప్రసాద్ అన్నారు. నైపుణ్యమైన నేత కళాకారులను వర్చువల్ రియాలిటీ (వీఆర్) వంటి ఆధునిక సాంకేతికత ద్వారా అంతర్జాతీయ కొనుగోలుదారులతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ మండపంలో మంగళవారం ప్రారంభమైన భారత్ టెక్స్-2026 ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను ఆయన సందర్శించారు. భారతీయ సాంప్రదాయ హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు ముఖ్యంగా అమెరికాలోని భారతీయ ప్రవాసులు, అంతర్జాతీయ వినియోగదారుల్లో మంచి ఆదరణ పెరుగుతోందని ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ అవకాశాన్ని ఆంధ్ర ప్రదేశ్ సమర్థంగా వినియోగించుకుంటే చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ (లేపాక్షి) పసుపులేటి హరి ప్రసాద్ పెవిలియన్‌ను సందర్శించి అధికారులను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి నారా



మంగళవారం ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను సందర్శించి ఎంపి విజయేంద్ర ప్రసాద్

చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో అమలవుతున్న ఏపీ టెక్స్‌టైల్ పాలసీ-4.0 ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ఆర్థిక సంక్షోభంలో ఇండియా

### బిజెపి పాలనలో రూ.150 కోట్ల విదేశీ అప్పులు: చింతామోహాన్



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న చింతామోహాన్

**చిత్తూరు, జులై 14 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఎ కూటమి ప్రభుత్వం 12 సంవత్సరాల్లో 150 లక్షల కోట్ల రూపాయల విదేశీ అప్పులు చేసి భారతదేశంను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసిందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతా మోహన్ ధ్వజమెత్తారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చింతామోహన్ మాట్లాడుతూ భారతదేశాన్ని యేళ్ల తరబడి పాలించిన కాంగ్రెస్ పార్టీ హయాంలో విదేశీ అప్పులు కేవలం 50లక్షల కోట్ల రూపాయలు మాత్రమే వుండేదన్నారు. దేశంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఎ కూటమి అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాల్లో విదేశీ అప్పులు మూడింతలు పెరిగాయని ధ్వజమెత్తారు. కేంద్రంలో యుపిఎ అధికారంలో వున్న సమయంలో ఒక లీటరు పెట్రోలు, డీజిలు రూ.60 వుండేదని, ప్రస్తుతం ఈ ధర రూ.110కి పెరిగిందన్నారు. ప్రస్తుతం దేశంలో కోడి గ్రుడ్డు నుండి ఎరువులు, బియ్యం, నూనె, పప్పుల ధరలు అందనంత ఎత్తుకు ఎగబాకి సామాన్యులకు అందడం లేదని ధ్వజమెత్తారు. ఆయోధ్యలో రామమందిరం నిర్మాణం కోసం వసూలు చేసిన నిధుల గురించి అడిగితే బిజెపి నాయకులు పారిపోతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని బాధపడుతున్నారని, ఆయనపై 16 సంవత్సరాలుగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో విచారణ సాగుతున్నదని, న్యాయ స్థానాల్లో రాజకీయ జోక్యం పెరిగిందన్నారు.
తమిళనాడు మాజీ సిఎం జయలలితకు ఒక న్యాయం, ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం వైఎస్ జగన్‌కు ఒక న్యాయం! అని ప్రజల్లో చర్చ విస్తృతంగా జరుగుతున్నదన్నారు. అలాగే రాష్ట్రానికి సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించిన ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు తన సొంత జిల్లా చిత్తూరుకు ఏమి చేయకపోవడం అన్యాయమన్నారు. ఇకనైనా సిఎం సొంత జిల్లా చిత్తూరు ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పరదేశి తదితరులు పాల్గొన్నారు.

## రవితేజ మృతదేహానికి అంత్యక్రియలు

### శోకసంద్రంలో కుటుంబీకులు



రవితేజ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య,తదితరులు

**హిందూపురం, జులై 14 ప్రభాతవార్త:** విహారయాత్రకు వియత్నాం వెళ్లి పడవ ప్రమాదంలో దుర్మరణం చెందిన హిందూపురం వాసి రవితేజ మృతదేహం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీసత్యసాయిజిల్లా హిందూపురానికి చేరుకుంది. వియత్నాం నుంచి న్యూఢిల్లీకి సోమవారం బోటు ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలు వచ్చాయి. తదుపరి మంగళవారం ఉదయం న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకోగా ప్రత్యేక అంబులెన్స్ వాహనంలో రోడ్డు మార్గం నందు ఇక్కడికి తీసుకొచ్చారు. స్థానిక టీచర్స్ కాలనీలోని నివాసానికి మృతదేహం చేరుకోగానే భార్య, ఇద్దరు కుమార్తెలు, తల్లి గుండెలు పగిలేలా రోదించారు. వారి రోదనలను చూసిన ప్రజలు చలించిపోయారు. 40 ఏళ్ల వయసులోనే మృత్యువాత పడడం అత్యంత బాధాకరమైనదని కుటుంబీకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో లక్కీ మొబైల్ షాపును నిర్వహించిన రవితేజ లావా కంపెనీకి చెందిన మొబైల్ ఫోన్లను రికార్డు స్థాయిలో విక్రయించడంతో వియత్నాం టూర్‌కు సెలక్ట్ అయి అక్కడికి వెళ్లిన మూడో రోజే మృత్యువాత పడడం తెలిసిందే. కాగా లావా కంపెనీ ప్రతినిధులు రవితేజ కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారంగా ప్రకటించారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో స్నేహితులు, ప్రజలు తరలివచ్చారు.

## నగల కోసం వృద్ధురాలు దారుణ హత్య

**తిరుపతి,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నగరంలో మంగళవారం మధ్యాహ్నం దారుణ హత్య జరిగింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని టార్గెట్ చేసిన దుండగులు గొంతుకోసం హత్యచేసి ఆపై ఒంటిపై ఉన్న నగలను అపహరించుకెళ్లారు. ఈ సంఘటన తిరుపతి రూరల్ ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశవాయన గుంటలో జరిగింది. ఆంధ్ర బ్యాంక్ మేనేజర్ గా రిటైర్డ్ అయిన కృష్ణారెడ్డి జ్యోతి దంపతులు నివాసముంటున్నారు.ఆయనకుమారుడు ఉదయ్ అమెరికాకు వెళ్ళేందుకు విమానాశ్రయంవెళ్లి సాగనంపేందుకు సోమవారం బెంగళూరుకి వెళ్ళాడు, దీన్ని గమనించిన దుండగులు అదనుగా భావించి ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు జ్యోతి(60)ని దుండగుడు గొంతు కోసి నగలు లాక్కొని ఇంటికి బయట తాళం వేసి పరారయ్యాడు. బెంగళూరు నుండి పలుమార్లు భర్త ఫోన్ చేసినా తీయక పోవడంతో అనుమానం వచ్చి పై ఇంటిలో ఉన్న వాళ్లకు సమాచారమిచ్చాడు. పై ఇంటిలో ఉన్నవాళ్లు క్రిందికి వచ్చి అరచినా తలుపులు తీయకపోవడంతో వారి వద్ద ఉన్న మరో తాళంచెవితో తలుపుతీశారు. లోపలరక్తస్రావం తో విగత జీవిగా ఉన్న జ్యోతిని గుర్తించి మృతురాలు భర్తకు పోలీసులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న ఎఎస్పీలు ఆర్ల శ్రీనివాసులు, రవి మనోహరచారి, డీఎస్పీలు భక్తవత్సలం, శ్యామ్‌సుందర్, సిఐలు మద్దయ్యాచారి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీస్ క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్, డాగ్ స్క్వాడ్ చేరుకొని ఆధారాలు సేకరించాయి.ఆ ఇంటికి చుట్టుపక్కల ఉన్న సిసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు.. ఆధారాలను సేకరించారు. గతంలోనూ తిరుపతిలో ఒంటరిగా ఉన్న మహిళను హతమార్చి నగలు కాజేసిన విషయం విదితమే.

## శవ రాజకీయాల ముసుగు తొలగిస్తాం

### మత్స్యకారుల పక్షాన నిలచిన చరిత్ర మాది: మంత్రి అచ్చెన్నాయుడు



**సచివాలయం,జులై 14,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతిపక్ష గొడ్డలి పార్టీ అధ్య క్షుడు చేస్తున్నవన్నీ పచ్చి అబద్దాలని,శవ రాజకీయాల ముసుగులో లబ్ది పొందాలని చూస్తే ప్రజా క్షేత్రంలో ఉతికి ఆరేస్తాం అని వ్యవ సాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తీవ్రస్థా యిలో ధ్వజమెత్తారు.మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల విశాఖ పట్నం తీరంలో ప్రకృతి వైపరీత్యం వల్ల గల్లంతైన మత్స్యకారుల ఉదంతంపై ప్రతిపక్షం చేస్తున్న చౌకబారు విమర్శలను ఆధారాలతో సహా తిప్పికొట్టారు.సముద్రంలో జరిగిన ప్రమాదంపై ప్రతిపక్ష నేతకు కనీస అవగాహన లేదని అచ్చెన్నాయుడు ఎద్దేవ చేశారు.టీవిల్లో,పేపర్లలో 19నాటికల్ మైల్స్(దాదాపు 35కిమీ) దూరంలో ప్రమాదం జరిగిందని ట్రోలింగ్ వస్తుంటే,కనీస జ్ఞానం లేకుండా 10కిమీదూరంలోనే జరిగిందని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు.నాటికల్ మైల్‌కు,కిమీకు తేడా తెలియని నువ్వు ఈరోజు ప్రభుత్వ బాధ్యత గురించి మాట్లాడటం హాస్యాస్పదం అని మండిపడ్డారు. మత్స్యకారుల రక్షణకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌పాండర్ల సాంకేతికత గురించి మంత్రి వివ రించారు.ప్రమాద సమయంలో బోటులోని వారు అలారం ఆన్ చేయక పోవడం వల్ల లోకేషన్ గుర్తించడం కష్టమైందని,అయినాకాని ఉద యం 10.30గంటలకు సమాచారం అందిన వెంటనే డిపార్ట్‌మెంట్ అప్రమ త్తమైందన్నారు.11.30 గంటలకల్లా కోస్ట్‌గార్డ్,నావికాదళం,జిల్లా కలెక్టర్ ను సమన్వయం చేసి హెలికాప్టర్లు,బోట్లతో గాలింపు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు.ప్రాణాలకు తెగించి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించామని చివరకు రక్షాబోటు సహాయంతో ఒకరు ప్రాణాలతో బయటపడ్డారని వివరించారు.
**కంటి సర్జరీని కూడా రాజకీయం చేస్తారా?** గత 30ఏళ్ళుగా రాష్ట్రంలో ఎక్కడ విపత్తు వచ్చినా అర నిమిషంలో అక్కడ వాలిపోయే చరిత్ర అచ్చెన్నాయుడిది,ప్రమాదం జరిగిన రోజు నాకు రెండు కళ్ళకు కాటరాక్ట్ సర్జరీ జరిగింది.నేను వెళ్ళలేకపోయినా, తక్షణమే ముఖ్యమంత్రితో మాట్లాడి మా సహచర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును,స్థానిక ఎమ్మెల్యేలను,అధికారులను రాత్రికి రాత్రే బాధితుల వద్దకు పంపాను, అంతేకాకుండా మత్స్యకార శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ద్వారా తక్షణ సహాయం చెక్కులను విశాఖపట్నం పంపించి బాధితులకు అందజేశాం.ఇవన్నీ నీ కళ్ళకు కనిపించడం లేదా? అని నిలదీశారు. శ్రీకాకుళంలో గొర్రెలు కాసుకునే అమాయక పేదవాడిని ఢీకొట్టి చంపిన మాజీమంత్రి కొడుకు ఉదంతాన్ని మంత్రి ప్రస్తావించారు. చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన "డేగ కళ్ళ" సీసీ నిఘా కెమెరాలు ఉండబట్టి,ఎస్పీ ఆ ఫుటేజ్ చూసి మీ కుట్రలను బట్ట బయలు చేశారు. 'పలకరింపుల పేరుతో కెమెరాల ముందు నవ్వుకుంటూ,జైజైలు కొట్టించుకునే శవ రాజకీయాల ముసుగును మత్స్యకార సంఘాలు గమనించాలి.అభివృద్ధిపై, సంక్షేమంపై ఎక్కడికి రమ్మన్నా బహిరంగ చర్చకు నేను సిద్ధం" అని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు.



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిపయ్యావుల కేశవ్‌తో ఉద్యోగ సంఘాల నాయకులు

## మంత్రి పయ్యావులను కలిసిన ఉద్యోగసంఘ నాయకులు

**విజయవాడ.జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** సచివాలయంలో ప్రభుత్వఉద్యో గుల సంఘంనాయకులు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మర్యాద పూర్వకంగా కలిసి, 2004 సెప్టెంబర్ 1కు ముందు ఏపీపీఎస్సీ/డీఎస్సీ నోటిఫికేషన్ల ద్వారా ఎంపికై వివిధ ప్రభుత్వ శాఖల్లో సేవలందిస్తున్న ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పాత పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయనున్న నేపథ్యంలో కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో హాజరైన ఉద్యోగులు, ఏపీఎస్ఎఫ్ఏ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాపా ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం,ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం దాదాపు 11 వేల మంది ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషాన్ని నింపిందని వారు పేర్కొన్నారు.

### ఆధార్ కార్డు అప్డేట్, కొత్తగా నమోదుకు ప్రత్యేక సెంటర్లు

**విజయవాడ,జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్స్‌లో విద్యార్థుల ఆధార్ కార్డు అప్డేట్. కొత్త నమోదుల కోసం ప్రత్యేక సెంటర్‌లను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తోంది. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నేటి నుండి 17వతేదీ వరకు మొదటి విడత ఆధార్ అప్డేషన్, కొత్త నమోదులు చేసుకోవచ్చు. ఇక రెండోవిడత జులై 21 నుండి 24 వరకు నిర్వహించబడుతుంది.మొత్తం 8రోజుల పాటు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వచ్చు. ఐదు నుండి 17సంవత్సరాల మధ్య ఉన్న విద్యార్థులకు ఉపయోగపడుతుంది.

### ఆగస్టు 6నుంచి 15 వరకు 'మార్పు కోసం'

#### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ,జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** సీపీఐ జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 15 వరకు మార్పు కోసం అనే నినాదంతో దేశ వ్యాప్తంగా ప్రచార, పాదయాత్రలను రాష్ట్రంలోను నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మంగళవారం విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలు, 674 మండలాలు, వందలాది గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఆగస్టు 17 నుంచి 27 వరకు పార్టీ అనుబంధ ప్రజాసంఘాలు తమ తమ సమస్యలపై నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాయని తెలిపారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే మహాసభకు రాష్ట్రం నుంచి సుమారు మూడు వేల మందిని సమీకరిస్తామని వెల్లడించారు.సెప్టెంబర్ చివరి వారంలో కడపలో నాలుగురోజులపాటు సీపీఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో.. 2023లో ఆమోదించిన 106వ రాజ్యాంగ సవరణలో సెన్సస్, నియోజకవర్గాల పునర్విభజనతో అనుసంధానం చేసిన విధానాన్ని విరమించి, ఎలాంటి షరతులు లేకుండా వెంటనే 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోక్‌సభలోని 543స్థానాల్లో కనీసం 181 స్థానాలను మహిళలకు కేటాయించాలని కోరారు. ఏపీలో అప్రకటిత ఎమర్జెన్సీ, ప్రజా స్వామ్యంపై నిరంకుశ దాడి జరుగుతుందన్నారు, ఉపాకు వ్యతిరేకంగా ఐదు నగరాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బిజెపి అజెండా మోస్తే టీడీపీ రాజకీయ ఉనికికి ప్రమాదమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి, దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.



ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నంకు వినతి పత్రం అందజేస్తున్న జెఎసి నేతలు

### సమస్యలు పరిష్కరించండి: జెఎసి నేతలు

**కుప్పం,జులై 14 ప్రభాతవార్త:** ఎపిఎస్ ఆర్టీసీ జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలు, పెండింగ్ డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నంకు ఆర్టీసీ జెఎసి నేతలు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలను వైస్‌చైర్మన్‌కు వివరించి వాటి పరిష్కారంకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం స్పందిస్తూ జెఎసి నేతల వినతిని పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా జెఎసి కన్వీనర్లు ఉపేంద్ర, బలరాంమూర్తి, రాష్ట్ర సభ్యులు బాబు, శ్రీకర్‌రెడ్డి, కుప్పం డిపో జెఎసి అధ్యక్షుడు మునెప్ప, కార్యదర్శి జయపాల్, నాయకులు కరుణాకరన్, వేలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

**కర్నూలు అర్బన్, జు లై 14 ప్రభాతవార్త** బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్ మీద ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి (41) మృతి చెందారు. ఆయన 2వ బెటాలి యన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ప్రస్తుతం ఎస్ డి ఆర్ ఎఫ్ ఎంటీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

రోజువారీగా వాకింగ్‌కు వెళ్లే ప్రసాద్ రెడ్డి ఉదయం బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్‌పై నడుస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఫ్లైఓవర్ పై నుంచి కృష్ణనగర్ సర్వీస్ రోడ్డుపై పడిపోయారు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు, కానిస్టేబుల్ పరమేష్ కలిసి హైవే అంబులెన్స్ ద్వారా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్సకు ముందే ఉదయం 7:48 గంటలకు ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి (ఫైల్)

# బాదంతో మిసమిస !



బాధ్యతలన్నీ నెత్తి వేసుకుని అందరి గురించీ ఆలోచించే మహిళల్లో ఎక్కువమంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని చెబుతున్నారు పలు అధ్యయనాలు. అందుకే, రోజూ అయిదారు బాదం గింజల్ని తినమని సూచిస్తు న్నారు. బాదం గింజల్లో విటమిన్ ఇ, మెగ్నీషియం, ప్రొటీన్, రైబోఫ్లే విన్, జింక్ వంటి 15 రకాల పోషకాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యం ఉంచేందుకు దోహదపడతాయి. పోషకాల లేమిని తగ్గిస్తాయి. ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు యాంటీ ఏజింగ్ గుణాలూ బాదంలో ఎక్కువ. వీటిని తీసుకోవడం వల్ల చర్మం ముడతలు పడకుండా ఉంటుంది. ఇందులో ఎక్కువ దొరికే ప్రొటీన్ శక్తి నివ్వడంతో పాటు కండరాల సాంద్రతను పెంచుతుంది. అలానే ఇందులోని విటమిన్ బి2, విటమిన్ ఇ, మెగ్నీషియం, ఫాస్ఫరస్‌లు నరాల పనితీరుని పెంపొందిస్తాయి. అంతేకాకుండా బాదం తినడం వల్ల త్వరగా కడుపునిండినచ భావన కలిగి అతిగా తినే అలవాటు తగ్గుతుంది. ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ తక్కువగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. బాదం తినడం వల్ల రక్తంలో చక్కెరలు సమన్వయం అవుతాయి. ఇన్సులిన్ ఉత్పత్తి బాగుంటుంది. అలానే, ఇందులో అధిక మోతాదులో లభించే కాల్షియం ఎముకలు, దంతాలను దృఢంగా ఉంచుతుంది. కండరాల పనితీరుని మెరుగుపరుస్తుంది. శరీరంలో ఎర్రరక్త కణాల శాతాన్ని పెంచి రక్తహీనతను నివారించడంలో ఐరన్ పాత్ర ఎక్కువే. ఫలితంగా మహిళల్లో రక్తహీనత అదుపులోకి వస్తుంది. ఇది బాదం గింజల్లో పుష్కలంగా లభిస్తుంది. శరీరంలోని అన్ని అవయవాలకూ ఆక్సిజన్ సరఫరా సక్రమంగా ఉండేలా చూస్తుంది. మెటబాలిజాన్నీ, వ్యాధినిరోధక శక్తినీ పెంచుతుంది.

# బొమ్మలు గీసేద్దామా?



అక్షరాలు రాకున్నా ఆకృతులు గీయడంలో మన బుజ్జాయిలు వారికే సాటి. ప్రీస్కూల్లోనే వీళ్లకి ఇవి పరిచయం అవుతున్నాయి. అంటే పెన్సిల్ ఎంత ముఖ్యమో రంగు పెన్సిళ్లే, క్రేయాన్లూ అంతే అవసరమనేగా! మనమేమో. అరెరే ఎంత చక్కగా బొమ్మలు గీస్తున్నారో, ఎంత ముచ్చటగా రంగులద్దుతున్నారో' అని పెద్ద పెద్ద కలరింగ్ బాక్సులు కొని తెచ్చేస్తాం. వాళ్లేమో అన్నింటినీ కలగాపులగం చేస్తారు. అంతటితో ఆగుతారా? ఎంత ఖర్చు పెట్టి కొన్నవైనా వాళ్లకి కొద్దిరోజుల్లోనే బోర్ కొట్టేస్తాయి.



వాటిని విరిచేయడం, పడేయడం సరేసరి. ఇక్కడ రంగు లేకపోయినా మళ్లీ బాక్సు అంతా కొనాల్సిందే ఆ పాత వాటిని వేయడానికి మళ్లీ ఓ డబ్బా వెతకాలి. ఎందు కొచ్చిన శ్రమ ఇదంతా? పైగా డబ్బులూ వృథా వీటన్నింటికీ 'మినీ'నే ఉపాయం. ఏం లేదండీ.. కలర్ పెన్సిళ్లు, క్రేయాన్స్ చిట్టి సైజుల్లో దొరుకుతాయి. వాటిని తెచ్చేయండి. ఇవైతే చక్కగా డబ్బాల్లోనూ వస్తాయి. పనయ్యాక వాళ్లే దానిలో సర్దుకుంటారు. ఖర్చూ తక్కువే కాబట్టి, పోగొట్టినా, బోర్ కొట్టాయన్నా కొనడానికి మనకీ ఇబ్బంది అనిపించదు ఏమంటారు?

# గుడ్డు అందరికీ ..



భావనతో భారతీయ సంప్రదాయంలో గుడ్డును మాంసాహారంగా పరిగణించినా కాలక్రమేణా గుడ్డంటే ఆ రెండింటికే చెందదు కనుక శాకాహారులు తినవచ్చుననే సూత్రీకరించారు. పాలు, తేనె జంతువుల నుంచి వచ్చినా శాకాహారంగా భావిస్తున్నప్పుడు గుడ్డుపై భిన్నాభిప్రాయాలు దేనిని అనే వాదన లేకపోలేదు. శాస్త్రీయంగా పరిశీలిస్తే.. మార్కెట్లో లభించే చాలా గుడ్లు ఫలదీకరణ చెందనివి. వాణిజ్య కోళ్ల ఫారాల్లో పెట్టలను, పుంజులను వేర్వేరుగా ఉంచుతారు. మానవులలో అండం విడుదలైనట్లే, కోడి పెట్టలు కూడా పుంజుతో సంపర్కం లేకుండానే సహజంగా గుడ్లు పెడతాయి. ఇలాంటి గుడ్లలో పిండం ఉండదు కాబట్టి, అవి ఎప్పటికీ కోడిపిల్లలుగా మారే అవకాశం లేదు. శాస్త్రీయంగా చూస్తే, వీటిలో ప్రాణం ఉండదు. దీనికి భిన్నంగా పెరటి కోళ్లు లేదా ఫ్రీరేంజ్ ఫారాల్లో పెట్టలు, పుంజులు కలిసి తిరుగుతాయి. అక్కడ లభించే గుడ్లు ఫలదీకరణ చెందే అవకాశం ఉంటుంది. సరైన వాతావరణంలో పొదిగితే అవి పిల్లలుగా మారగలవు. జీవం ఉన్న లేదా జీవం కలిగే అవకాశం ఉన్న దేనిని తినడం మైన జీవహించే నమ్మకం వల్లే గుడ్డును మాంసాహారం అంటుంటారు. కానీ గుడ్డు శాకాహారమేనని భావించి ఎంతో మంచి ఆరోగ్యన్నిచ్చే ఆధురువుగానే లెక్కిస్తున్నారు. మనం తినే గుడ్లనీ వాణిజ్య ఫారాలనుంచి వస్తాయి. కనుక ప్రాణం లేని (ఫలదీకరణ చెందని) గుడ్డును కనుక శాకాహారంగానే చూడాలని కొందరు వాదిస్తారు. గుడ్డను తింటే మంచి ఆరోగ్యం కలుగుతుందే తప్ప పదోషము ఉండదు.

# జామాకుతో మొటిమలు హుష్!



పర్యావరణ కాలుష్యం, మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ముఖంపై గీతలు, నల్ల మచ్చలు ఏర్పడుతున్నాయి. వీటిని దూరం చేయడంలో జామాకు బాగా పనిచేస్తుంది. జామాకుల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమల్ని తగ్గించడంలో సాయపడతాయి. ఇందుకు గుప్పెడు జామాకుల్ని తీసుకుని మిక్సీ పట్టుకోవాలి. రసం తీసి దానికి రెండు చెంచాల ఆవుపాలు కలిపి ముఖానికి పట్టించాలి. ఇది సెబమ్ ఉత్పత్తినే కాదు, మొటిమలతో వచ్చే వాపునీ తగ్గిస్తుంది. గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చున్న వారిలో నీలికాంతి వల్ల ముఖంపై పిగ్మెంటేషన్ ఏర్పడుతుంది. నల్లగా మారుతుంది. ఆ నలుపు తగ్గాలంటే నాలుగు జామాకుల్ని ఒక గిన్నెనీటిలో వేసి మరిగించాలి. ఆ నీటితో ముఖాన్ని కడిగితే సరి. ఇలా వారానికి మూడుసార్లు చేస్తే చర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది.

# సర్వపిండి



**కావలసినవి :** జొన్నపిండి, కప్పు, ఉల్లిపాయ, ఒకటి, కారం: 2 టీస్పూన్లు, ఉప్పు: టీస్పూను, బియ్య పిండి: 3, టేబుల్ స్పూన్లు, జీలకర్ర పొడి, టేబుల్‌స్పూను, పసుపు: పావు టీస్పూను.

**తయారుచేసే విధానం :**

ఉల్లిపాయలు సన్నగా తరిగి గిన్నెలోవేయాలి. అందులోనే ఉప్పు, పచ్చి మిర్చి ముక్కలు, జీలకర్ర పొడి, పసుపు వేసి కలిపి ఐదు నిమిషాలు పక్కన ఉంచాలి. విడిగా మరో గిన్నెలో జొన్నపిండి, బియ్యపిండి వేసి కలపాలి. తరవాత ఓ కప్పు నీళ్లపోసి చపాతీ పిండి కలపాలి. ఇప్పుడు పెనంమీద నాలుగు టీ స్పూన్ల నూనె వేయాలి. చేతులకి కూడా నూనె రాసుకుని కొద్దిగా పిండి ముద్దను తీసుకుని బిళ్లలా చేసి దాన్ని పెనంమీద వేసి వేళ్లతో జొన్నరొట్టె మాదిరిగానే పెనం అంతా వచ్చేలా వత్తాలి. చివరగా మద్యలో చిన్న చిన్న రంధ్రాలు చేసి అందులో కొద్దిగా నూనె వేయాలి. దీన్ని రెండువైపులా కాల్చి తీయాలి.

# పూరీ జగన్నాథుడు

శ్రీకృష్ణుని స్థిర విశ్వాస క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన పూరీకి శ్రీక్షేత్రమనే పేరు కూడా ఉంది. ఎక్కడైనా ఏ దేవుడైనా సతీ సమేతంగానో, ఏకమూర్తిగానో వెలుస్తాడు. కానీ పూరీలో సోదరుడు. బలరాముడు, సోదరి సుభద్రలతో కలిసి కొలువుతీరిన కృష్ణుడు జగన్నాథుని పేరుతో పూజలందుకుంటున్నారు. ఇది జగన్నాథుని పురం కనుక జగన్నాదపురి అని పిలిచేవారు. కాలక్రమేణా అటు దిటు మారి.. పురం జగన్నాథ్.. పూరీ జగన్నాదగా స్థిరపడింది. శ్రీరాముడు నిరంతరం తననే సేవించి, తన జీవించిన లక్ష్మణుడి పట్ల ప్రేమ కోసమే, ఆదరణలతో పై జన్మలో నీకు తమ్ముడినై సేవిస్తాను అని వరమిచ్చాడు. ఆ ప్రకారం లక్ష్మణుడు బలరాముడిగా, రాముడు శ్రీకృష్ణుడిగా జన్మించారు. శ్రీరాముడు సీతాదేవి, లక్ష్మణులతో కూడి దర్శనం ఇస్తున్నట్లే శ్రీకృష్ణుడు అన్న చెల్లెళ్లతో కూడి దాదాపు వెయ్యి అడుగుల ఎత్తులో శ్రీమహావిష్ణువు ఆయుధమైన సుదర్శన చక్రాకారంలో ఉన్న పూరీ జగన్నాథ ఆలయానికి దిక్కుల ద్వారా ఉండటం విశేషం. ఏటు నుంచి అయినా లోనికి వెళ్లవచ్చు. ఇక్కడి దేవతలు చెక్కతో చేసిన వారు మూర్తులు ఆలయంలో అనేక నియమాలున్నాయి. వంట కోసం మట్టి కుండలను మాత్రమే వాడతారు. నిత్యం 56 రకాలు నైవేద్యాలు నివేదిస్తారు. ఉదయం ఆధ్యాత్మిక చింతన, పారమార్థిక ప్రయోజనాలను చేకూరుస్తూ సామాజిక ఐక్యతను పెంచే ఉత్సవం రథయాత్ర ఏటా 9 రోజులు సాగే ఈ



రథయాత్ర ఆషాడ శుక్ల విదిది మొదలై దశమినాడు ముగుస్తుంది. నిజానికి వైశాఖ శుద్ధ విదియ నాడే రథయాత్ర కోసం పనులు ప్రారంభిస్తారు. అక్షయ తృతీయనాడు రథాల తయారీకి శ్రీకారం మడతారు. శ్రీకృష్టమైన కలపను సేకరిస్తారు. జగన్నాధుని. రథం పేరు నందికోశ బలభద్రుని రథం తాళధ్వజం సుభద్రాదేవి రథం పేరు దర్పదలన్. అన్నీ సిద్ధం చేయడానికి రెండు నెలలు పడుతుంది. జగన్నాథుని రథానికి దారకుడు, బలభద్రుని రథానికి మాటలి, సుభద్రాదేవి రథానికి అర్జునుడు సారథులు.

# తెర

ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు జి. నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న అవుట్ అండ్



## మిస్టర్ మిడిల్ క్లాస్ ట్రైలర్ విడుదల

అవుట్ ఎంటర్టైనర్ మిస్టర్ మిడిల్ క్లాస్. జీకే సిఎన్ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. జూలై 17న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ... ముందుగా పద్మశ్రీ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కి హృదయపూర్వక అభినందనలు. నిజానికి ఇది ఆయన సినిమానే. వెంకటేశ్వర స్వామి పాత్ర లేకపోతే ఈ సినిమా ఉండేది కాదు. అలాంటి గొప్ప పాత్ర ఆయనకు రావడం అదృష్టం. ఈ సినిమాలో ఆయన పాత్ర ఒక పెద్ద హైలైట్‌గా నిలుస్తుంది. కోన వెంకట్ మాట్లాడుతూ.. శ్రీకాంత్ గారు, రాజేంద్ర ప్రసాద్, నాగేశ్వర్ రెడ్డి నాకు ఎంతో ఇష్టమైన వ్యక్తులు. మిస్టర్ మిడిల్ క్లాస్ అనే టైటిల్‌లోనే చాలా పాజిటివ్ వైబ్ ఉంది. నిర్మాత చందు మాట్లాడుతూ.... జీకే ఒక మంచి సినిమా తీద్దామని చెప్పారు. అలా దర్శకుడు నాగేశ్వర్ రెడ్డితో కలిసి కుటుంబం మొత్తం చూసే మంచి ఎంటర్‌టైనర్ చేయాలని నిర్ణయించు కున్నాం. ఆయన అద్భుతమైన కథతో మా ముందుకు వచ్చారు. శ్రీకాంత్ , రాజేంద్ర ప్రసాద్ లయ గ.. ఇలా మా టీమ్‌లోని ప్రతి ఒక్కరూ మాకు ఎంతో సహకరించారు. వాళ్లందరికీ హృదయపూర్వక అలీ మాట్లాడుతూ... శ్రీకాంత్‌తో నాకు ఎప్పటి నుంచో మంచి స్నేహం ఉంది.

## 'రాజా ది రాజా'ను ఆదరిస్తారని ఆశిస్తున్నా: నిర్మాత కె. నిహారిక దాసరి

రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన 'రాజా ది రాజా' చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ప్రేమ, వినోదం, యూత్ కు సంబంధించిన భావోద్వేగాల కలయికతో ఆకట్టుకోనుంది.జై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.



**నిర్మాతగా మారాలనే నిర్ణయం ఎలా తీసుకున్నారు? ఈ సినిమా ప్రయాణం ఎలా మొదలైంది?**

నిర్మాతగా మారడానికి నాలుగైదేళ్లు ఆలోచించి నిర్ణయం తీసుకున్నాను. రుత్విక్‌కు సినిమాలంటే చాలా ప్యాషన్. అమెరికాలో ఫిల్మ్ కోర్స్ చేశాడు. అదే సమయంలో ఒక షార్ట్ ఫిల్మ్‌లో అబ్బాయి, అమ్మాయి రెండు రకాల పాత్రలు చేశాడు. ఆ షార్ట్ ఫిల్మ్ చూసిన తర్వాత తనపై నాకు మరింత నమ్మకం పెరిగింది. .

**ఈ కథలో మీకు బాగా నచ్చిన అంశం ఏమిటి?**

ఇది చాలా బలమైన కథ. ఇందులో హీరో రెండు విభిన్న పాత్రల్లో కనిపిస్తాడు. ఏ నటుడికైనా ఇది పెద్ద ఛాలెంజ్. రుత్విక్ ఆ రిస్క్ తీసుకుని ఈ సినిమా చేశాడు. ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం వంద శాతం కష్టపడ్డారు.

**ట్రైలర్ చూసిన తర్వాత 'మగధీర'తో పోలుస్తున్నారు. దీనిపై మీ అభిప్రాయం?**

సినిమా తీస్తున్నప్పుడు మాకు అలాంటి ఆలోచన రాలేదు. కానీ ట్రైలర్ విడుదలైన తర్వాత చాలామంది మగధీర వంటి గొప్ప సినిమాతో పోల్చడం ఆనందంగా అనిపించింది.

**రుత్విక్ గురించి?**రుత్విక్‌కు తనపై చాలా ఆత్మవిశ్వాసం ఉంది. ప్రేక్షకులను అలరించగలననే నమ్మకంతో సినిమా చేశాడు.

**భవిష్యత్తులో కూడా నిర్మాణం కొనసాగిస్తారా?**

ఖచ్చితంగా కొనసాగిస్తాను. ఇండస్ట్రీలో అందరూ మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా స్వాగతించారు. ట్రైలర్, టీజర్‌కు ఎంత మంచి స్పందన వచ్చిందో, సినిమా కూడా అంతే మంచి ఆదరణ పొందుతుందని నమ్ముతున్నాను.

**షూటింగ్ ఎన్ని రోజులు జరిగింది?**

దాదాపు 80 రోజులకు పైగా షూటింగ్ చేశాం. ఈ సినిమా కోసం ప్రత్యేకమైన సెట్లు కూడా నిర్మించాం. అలాగే గ్రాఫిక్స్ వర్క్ కూడా చాలా అద్భుతంగా వచ్చింది.

**నిర్మాతగా మారిన తర్వాత జీవితం ఎలా మారింది?**

చాలా మారింది. నా కుటుంబం, స్నేహితులు ఎంతో సపోర్ట్ చేశారు. ముఖ్యంగా మా అత్తగారు నన్ను చాలా ప్రోత్సహించారు.

**చివరిగా... ప్రేక్షకులకు ఏం చెబుతారు?**

ఈ సినిమాను మేమంతా ఎంతో కష్టపడి తీశాం. సినిమా అద్భుతంగా వచ్చింది. సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. జూలై 17న అందరూ థియేటర్లలో 'రాజా ది రాజా' చూసి మమ్మల్ని ఆదరిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

## 'ఓ.! సుకుమారి'తో ఫ్యామిలీ ఆడియన్స్‌కు దగ్గరవుతా: హీరో తిరువీర్



యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఓ.! సుకుమారి' తో అలరించబోతున్నారు.

**మీ నుంచి వరుసగా సినిమాలు విడుదల కావడం ఎలా అనిపిస్తోంది?**

నటుడిగా చాలా ఆనందంగా ఉంది. అలాగే మనతో సినిమా చేసిన నిర్మాత బాగుండాలి, దర్శ కుడికి మంచి పేరు రావాలి, ప్రేక్షకులు ప్రతి సినిమాను ఆదరించాలని కూడా ఒక బాధ్యత ఉంటుంది.

**ఐశ్వర్య రాజేష్‌తో కలిసి నటించడం ఎలా అనిపించింది?**

మన కోస్టార్స్ మంచి పెర్ఫార్మర్స్ అయితే మనం కూడా ఇంకా బాగా నటించడానికి ప్రయత్నిస్తాం.

**ఈ కథను తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కించడానికి కారణం?**

మా దర్శకుడు భరత్ దర్శన్ సిద్ధిపేటకు చెందినవారు. ఈ మధ్యకాలంలో చాలామంది దర్శకులు తమ ప్రాంతాల కథలు, పాత్రలను చెప్పడానికి ఆసక్తి చూపుతున్నారు. . ఇలా అన్ని ప్రాంతాల యాసల్లో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

**ఓ.! సుకుమారి కథను ఒక్క లైన్‌లో చెప్పాలంటే?**

ఒక అమ్మాయి గుండె వేగం సాధారణ స్థాయిని దాటితే ఆమె శరీరం నుంచి ఎలక్ట్రిక్ షాక్ జనరేట్ అవుతుంది. అలాంటి అమ్మాయి జీవితంలోకి ప్రేమించిన అబ్బాయి వచ్చిన తర్వాత ఏం జరిగింది?

**ప్రస్తుతం ఇండస్ట్రీలో మీరు కంఫర్టబుల్ ప్లేస్‌లో ఉన్నారని అనిపిస్తుందా?**

నెలకు దాదాపు 20 కథలు వింటుంటాను. దర్శకులు, నిర్మాతలు నాతో పని చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

**మీకు ఏ జోనర్ సినిమాలు చేయడం ఇష్టం?**డ్రామా జోనర్ నాకు చాలా ఇష్టం. అలాంటి పాత్రలకు నేను బాగా సరిపోతానని అనుకుంటాను.

**సినిమా ఫైనల్ అవుట్‌పుట్ చూశారా?**బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ లేకుండానే సినిమా చూశాను. ఒక సినిమా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ లేకుండానే కనెక్ట్ అయితే అది మంచి సినిమా అని నా నమ్మకం.

## ప్రసాద్ ల్యాబ్స్‌లో '1=100' టీజర్ లాంచ్



శకుంతల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బాబా మైలవరం దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం "1=100" టీజర్ లాంచ్ వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ నిర్మాత రిజ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై టీజర్‌ను ఆవిష్కరించి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.వెస్టర్న్ స్టైల్ విజువల్స్, యాక్షన్ ఎలిమెంట్స్, అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో కూడిన ఈ టీజర్ ప్రేక్షకులను, సినీ ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. అనిల్ కుమార్ వేగూరు సినిమాటోగ్రఫీ, కెన్నీ చైతన్య సంగీతం, నందమూరి హరి ఎడిటింగ్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయి. రాజు ఎంటర్‌టైనర్స్, స్పార్కిల్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఇప్పటికే టీజర్‌కు వస్తున్న భారీ రెస్పాన్స్ తమకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోందని, త్వరలోనే సినిమా మరిన్ని వివరాలను వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది.



## 'మహాకాళి' 125 రోజుల షూటింగ్ పూర్తి

ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయూ)లో ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రం 'మహాకాళి' చివరి దశ చిత్రీకరణలోకి అడుగుపెట్టింది. ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై ఆర్కే దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్న ఈ మైథాలజికల్ ఎపిక్‌కు ప్రశాంత్ వర్మ క్రియేటర్‌గా వ్యవహరిస్తుండగా, పూజా కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం విజయవంతంగా 125 రోజుల షూటింగ్ పూర్తి చేసుకుంది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఐమ్యాక్స్ ఫార్మాట్‌ను దృష్టిలో పెట్టుకుని చిత్రీకరిస్తున్నారు. ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా మేకర్స్ ఈ సినిమాను రూపొంది స్తున్నారు. ఇక షూటింగ్‌లో మరో కీలక మైలురాయిని కూడా ఈ చిత్రం చేరుకుంది. ఇందులో ముఖ్య పాత్ర పోషిస్తున్న రోహిత్ సరాఫ్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేశారు. అలాగే శుక్రాచార్య పాత్రలో నటిస్తున్న అక్షయ్ ఖన్నా ఇప్పటికే తన భాగం చిత్రీకరణను పూర్తి చేశారు. ఈ చిత్రంలో మహాకాళి పాత్రలో భూమి శెట్టి నటిస్తున్నారు. ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌లో మహాకాళి రూపంలో కనిపించిన తీరు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే శుక్రాచార్యగా అక్షయ్ ఖన్నా ఫస్ట్ లుక్ కూడా భారీ స్థాయిలో స్పందన తెచ్చుకుని సినిమాపై అంచనాలను మరింత పెంచింది.ఈ చిత్రానికి స్మరణ్ సాయి సంగీతం అందిస్తుండగా, సురేష్ రగుతు సినిమాటోగ్రఫీ, శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్.

## 'వెంకట్రామయ్య గారి తాలూకా' ప్రీ రిలీజ్



ప్రముఖ జానపద గాయని కోమలి నిర్మాతగా మారుతూ నిర్మించిన భావోద్వేగ కుటుంబ కథా చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' జూలై 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దినేష్ కుమార్ హీరోగా, ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయమ వుతున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహిం చారు. 'చిన్న సినిమాలకు మా పార్టీ అండగా ఉంటుంది" – కల్వకుంట్ల కవితముఖ్య అతిథి కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, ఫోక్ సింగర్ కోమలి ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించారని ప్రశంసించారు. సినిమా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షి స్తూ, చిన్న సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించాలని సూచించారు. దర్శకుడు దశరథ్ మాట్లాడుతూ, కోమలి ఎంతో అంకిత భావంతో ఈ చిత్రాన్ని నిర్మించారని అన్నారు. కుటుంబ బంధాలు, భావోద్వేగాలతో తెరకెక్కిన ఈ చిత్రం ..మానవ సంబంధాల విలువను గుర్తు చేసే కథ.. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలకు ప్రేక్షకులతో పాటు సినీ వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. మానవ సంబంధాలు, తల్లిదండ్రుల విలువ, కుటుంబ బంధాలు, తండ్రిపిల్లల అనుబంధం వంటి అంశాలను హృద్యంగా ఆవిష్కరించిన ఈ చిత్రం ప్రతి కుటుంబాన్ని ఆలోచింపజేసేలా ఉంటుందని చిత్రబృందం తెలిపింది.ప్రస్తుతం డబ్బు చుట్టూ తిరుగుతున్న సమాజంలో వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను హృదయానికి హత్తుకునే విధంగా ఈ చిత్రంలో చూపించినట్లు పేర్కొన్నారు.ప్రధాన పాత్రధారి మురళీధర్‌గౌడ్ మాట్లాడుతూ, తన సినీ జీవితంలో ఎంతో కాలంగా చేయాలనుకున్న పాత్ర ఈ చిత్రంలో లభించిందన్నారు. "డీజే టిల్లు" తర్వాత తనకు అత్యంత సంతృప్తినిచ్చిన పాత్ర ఇదేనని చెప్పారు




# సెమీస్‌లో సూపర్ క్లాష్

## అర్జెంటీనా, ఇంగ్లాండ్ అమీతుమీ * నేటి అర్ధరాత్రి 12.30 గంటలకు

**అట్లాంటా, జులై 14:** ఫుట్‌బాల్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్ సెమీఫైనల్లో అర్జెంటీనా–ఇంగ్లండ్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి తర్వాత మ్యాచ్ ప్రారంభమవుతుంది. చరిత్ర, ప్రతిష్ఠ, భావోద్వేగాలు, స్టార్ ఆటగాళ్ల పోరు... ఇలా అన్నీ కలిసిన ఈ మ్యాచ్‌ను టోర్నీలోనే అత్యంత ఉత్కంఠభరిత సమరంగా మారింది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా మరోసారి ప్రపంచకప్ ఫైనల్ చేరి వరుసగా టైటిల్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా, దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత ప్రపంచకప్ గెలవాలన్న కలతో ఇంగ్లండ్ బరిలోకి దిగుతోంది. ప్రపంచ ఫుట్ బాల్ చరిత్రలో అత్యంత ఉద్విగ్నమైన ప్రత్యర్థులుగా పేరొందిన ఈ రెండు జట్లు మరోసారి ప్రపంచకప్ వేదికపై తలపడుతుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజేత నేరుగా ఫైనల్‌కు చేరుకోనుండగా, ఓడిన జట్టు మూడో స్థానం కోసం పోరాడాల్సి ఉంటుంది.

### మెస్సీ పైనే అర్జెంటీనా ఆశలు

అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ మరోసారి జట్టుకు ప్రధాన బలంగా నిలుస్తున్నాడు. టోర్నీ మొత్తం అతని అనుభవం, నాయకత్వం, కీలక సమయాల్లో గోల్స్ సృష్టించే సామర్థం అర్జెంటీనాను సెమీస్ వరకు తీసుకొచ్చాయి. పాసింగ్, దాడుల్లో వేగం, రక్షణలో క్రమశిక్షణ జట్టుకు ప్రధాన బలాలు. క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్లాండ్‌పై సాధించిన విజయంతో అర్జెంటీనా పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ప్రత్యర్థి బలమైన ఇంగ్లండ్ అయినప్పటికీ, పెద్ద మ్యాచ్‌లలో ఒత్తిడిని జయించే అనుభవం తమకు కలిసివస్తుందని అర్జెంటీనా భావిస్తోంది. కోచ్ లియోనెల్ స్కలోనీ వ్యూహాలు కూడా జట్టుకు బలంగా మారాయి.

### బెల్లింగ్‌హామ్, కేన్‌లపై ధీమా

ఇంగ్లండ్ జట్టు యువ ఆటగాళ్లు, అనుభవజ్ఞుల సమన్వయంతో బలంగా కనిపిస్తోంది. కెప్టెన్ హ్యారీ కేన్ గోల్స్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుండగా, జూడ్ బెల్లింగ్‌హామ్ మిడ్ ఫీల్డ్‌లో జట్టుకు వెన్నెముకలా నిలుస్తున్నాడు. వేగవంతమైన కౌంటర్ అటాక్స్, సెట్‌పీస్‌లలో ఇంగ్లండ్ ప్రమాదకరంగా మారుతోంది. క్వార్టర్ ఫైనల్లో నార్వేపై సాధించిన విజయం జట్టులో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. కోచ్ రూపొందించిన వ్యూహాలను ఆటగాళ్లు సమర్థంగా అమలు చేస్తుండటంతో టైటిల్‌పై ఆశలు పెరిగాయి. ఇంగ్లండ్ జట్టు యువ స్టార్ జూడ్ బెల్లింగ్‌హామ్ అద్భుత ఫామ్‌లో ఉండగా, కెప్టెన్ హ్యారీ కేన్ అనుభవం జట్టుకు ప్రధాన బలంగా నిలుస్తోంది.

### హ్యాండ్ ఆఫ్ గాడ్

అర్జెంటీనా–ఇంగ్లండ్ పోరుకు దశాబ్దాల చరిత్ర ఉంది. 1966 ప్రపంచకప్ వివాదాల నుంచి 1986లో మారడోనా చేసిన "హ్యాండ్ ఆఫ్ గాడ్" గోల్, అదే మ్యాచ్‌లో చేసిన అద్భుత సోలో గోల్, ఆ తర్వాతి ప్రపంచకప్ పోటీలు ఈ ప్రత్యర్థిత్వాన్ని మరింతగా పెంచాయి. ఈ సెమీఫైనల్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అర్జెంటీనా బంతిని ఎక్కువ సేపు తమ ఆధీనంలో ఉంచి అవకాశాలను సృష్టించడంలో నైపుణ్యం కలిగి ఉంది. మరోవైపు ఇంగ్లండ్ వేగవంతమైన దాడులు, ఎత్తైన క్రాస్‌లు, శారీరక దృఢత్వంతో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టగలదు. మిడ్ ఫీల్డ్‌లో ఆధిపత్యం సాధించే జట్టే మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

అర్జెంటీనాకు అనుభవం, మెస్సీ నాయకత్వం ప్రధాన బలం కాగా, ఇంగ్లండ్‌కు యువ శక్తి, వేగవంతమైన ఆట, సమిష్టి ప్రదర్శన బలంగా ఉన్నాయి. చిన్న పొరపాటు కూడా మ్యాచ్ గమనాన్ని మార్చే అవకాశం ఉండటంతో అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మెస్సీ–బెల్లింగ్‌హామ్, మెస్సీ–కేన్ వంటి స్టార్ ఆటగాళ్ల మధ్య పోటీ ఈ మ్యాచ్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. యంగ్ గన్స్ తమ ఛాన్స్ కోసం చూస్తున్నారు.

### హెడ్ టు హెడ్

| అంశం | అర్జెంటీనా | ఇంగ్లండ్ |
|---|---|---|
| ప్రపంచకప్ | 3 | 1 |
| బలం | బంతిపై ఆధిపత్యం | కౌంటర్స్ |
| స్టార్స్ | మెస్సీ | హ్యారీ కేన్ |
| యంగ్‌గన్స్ | ఎంజో | బెల్లింగ్‌హామ్ |


### శుభ్‌మన్ గిల్ కెప్టెన్ ఇన్నింగ్

# తొలి వన్డేలో గ్రాండ్ విక్టరీ

**బర్మింగ్హామ్, జులై 14:** ఇంగ్లాండ్ గడ్డపై అయిదు టీ20ల సిరీస్‌లో బోల్తా కొట్టిన టీమిండియా... వన్డేలకు వచ్చేసరికి అదరగొట్టింది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన తొలి వన్డేలో గ్రాండ్‌విక్టరీ అందుకుంది. ఇంగ్లాండ్‌పై ఆరు వికెట్ల తేడాతో నెగ్గి మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసింది. ఇంగ్లాండ్ విధించిన 259 రన్స్ లక్ష్యాన్ని టీమిండియా మరో 4.4ఓవర్లు మిగిలివుండగానే 4 వికెట్లు కోల్పోయి అందుకుంది.

### శుభ్‌మన్ గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్

ప్రారంభ ఓవర్ నుంచే శుభ్‌మన్(75 బంతుల్లో 80 రిటైర్డ్‌హర్ట్; 11 ఫోర్లు, ఓ సిక్స్) బ్యాట్‌కు పని పెట్టాడు. రోహిత్ శర్మకు ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించాడు. తొలి వికెట్‌కు 43రన్స్ అందించాడు. ఈ దశలో రోహిత్ శర్మ(11), విరాట్ కోహ్లీ(5) అయిదు పరుగుల తేడాతో అవుటవడంతో భారత్ కష్టాల్లో పడింది. క్రీజ్‌లోకి వచ్చిన శ్రేయాస్ అయ్యర్(53 బంతుల్లో 35) అండగా శుభ్‌మన్ స్కోరును ముందుకు నడిపాడు. ముఖ్యంగా గిల్ ఇంగ్లాండ్ బౌలర్లపై బౌండరీలతో 51బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. భారత్ స్కోరును 19.4 ఓవర్లలో వందకు చేర్చాడు. అలాగే మూడో వికెట్‌కు 101 బంతుల్లో సెంచరీ భాగ స్వామ్యాన్ని నిర్మించాడు. 25.4 ఓవర్లకు భారత్ 149 పరుగులకు చేరింది. ఈ దశలో గిల్‌కు తొడకండరాలు పట్టేయడంతో ఇబ్బందిపడ్డాడు. రిటైర్డ్‌హర్ట్‌గా మైదానం వీడాడు.



### అక్షర్, వాషింగ్టన్ ఆల్‌రౌండ్ షో

149 పరుగుల వద్ద గిల్ రిటైర్డ్‌హర్ట్ కాగా... 11 పరుగుల తేడాతో శ్రేయాస్(35), రాహుల్(1) వెనుదిరిగాడు. ఈ సారి భారత్ ఇన్నింగ్స్‌ను ఆలౌరౌండర్లు అక్షర్ పటేల్(52 బంతుల్లో 57), వాషింగ్టన్ సుందర్(63 బంతుల్లో 52) ఆదుకున్నారు. అజేయ అర్ధసెంచరీలతో కదం తొక్కారు. 5వ వికెట్‌కు అజేయంగా 102రన్స్ జోడించడంతో 45.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

### బౌలర్ల విజృంభణ

అంతకుముందు టాస్ గెలిచిన ఇంగ్లాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 47.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు బెతెల్(14), డకెట్(45 బంతుల్లో 43) దూకుడుగా ఆడుతూ తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించారు. గుర్నూర్ బ్రార్ ఒకే ఓవర్లో ఓపెనర్లిద్దరినీ అవుట్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికాడు. ఇక బుమ్రా రెండో స్పెల్ తొలి బంతికే కెప్టెన్ హ్యారీ బ్రూక్(1)ను అవుట్ చేశాడు. మరోవైపు ప్రసిద్ధ్ కృష్ణ కూడా చెలరేగి బట్లర్(5), కుర్రాన్‌ను ఒకే ఓవర్లో అవుట్ చేశాడు. భారత బౌలర్ల దెబ్బకు 22 ఓవర్లలోనే ఇంగ్లాండ్ ఆరు వికెట్లను చేజార్చుకుంది. అయితే, లియామ్ డాసున్(68), జో రూట్(76 నాటౌట్) ఏడో వికెట్‌కు 121 పరుగులు జోడించి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను ఆదుకున్నారు. ఆఖర్లో మళ్లీ పుంజుకున్న భారత బౌలర్లు స్వల్ప వ్యవధిలో వికెట్లు తీసి ఇంగ్లాండ్‌ను ఆలౌట్ చేశారు. స్పిన్నర్ అక్షర్ పటేల్ నాలుగు వికెట్లు తీసి లోయర్ ఆర్డర్ పనిపట్టాడు.

## జపాన్ ఓపెన్ రెండో రౌండ్‌లో పివి సింధు

**టోక్యో, జులై 14:** జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఏస్ షట్లర్ పీవీ సింధూ శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో 21–14, 21–11తో మలేషియాకు చెందిన వోంగ్ లింగ్ చింగ్‌ను రెండు గేముల్లోనే చిత్తు చేసింది. అలవోక విజయంతో రెండో రౌండ్‌కు చేరింది. మ్యాచ్‌ఆరంభం నుంచి సింధూ ఆధిపత్యం ప్రదర్శించింది. ఆద్యంతం దూకుడును ప్రదర్శించిన సింధూ... బ్యాక్‌హాండ్, నెట్ డ్రిబిల్స్, డెఫ్ట్ డ్రాప్స్, హాఫ్ స్మాషస్ షాట్లతో చెలరేగి రెండు గేముల్లోనే ప్రత్యర్థిని చిత్తు చేసింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో ధ్రువ్ కపిలాతనీషా క్రాస్టో జోడీ 21–16, 21–14తో స్కాట్లాండ్‌కు చెందిన అలెగ్జాండర్ డున్ జూలీ మాక్‌ఫెర్సన్ జోడీని ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. మరో రోహన్ కపూర్, రుత్వికా శివాని తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టారు. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్–చిరాగ్ జోడీ గాయంతో టోర్నీ నుంచి వైదొలిగారు.




## 150 వికెట్ల క్లబ్‌లో బుమ్రా

**బర్మింగ్హామ్, జులై 14:** భారత స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అద్భుత అరుదైన ఘనత అందుకున్నాడు. ఇంగ్లాండ్‌తో తొలివన్డేలో కెప్టెన్ హ్యారీ బ్రూక్ వికెట్ తీసి... వన్డేల్లో 150 వికెట్లు పూర్తి చేశాడు. కేవలం 90వ వన్డేలోనే ఈ మైలురాయి అందుకున్నాడు. భారత్ తరపున అత్యంత వేగంగా ఈఘనత సాధించిన మూడో బౌలర్‌గా నిలిచాడు. మహ్మద్ షమీ, కుల్దీప్ యాదవ్ అతనికంటే ముందున్నారు. అలాగే ఇంగ్లాండ్ గడ్డపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గానూ బుమ్రా మరో రికార్డు సాధించాడు. ఇంగ్లాండ్ గడ్డపై బుమ్రా ఇప్పటి వరకు 31 వికెట్లు తీశాడు. దీంతో జడేజా (30), భువనేశ్వర్(28), మదన్ లాల్ (27)ను బుమ్రా వెనక్కి నెట్టాడు. మూడు ఫార్మాట్లలోనూ 100 అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన భారత బౌలర్‌గా ఇప్పటికే బుమ్రా ఘనత సాధించాడు. వన్డేల్లో 150, టెస్టుల్లో 234వికెట్లు, టీ20ల్లో 121 వికెట్లను బుమ్రా పడగొట్టాడు.

# పశ్చిమాసియా ఎఫెక్ట్.. నష్టాల్లో స్టాక్ సూచీలు




**ముంబయి, జులై 14:** మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవడం, అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, ముడిచమురు ధరలు భారీగా పెరగడం వంటి ప్రతికూల పరిణామాల నేపథ్యంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ఐటీ, ఆటో, బ్యాంకింగ్ రంగాల షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి కనిపించగా, ఫార్మా, మెటల్ రంగాల షేర్లు కొంత మద్దతుగా నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 561.46 పాయింట్లు పడిపోయి 77,054.94 వద్ద ముగియగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 158.95 పాయింట్లు కోల్పోయి 24,052.05 వద్ద స్థిరపడింది. వరుసగా మూడుట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 1.38 శాతం, సెన్సెక్స్ 1.45 శాతం క్షీణించాయి. నిఫ్టీ సూచీపై అత్యధిక ఒత్తిడి తీసుకొచ్చిన షేర్లలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.34 శాతం, లార్సెన్ అండ్ టూబ్రో(ఎల్ అండ్ టీ) 2.11 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.09 శాతం నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో కూడా అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.54 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.08 శాతం తగ్గాయి. బీఎస్ఈలో మొత్తం 1,501 షేర్లు లాభపడగా, 2,737షేర్లు నష్టపోయాయి. 203 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 3.49 డాలర్లు (4.19 శాతం) పెరిగి 86.79 డాలర్లకు చేరుకుంది.

విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.2600 వద్ద ట్రేడవగా, గత సెషన్ ముగింపు95.6800గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు5, 2026గడువుగల బంగారం ఫ్యూచర్స్ ధర 0.54 శాతం పెరిగి 10 గ్రాములకురూ.1,41,060కు చేరుకుంది. బయోకాన్ షేరు6.34శాతం ఎగసి రూ.437కు చేరుకుంది. ల్యాండ్‌మార్క్ కార్స్ షేరు20శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేరు 4.63శాతం క్షీణించింది. కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాలను యథాతథంగా కొనసాగించడంతో పెట్టుబడిదారులు నిరాశ చెందారు. పీడీఎస్ షేరు 5.89శాతం లాభపడగా, ప్లాస్టిబ్లెండ్స్ ఇండియా1.39శాతం పెరిగింది. ఈఎంఎస్ షేరు 2.46 శాతం తగ్గింది. ఉత్తరప్రదేశ్ జల్ నిగమ్ (అర్బన్), వారణాసి నుంచి రూ. 105.82 కోట్ల విలువైన మురుగునీటి ప్రాజెక్టుకు అత్యల్ప ధరబిడ్డర్‌గా ఎంపికైనప్పటికీ షేరు ఒత్తిడిలోనే ముగిసింది. వెల్‌స్పన్ కార్ప్ 4.08 శాతం పెరిగింది. ఖైతాన్ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ 2.83 శాతం, కృష్ణ ఫాస్‌కెమ్ 1.19 శాతం చొప్పున పడిపోయాయి. ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓకు మంగళవారం సాయంత్రం 4:24 గంటల వరకు 12.45 కోట్ల షేర్ల ఆఫర్‌కు గాను 8.16 కోట్ల షేర్లకు దరఖాస్తులు అందాయి. దీంతో ఈ ఇష్యూ 0.66 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జులై 14న ప్రారంభమై ఈనెల 16న ముగియనుంది. షేరు ధరల శ్రేణి రూ.545–574గా నిర్ణయించారు. ఆల్విన్ టెక్స్‌వర్ల్డ్ ఐపీఓకు కూడా మంగళవారం సాయంత్రం 4:24 గంటల వరకు 1.20 కోట్ల షేర్ల ఆఫర్‌కు గాను 32.52 లక్షల షేర్లకు మాత్రమే బిడ్లు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 0.27 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జులై 14న ప్రారంభమై ఈనెల 16న ముగియనుంది. షేరు ధరల శ్రేణి రూ.100–105గా నిర్ణయించారు.

## 62 పైసలు క్షీణించి 96.30కి చేరిక

**ముంబయి, జులై 14:** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రరూపం దాల్చడంతో భారత రూపాయి మంగళవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే భారీగా బలహీనపడింది. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి 62 పైసలు క్షీణించి డాలర్‌కు రూ.96.30వద్ద ముగిసింది. ప్రారంభంలో రూపాయి రూ.95.95 వద్ద ట్రేడింగ్ ప్రారంభించినప్పటికీ, రోజు మొత్తం విక్రయ ఒత్తిడి కొనసాగడంతో చివరకు 62 పైసలు నష్టపోయి 96.30 వద్ద స్థిరపడింది. విదేశీ మారక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ముడి చమురు ధరలు పెరగడం, పెట్టుబడిదారులు భద్రమైన పెట్టుబడుల



వైపు మొగ్గుచూపడంతో అమెరికా డాలర్‌కు డిమాండ్ పెరగడం రూపాయిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలాన్ని సూచించే డాలర్ ఇండెక్స్ 0.16 శాతం తగ్గి 101.07 వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర బ్యారెల్‌కు 86.42 డాలర్లకు చేరి 3.75 శాతం పెరిగింది.

### ఎన్ఆర్ఐ ప్రత్యేక డిపాజిట్ పథకానికి 10 బిలియన్ డాలర్లు

## రూపాయికి అండగా ఆర్‌బీఐ చర్యలు



**న్యూఢిల్లీ, జులై 14:** ఎన్ఆర్ఐలు కోసం రిజర్వు బ్యాంక్ ప్రవేశపెట్టిన ప్రత్యేక డిపాజిట్ పథకం ద్వారా ఇప్పటివరకు సుమారు 10 బిలియన్ డాలర్ల నిధులు భారత్‌కు వచ్చినట్లు వెల్లడి అయింది. విదేశీ మారక నిల్వలను బలోపేతం చేయడంతో పాటు రూపాయి విలువకు మద్దతు ఇవ్వాలనే లక్ష్యంతో ఆర్‌బీఐ చేపట్టిన ఈచర్యకు మంచి స్పందన లభించింది. ద్రవ్య విధాన సమీక్షలో ఎన్ఆర్ఐల నుంచి బ్యాంకులు సమీకరించే విదేశీ కరెన్సీ డిపాజిట్ల కోసం జీరోకాస్ట్ ఫారెక్స్ స్వాప్ సౌకర్యాన్ని ఆర్‌బీఐ ప్రకటించింది. దీంతో బ్యాంకులు ఎన్ఆర్ఐలకు మరింత ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందించే అవకాశం లభించింది. తర్వాత గతనెల 23న ఆర్‌బీఐ ఈ డిపాజిట్లపై రుణాలు ఇవ్వడానికి, వాటిపై లియన్ నమోదు చేసేందుకు బ్యాంకులకు అనుమతి కల్పించింది. దీంతో లీవరేజ్ వినియోగానికి అవకాశం ఏర్పడి, ఈ పథకం మరింత ఆకర్షణీయంగా మారింది. ఈ స్పష్టీకరణ అనంతరం గత వారం నుంచి నిధుల ప్రవాహం వేగం పెరిగిందని ఒక అధికారి తెలిపారు. సెప్టెంబర్ 30 వరకు బ్యాంకులు ఈ డిపాజిట్లను సమీకరించే గడువు ఉండటంతో, ఎక్కువ మొత్తంలో నిధులు చివరి దశలో వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే, మీడియాతో మాట్లాడేందుకు అనుమతి లేకపోవడంతో సంబంధిత అధికారులు తమ పేర్లను వెల్లడించేందుకు నిరాకరించారు. ఈ అంశంపై స్పందించాలంటూ పంపిన ఈమెయిల్‌కు ఆర్‌బీఐ తక్షణ స్పందన ఇవ్వలేదు. 30–60 బిలియన్ డాలర్ల వరకు నిధులు వచ్చే అవకాశంప్రస్తుతం సమీకరించిన 10 బిలియన్ డాలర్లు, ఈ పథకం ద్వారా వచ్చే మొత్తం అంచనా నిధుల్లో చిన్న భాగమేనని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

## 100 బిలియన్ డాలర్లకు టాటా ఆటోమొబైల్స్ టార్గెట్

**న్యూఢిల్లీ, జులై 14:** టాటా గ్రూప్‌కు చెందిన ఆటోమొబైల్ వ్యాపారాన్ని వచ్చేఐదేళ్లలో 100 బిలియన్ అమెరికన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తెలిపారు. దేశీయ వ్యాపార విస్తరణ కోసం రూ.40వేల కోట్ల మూలధనం ఖర్చుచేస్తామని, జాగ్వార్ ల్యాండ్ రోవర్ కోసం సుమారు 20 బిలియన్ బ్రిటిష్ పౌండ్ల పెట్టుబడి ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 81వ ఏజీఎం లో వర్చువల్‌గా పాల్గొన్న చంద్రశేఖరన్, వాటాదారులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ వివరాలు వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహనాలవిభాగంలో ప్రస్తుతం ఉన్న సుమారు 42 శాతం మార్కెట్ వాటాను కొనసాగిస్తూ, భవిష్యత్తులో 40–45 శాతం మార్కెట్ వాటాను నిలబెట్టుకోవడమే కంపెనీ లక్ష్యమని చెప్పారు. కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ఆకర్షణీయమైన కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకురావడంపై టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ దృష్టి సారిస్తుందని ఆయన తెలిపారు. 2030 నాటికి వాహనాల విక్రయాలను పది రెట్లు పెంచడంతో పాటు దేశీయ ప్యాసింజర్ వాహనాల మార్కెట్లో 20 శాతం వాటాను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్, టాటా మోటార్స్ లిమిటెడ్ రెండూ అత్యంత ప్రతిష్ఠాత్మక లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాయి.






## 6.51 లక్షల కోట్లకు ప్రత్యక్ష పన్నుల వసూళ్లు

**న్యూఢిల్లీ, జులై 14:** దేశంలో ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలల్లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. జూలై 13, 2026 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 16.4 శాతం పెరిగి రూ.6.51 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈ మేరకు ఆదాయపు పన్నుశాఖ సోషల్‌మీడియా వేదిక ఎక్స్‌లో వెల్లడించింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూలై 13 నాటివరకు స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు, రీఫండ్‌లు, నికర ప్రత్యక్ష పన్ను వసూళ్ల వివరాలను విడుదల చేసినట్లు తెలిపింది. వివరాల ప్రకారం, స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.6.66 లక్షల కోట్లతో పోలిస్తే 16.11 శాతం పెరిగి రూ.7.74 లక్షల కోట్లకు చేరాయి. ఇదే సమయంలో పన్ను చెల్లింపుదారులకు జారీ చేసిన రీఫండ్‌ల విలువ రూ.1.22 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 14.57శాతం అధికం. పన్ను చెల్లింపుదారుల రీఫండ్ క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరిస్తున్నట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. రీఫండ్‌లను మినహాయించిన తర్వాత నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.6.51 లక్షల కోట్లకు చేరుకోగా, గత ఏడాది ఇదే కాలంలో ఈ మొత్తం రూ.5.59 లక్షల కోట్లుగా ఉంది. ఈ వృద్ధికి కార్పొరేట్ పన్ను, కార్పొరేట్‌తర పన్ను వసూళ్లు రెండూ బలంగా పెరగడం ప్రధాన కారణమని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది. ముఖ్యంగా వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు, సంస్థలు, వ్యక్తుల సంఘాలు, స్థానిక సంస్థలు, కృత్రిమ న్యాయ వ్యక్తులు చెల్లించే కార్పొరేట్‌తర పన్నులు ప్రత్యక్ష పన్ను ఆదాయంలో అత్యధిక వాటాను కొనసాగించాయి.

### భారత్‌లో టాప్100 బ్రాండ్ల విలువ

## 252.8 బిలియన్ డాలర్లు




**ముంబై, జులై 14:** భారత్‌లోని టాప్100 అత్యంత విలువైన బ్రాండ్ల మొత్తం బ్రాండ్ విలువ విలువ252.8బిలియన్ డాలర్లకు చేరిందని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా 100–2026 నివేదిక వెల్లడించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 7 శాతం వృద్ధి సాధించినట్లు స్పష్టం అయింది. టాప్10 బ్రాండ్లలో తొమ్మిది బ్రాండ్లు తమ బ్రాండ్ విలువను పెంచుకోవడం భారతీయ కంపెనీల బలమైన స్థిరత్వాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపింది. కార్పొరేట్ సంస్థల్లో టాటా గ్రూప్ వరుసగా 10వ ఏడాది కూడా భారత్‌లో అత్యంత విలువైన బ్రాండ్‌గా నిలిచింది. టాటా బ్రాండ్ విలువ 7 శాతం పెరిగి 33.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇన్ఫోసిస్ 16.4బిలియన్ డాలర్ల బ్రాండ్‌విలువతో ఎలాంటి మార్పు లేకుండా నిలిచి, వరుసగా ఐదో ఏడాది దేశంలో రెండో అత్యంత విలువైన బ్రాండ్‌గా తన స్థానాన్ని కొనసాగించింది. ఎల్ఐసీ గ్రూప్ బ్రాండ్ విలువ 12శాతం పెరిగి 15.3బిలియన్ డాలర్లకు చేరింది. దేశవ్యాప్తంగా, ముఖ్యంగాగ్రామీణ ప్రాంతాల్లో విస్తృత నెట్‌వర్క్, ప్రపంచంలోనే అతిపెద్ద ఏజెంట్ వ్యవస్థ ఉండటం ఎల్ఐసీకి బలంగా మారిందని తెలిపింది. ప్రైవేట్ బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగంలో హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ బ్రాండ్ విలువ 2 శాతం తగ్గి 13.9 బిలియన్ డాలర్లకు చేరినా, దేశంలోని ప్రముఖ ప్రైవేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ బ్రాండ్లలో ఒకటిగా తన స్థానాన్ని కొనసాగించింది. రిలయన్స్ గ్రూప్ బ్రాండ్ విలువ 11 శాతం పెరిగి 10.8 బిలియన్ డాలర్లకు చేరింది.

రిటైల్, టెలికాం, డిజిటల్ సేవలు, ఇంధన రంగాల్లో విస్తరణతో పాటు వినియోగదారుల వ్యాపారాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, కంటెంట్, నూతన ఇంధన రంగాల్లో కొనసాగుతున్న పెట్టుబడులు రిలయన్స్ వృద్ధికి ప్రధానకారణాలనిపేర్కొంది. ఎస్‌బీఐ గ్రూప్ బ్రాండ్ విలువ 2 శాతం పెరిగి 9.8బిలియన్ డాలర్లకు చేరింది. భారతబ్యాంకింగ్ వ్యవస్థలోకీలకసంస్థగా ఎస్‌బీఐ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుందని నివేదిక తెలిపింది. హెచ్‌సీఎల్‌టెక్ బ్రాండ్ విలువ 9 బిలియన్ డాలర్ల వద్ద కొనసాగింది. విభిన్న రంగాల ఖాతాదారులు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులు, ఆధారిత సేవలకు పెరుగుతున్న డిమాండ్ కంపెనీ వృద్ధికి బలమని పేర్కొంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.